
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 3
జిల్లా వార్తలు
గురువారం 18, జూలై 2024

గ్రానైట్ దోపిడీ దొంగలు పరారయ్యారు. ఇటు అధికారం, అటు రౌడీయిజంతో గత ఐదేళ్లుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ క్వారీల్లో కడప జిల్లా నుంచి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి సైన్యం తిష్టవేసి రూ.కోట్లు కొల్లగొట్టింది. అధికారం అండతో స్థానికంగా వందలమంది వ్యాపారులు, వారిపై ఆధారపడ్డ వేలాదిమంది కార్మికుల పొట్టగొట్టింది. టీడీపీ కూటమి అధికారంలోకి రావడం.. గనుల్లో జరిగిన అక్రమాలను వెలికి తీస్తామంటూ సీఎం చంద్రబాబు ప్రకటించడంతో తట్టాబుట్టా సర్దుకొని గ్యాంగ్ అంతా పరారైంది. కడప జిల్లా నుంచి చీమకుర్తి ప్రాంతానికి దిగుమతి అయిన వారంతా పాలోమని వెళ్లిపోయారు. అయితే ప్రభుత్వం అన్ని అంశాలపై దర్యాప్తు చేసి దోపిడీ సొమ్ము రాబడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశమైంది.

- గ్రానైట్ గనుల నుంచి కడప పరివారం అవుట్
- ఐదేళ్లుగా అన్నింటినీ దోచేశారు..
- ప్రతి విభాగంలోనూ అధికారం చెలాయింపు
- కోట్లు కొల్లగొట్టిన ఎంపీ అవినాష్ కుటుంబం
- ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రంతో తట్టాబుట్టా సర్దుకుని అందరూ జంప్



జగన్ గ్యాంగ్ పరార్



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ కుంభకోణాలు భారీగా జరిగాయి. చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమలోనైతే అంతా ఆపార్టీ నేతల ఇష్టారాజ్యమే నడిచింది. ముఖ్యమంత్రిగా అప్పటి సీఎం జగన్ కనుసన్నల్లోనే మైనింగ్ దోపిడీ జరిగిందని, ఆదాయంలో తాడేపల్లి ప్యాలెస్‌కు వాటా ఉందన్న ఆరోపణలు వచ్చాయి. గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో జరిగిన దోపిడీ వ్యవహారాన్ని పరిశీలిస్తే అది నిజమని తేటతెల్లమవుతోంది. చీమకుర్తి మండలంలోని గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో ఆంధ్రప్రదేశ్ గనుల అభివృద్ధి కార్పొరేషన్ పరిధిలో 86 ఎకరాల భూమి ఉంది. అందులో 25 ఎకరాలు వివాదంలో చిక్కుకుంది. అది పోను సుమారు 61 ఎకరాల భూమి ఏపీఎండీసీ పరిధిలోనే ఉంది. అందులో సుమారు 43 ఎకరాలను కార్పొరేషన్ జాయింట్ వెంచర్‌లో లీజుకు ఇచ్చింది. అక్కడ నాణ్యమైన గెలాక్సీ గ్రానైట్ నిక్షేపాలు లభిస్తుండటంతో జాయింట్ వెంచర్‌లో లీజు కోసం అప్పట్లో పోటీ కూడా పడ్డారు. ప్రభుత్వంలో ఏపార్టీ ఉన్నా చక్రం తిప్పగల మిడ్‌వెస్టు సంస్థ దానిని దక్కించుకుంది. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏర్పడగానే ఆ సంస్థ అధిపతి రాఘవరెడ్డి తానే జగన్ అన్న స్థాయిలో ఎగిరెగిరిపడ్డారు. కానీ మూడు, నాలుగు మాసాలు తిరక్కుండానే ఆయనకు సీఎం కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. 'జాయింట్ వెంచర్‌లోని సగం క్వారీల్లో వ్యాపారం తాము పంపే మనుషులు చేసుకుంటారు. ఆదాయం అంతా వారికే దక్కుతుంది. కాదూకూడదంటే మొదటికే మోసం వస్తుంది జాగ్రత్త' అంటూ హెచ్చరించారు. ఆ ఫోన్ వచ్చిన మరుసటి రోజే ప్రతాప్‌రెడ్డి అనే గ్రానైట్ వ్యాపారి అక్కడ ప్రత్యక్షమయ్యారు. స్థానికంగా ప్రైవేటు స్థలంలో క్వారీలు నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి స్వయానా కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి మామ. అప్పటి నుంచి నిన్నమొన్నటి వరకూ ఆ సగం సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలోని గ్రానైట్‌లో వచ్చే ఆదాయమంతా వీరే సొంతం చేసుకున్నారు. ఎలాంటి పెట్టుబడి లేకుండా నెలవారీ సరాసరి రూ.3కోట్ల ప్రకారం ఐదేళ్లలో రూ.100కోట్ల ఆదాయం పొందారు. అదంతా అవినాష్‌రెడ్డి కుటుంబానికి చేరిందా? అందులో జగన్ వాటా ఉందా? ఉంటే ఎంత? అనేది పక్కన పెడితే రమారమి వంద కోట్ల ఆదాయం పొందిన బృందం ఇటీవల చడీచప్పుడు లేకుండా క్వారీ వదిలేసి కడపకు పారిపోయింది.

వేస్టునూ వదల్లేదు

కడప నుంచి వచ్చిన వైసీపీ నేతలు క్వారీల్లో వేస్టు రాయి మొత్తం తమకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసులు పెట్టించి క్వారీలను మూసివేయిస్తామని నిర్వాహకులను బెదిరించారు. అప్పటికే ప్రభుత్వం క్వారీ యజమానులకు నోటీసులు ఇచ్చి అందులో టీడీపీలో ముఖ్యులైన వారికి చెందినవి మూసివేసేందుకు శ్రీకారం పలికింది. ఇటు వచ్చిన వారు కడప జిల్లా వారు కావడం, అటు ప్రభుత్వం కూడా దూకుడుగా వ్యవహరిస్తుండటంతో క్వారీల యజమానులు ఈ వేస్టు రాయిని స్థానికులకు కాకుండా కడప వాసులకు ఇవ్వడం ప్రారంభించారు. ఏపీఎండీసీలో అటు అవినాష్‌రెడ్డి కుటుంబీకులు స్వాధీనం చేసుకున్న క్వారీల్లో కానీ, ఇటు విఘ్నేష్ సంస్థ కింద ఉన్న క్వారీల్లో కానీ వేస్టు రాయి దక్కాలంటే వారి కనీస అర్హత కడప జిల్లావాసి కావడంగా మారింది. జిల్లాస్థాయి నేతల నుంచి తిరుగుబాటు రావడంతో అప్పట్లో మంత్రిగా ఉన్న బాలినేని చెప్పిన కొందరికి ఆ రాయిని ఇచ్చారు. అలాంటి వారు కూడా క్వారీ యజమానులను బెదిరించి ఆ రాయిని ఉచితంగా పొందారు. దాన్ని వారు రాజకీయంగా ఎంపిక చేసుకున్న, లేక వారు అడిగిన డబ్బులు ఇచ్చే పాలిషింగ్ యూనిట్లకే సరఫరా చేశారు. దీంతో ముడిసరుకు అందక వందల పాలిషింగ్ యూనిట్లు మూతపడ్డాయి. ప్రభుత్వం మారినా రౌడీయిజంతో అంతోఇంతో చెలాయించాలని చూసిన వీరు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గనుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేసి దోపిడీదారుల అంతు చూస్తానని ప్రకటించడంతో తట్టాబుట్టా సర్దుకొని కడప వెళ్లిపోయారు. ఇలా గెలాక్సీ గ్రానైట్ రంగంలో చొరబడి కోట్ల రూపాయలు దండుకున్న కడప జిల్లాకు చెందిన జగన్ పరివారం గత రెండు రోజుల్లోనే క్వారీలను పూర్తిగా వదిలి వెళ్లిపోవడం విశేషం. మరి కడప నుంచి వచ్చిన జగన్ గ్యాంగ్ నిర్వహించిన ఈ రకమైన దోపిడీపై కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

చోటా నేతల రంగప్రవేశం

జగన్ ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోపే కడప జిల్లాకు చెందిన వైసీపీ చోటా నాయకులు చీమకుర్తి ప్రాంతానికి భారీగా దిగుమతి అయ్యారు. కొందరు పుష్కలంగా గెలాక్సీ నిక్షేపాలు ఉండి వివాదాల్లో ఉన్న స్థలాలను కొట్టేసే ప్రయత్నాలు చేశారు. అదేసమయంలో వ్యక్తులు, సంస్థల మధ్య వివాదాలు ఉన్న అంశాల్లో జోక్యం చేసుకొని సెటిల్‌మెంట్ పేరుతో భారీగా సొమ్ము చేసుకున్నారు. క్వారీల్లో వేస్టు రాయిని బలవంతంగా సొంతం చేసుకొని దండుకోవడంతోపాటు దానిపై ఆధారపడి నడుస్తున్న పరిశ్రమలు మూతపడేందుకు దోహదపడ్డారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు వరకూ గ్రానైట్ క్వారీల్లో రాయిని ఎగుమతి చేసిన తర్వాత మిగిలిన వేస్టు రాయిని స్థానికంగా ఉండే పాలిషింగ్ పరిశ్రమలకు అమ్ముకునే వారు. కొందరైతే రాజకీయ సిఫార్సులకు అనుకూలంగా ఆ రాయిని స్థానికంగా ఉండే నాయకులకు అప్పగించే వారు. పాలిషింగ్ యూనిట్లకు సాధారణ ధరకు సరఫరా చేసేవారు. కొందరు చోటా నాయకులు పాలిషింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి క్వారీలో వచ్చే వేస్టు రాయి పొందడం ద్వారా జీవనోపాధి పొందేవారు. ఆ రకంగా వచ్చే క్వారీల్లోని వేస్టు రాయిని వివిధ సైజుల్లో పాలిషింగ్ చేసి దేశీయ మార్కెట్‌లో విక్రయించి ఆదాయం పొందేవారు. అలాంటి పరిశ్రమలు వేలసంఖ్యలో జిల్లాలో ఏర్పడ్డాయి. ఆ పరిశ్రమలో సుమారు 25 వేలమంది పనిచేస్తూ అదే ఉపాధిగా కుటుంబాలను పోషించుకునే వారు. వైసీపీ పాలనలో వారంతా తీవ్ర ఇబ్బంది పడ్డారు.



ఒంగోలులోని ఎంపీ కార్యాలయంలో మాగుంటను కలిసిన నగర మేయర్ గంగాడ సుజాత

మాజీ మంత్రి, వైసీపీ నేత బాలినేని జోక్యం చేసుకుని నేనొస్తున్నాను ఉండండంటూ కార్పొరేటర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఆగమేఘాలపై సోమవారం ఉదయం ఒంగోలు చేరారు. కార్యకర్తలు ఘనంగానే స్వాగతం పలికారు.

ఫలించని బాలినేని ప్రయత్నం

నలుగురు మినహా మిగిలిన కార్పొరేటర్లంతా ఆయన వద్దకు వచ్చి మేమంతా మీతోనే ఉంటామంటూ చెప్పేశారు. విశ్వాసం పెంచుకున్న బాలినేని.. ప్రభుత్వంపైనా ప్రధానంగా ఎమ్మెల్యే దామచర్లపైనా రెచ్చిపోయి విమర్శలు చేశారు. దామచర్ల కూడా ప్రతివిమర్శకు దిగటంతో రాజకీయం వేడెక్కింది. సోమవారం రాత్రి బాలినేని ఒంగోలులో మకాం వేసి కార్పొరేటర్లతో సంప్రదింపులు జరిపారు. కొందరు బహిరంగంగానే వైసీపీలో తాముండలేమంటూ తేల్చిచెప్పేశారు. మరికొందరిని ఆయన సర్దిపుచ్చారు. మొత్తంగా వెళ్లేవారు వెళ్లినా ఉన్న కార్పొరేటర్లకు అండగా నిలబడి వారిని కాపాడుకుంటానని హామీ ఇచ్చి రెండునెలలు మాత్రం ఒంగోలు రాలేనని చెప్పేసి వెళ్లిపోయారు. ఆయన అటు వెళ్లగానే కార్పొరేటర్లు అంతర్మథనంలో పడిపోయారు.

క్యూకట్టిన కార్పొరేటర్లు

- వచ్చే నెల మొదటివారంలో ముహూర్తం
- దామచర్ల ఓకే అంటే వైసీపీలో మిగిలేది సింగిల్ డిజిటే
- పరిస్థితిని చూసి ఎంపీ మాగుంట వద్దకెళ్లిన మేయర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రతిష్ఠాత్మకమైన ఒంగోలు కార్పొరేషన్ టీడీపీపరం కావడం ఖాయమైపోయింది. వైసీపీ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు మాజీ మంత్రి బాలినేని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆయన ఇలా వచ్చి అలా వెళ్లగానే ఆపార్టీ కార్పొరేటర్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసేందుకు క్యూకట్టారు. ఆయన వద్ద అవకాశం దక్కని మేయర్ గంగాడ సుజాత ఎంపీ మాగుంటను కలిసి పరోక్షంగా పార్టీ మారేందుకు తాను సిద్ధమేనన్న సంకేతాన్ని ఇచ్చారు. ఆచితూచి అడుగేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్ పూర్తిగా తలుపులు తెరిస్తే ఒంగోలులో వైసీపీకి మిగిలే కార్పొరేటర్లు సింగిల్ డిజిట్‌లోనే ఉండబోతున్నారంటే అతిశయోక్తి కాదు. అయితే ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఎమ్మెల్యే దామచర్ల వారంరోజులు అందుబాటులో ఉండనందున కార్పొరేటర్ల చేరికలతో పాలకమండలిపై టీడీపీ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని ఆగస్టు మొదటి వారంలో చేయాలని నిర్ణయించుకున్నారు.

వైసీపీ ఘోర ఓటమితో..

సార్వత్రిక ఎన్నికలకు ముందే ఒంగోలు కార్పొరేషన్‌లోని ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తర్వాత మరింతమంది టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపారు. తొలుత ఫిరాయింపులను ప్రోత్సహించాలా? వద్దా? అన్న సంశయంతో ముందుకు సాగిన ఎమ్మెల్యే జనార్దన్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు పాలకమండలి అవసరాన్ని గుర్తించి కార్పొరేటర్లను చేర్చుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. తర్వాత ఒక్కొక్కరుగా టీడీపీలో చేరే ప్రక్రియ ప్రారంభమైంది. తదనుగుణంగా వైసీపీ కార్పొరేటర్లను చేర్చుకుని పట్టు సాధించాలని ఎమ్మెల్యే దామచర్ల నిర్ణయించుకున్నారు.

మేయర్‌తో సహా క్యూకట్టిన కార్పొరేటర్లు

వ్యక్తిగత అవసరాలకన్నా రాజకీయంగా వైసీపీ వ్యవహారశైలిని జీర్ణించుకోలేని కార్పొరేటర్లు ఆపార్టీకి గుడ్‌బై చెప్పేందుకే నిర్ణయించుకున్నారు. జగన్ మారలేదు, మరోవైపు పార్టీలో కూడా తనకు అన్యాయం జరిగిందని బాలినేని బహిరంగంగా ప్రకటించారు. దీంతో వైసీపీకి భవిష్యత్తే లేదన్న ఆలోచనకు కార్పొరేటర్లు వచ్చినట్లు తెలిసింది. అంతే బుధవారం దామచర్ల ఇంటికి క్యూకట్టారు. మొదటి నుంచి బాలినేనితో కలిసి నడిచిన డిప్యూటీ మేయరు వేమూరి బుజ్జి, మరో ఇద్దరు కార్పొరేటర్ల భర్తలు వెళ్లి ఎమ్మెల్యేను కలిశారు. మరికొందరు కార్పొరేటర్లు.. దామచర్ల సన్నిహితులు, స్థానికంగా ఉండే టీడీపీ నేతల ద్వారా ఆయనకు కబురుపంపారు.



జనార్దన్‌ను కలిసి బొకే ఇస్తున్న వైసీపీ కార్పొరేటర్ భర్త నాని

దామచర్లను కలిసిన కార్పొరేటర్లు.. మరికొందరు కూడా రావటానికి సిద్ధంగా ఉన్నారని మీరు అంగీకరిస్తే తీసుకొస్తామని ఒక జాబితాను ఇచ్చేశారు. కార్పొరేషన్‌లో ఇప్పటికే టీడీపీ కూటమి బలం 13కు చేరగా బుధవారం ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో ఆరుగురు పార్టీ మారేందుకు ఎమ్మెల్యే జనార్దన్‌కు స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో ఆ పార్టీ సభ్యుల సంఖ్య 19కి చేరనుంది. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఏకైక కార్పొరేటరు కూడా టీడీపీలో చేరేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాడు. ఇదే సమయంలో మేయర్ పదవిని ఆశిస్తూ మరో ముగ్గురు కార్పొరేటర్లతో టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఒక కార్పొరేటరు భర్త సమాచారం పంపారు. మేయర్ గంగాడ సుజాత కూడా ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఆయన నుంచి అవకాశం రాకపోవడంతో బుధవారం ఎంపీ మాగుంటను కలిసి తనతోపాటు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్న కార్పొరేటర్ల సమాచారాన్ని తెలిపినట్లు సమాచారం. అయితే మాగుంట.. ఈ విషయమంతా జనార్దన్ చూస్తున్నారు, ఆయననే కలవాలని సూచించి ఎమ్మెల్యేకు సమాచారమిచ్చారు. ఇలా మొత్తంగా పరిశీలిస్తే వైసీపీకి కార్పొరేటర్లలో పదిమంది కూడా మిగులుతారా? లేదా? అన్న సందేహాలు ప్రారంభమయ్యాయి. కాగా ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఎమ్మెల్యే విదేశీ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ఆగస్టు మొదటివారంలో కార్పొరేషన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్
- ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, పోలీసు అధికారుల అభినందనలు



బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు (క్రైం), జూలై 17 : అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టిపెడతామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు గంజాయి, డ్రగ్స్ కట్టడి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని వివరించారు. తాను జిల్లాకు సుపరిచితుడినేనని చెప్పారు. పోలీసు శాఖలో చేరి ప్రొబేషనరీ డీఎస్పీగా విధులు నిర్వహించానని గుర్తుచేశారు. గత మూడేళ్లుగా పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ జిల్లా సమస్యలపై అవగాహన పెంచుకున్నానని వివరించారు. అంతేకాకుండా విజయనగరం ఎస్పీగా పనిచేసిన అనుభవం కూడా తనకు ఉందని గుర్తుచేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు 24గంటలు అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో నేర రహిత జిల్లాగా మార్చేందుకు కృషిచేస్తానన్నారు. తొలుత ఎస్పీ దంపతులకు పూర్ణకుంభంతో పోలీసు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన దామోదర్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావులతోపాటు పలువురు నాయకులు, అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎస్.వి.శ్రీధరరావు అశోక్‌బాబులతోపాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

వామ్మో.. పులి

- రాచర్ల ఫారంలో సంచారం
- నిర్ధారించిన అటవీ సిబ్బంది
- భయాందోళనలో గ్రామస్థులు



పులి సంచరించిన ప్రాంతాలేన్ని పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది, గ్రామస్థులు

గిద్దలూరు, జూలై 17 : రాచర్ల మండలంలోని రాచర్లఫారం గ్రామసమీపంలో పులి సంచరించింది. కొందరు గ్రామస్థులు గ్రామ పరిసరాల్లోని పొలాల్లో పులి అడుగులు గుర్తించారు. బుధవారం ఉదయం అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ సిబ్బంది జమాల్‌బాషా, శ్రీనివాసరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పొలాల్లో ఉన్న పులి కాలి జాడలను పరిశీలించారు. పులి సంచరించినట్లు వారు నిర్ధారించారు. స్పాట్ కెమెరాలను ఏర్పాటు చేసి రెండు రోజులు పరిశీలిస్తామని, మళ్లీ పులి ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తిస్తే దానిని బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అప్పటివరకు పొలాల్లోకి ప్రజలు ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. గ్రామసమీప పొలాల్లో పులి సంచరించిన విషయం వాస్తమేనని నిర్ధారణకావడంతో రాచర్ల ఫారం గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.



సమగ్రశిక్షకు రూ.7.12 కోట్లు

జీతాలు, బిల్లుల చెల్లింపునకు చర్యలు

ఒంగోలు(విద్య), జూలై 17: సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచి జిల్లాకు రూ.7.12 కోట్లు విడుదలయ్యాయి. సమగ్ర శిక్ష ప్రాజెక్టు జిల్లా కార్యాలయం, అందులో పనిచేస్తున్న సిబ్బంది జీతాలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లోని డైట్ బిల్లుల చెల్లింపుల కోసం ఈ నిధులు వచ్చాయి. సిబ్బంది మే, జూన్ నెలల జీతాలకు రూ.5.95 కోట్లు, విద్యార్థినుల డైట్ బిల్లులకు రూ.1.17కోట్లు విడుదలయ్యాయి. కేజీబీవీల్లో పనిచేస్తున్న స్పెషలాఫీసర్లు, సీఆర్పీలు, కుక్‌లు, వాచ్‌మెన్లు, ఎమ్మార్సీల్లో పనిచేస్తున్న సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు. నైట్ వాచ్‌మన్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ప్రాజెక్టు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగాల సిబ్బంది 1,350మంది పనిచేస్తున్నారు. వీరందరికీ మే, జూన్ జీతాల బిల్లుల చెల్లింపులకు కూడా బుధవారమే అంతా సిద్ధం చేశారు. గురు, శుక్రవారాల్లో వీరందరికి జీతాలు అందనున్నాయి. డైట్ బిల్లులు చెల్లించేందుకు కూడా చర్యలు తీసుకున్నారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

• యూజీసీ ఉత్తర్వులు

ఒంగోలు(విద్య), జూలై 17 : ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్(స్వయంప్రతిపత్తి) హోదా లభించింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. జిల్లాలో అటానమస్ హోదా కలిగిన ఏకైక డిగ్రీ కళాశాలగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిలిచింది. అటానమస్ హోదాతో కళాశాలకు వివిధ కోర్సుల సిలబస్ మార్చుకునేందుకు, పరీక్షల నిర్వహణ అధికారం లభించింది. ఫైనల్ పరీక్షలు కూడా కళాశాలే స్వయంగా నిర్వహించనుంది. విద్యార్థుల ఉత్తీర్ణతకు సంబంధించి ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఒరిజనల్ డిగ్రీ మాత్రమే ఆంధ్రకేసరి యూనివర్సిటీ జారీ చేయనుంది. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ కళాశాలలకు మాత్రమే పరిమితమైన అటానమస్ హోదా ప్రస్తుత డిగ్రీ కళాశాలలకు కూడా ఇస్తున్నారు. కళాశాల స్థాపించిన 40 సంవత్సరాలకు అటానమస్ హోదా లభించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ డి.కళ్యాణి తెలిపారు. కళాశాలకు అటానమస్ హోదా 2024నుంచి 2034 వరకు అంటే పదేళ్లపాటు ఉంటుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల మొదటి నుంచి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) గ్రేడ్ సాధిస్తూ ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో 3.35 స్కోరుతో నాక్ ఎ ప్లస్ గ్రేడ్ సాధించిన ఏకైన మహిళా డిగ్రీ కళాశాలగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. జాతీయ స్థాయిలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుతో పాటు ప్రపంచ స్థాయిలో గుగూల్ సంస్థ ద్వారా ఉచితంగా గుగూల్ సూట్ సాధించిందని, అటానమస్ హోదాతో విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

తండ్రిపై తనయుడి హత్యాయత్నం

ఒంగోలు(క్రైం), జూలై17: దుర్వసనాలకు లోనై ఆస్తులు పంచలేదనే కోపంతో తండ్రిపై తనయుడు హత్యాయత్నానికి పాల్పడాడు. ఈ సంఘటన ఒంగోలు నగరం బండ్లమిట్టలో బుధవారం జరిగింది. వివరాలలోకి వెళితే.. నాగులుప్పలపాడు మండలం చవటపాలెంనకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వర్లు బండ్లమిట్ట సెంటర్లో పొగాకు వ్యాపారం చేస్తున్నారు. అయితే తండ్రి ఆస్తులు పంచకుండా దుర్వసనాలకు లోనై ఉన్న ఆస్తులను కాజేస్తున్నాడని అక్కసుతో కుమారుడు రమేష్‌బాబు హత్య చేసేందుకు యత్నం చేశారు. దుకాణంలో ఉన్న వెంకటేశ్వర్లుతో తొలుత గొడవ పడిన కుమారుడు తన ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న చెట్లు నరికే కత్తితో దాడి చేశాడు. దీంతో తండ్రికి మెడ వెనుక గాయమైంది. స్థానికులు బాధితుడిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రేష్ఠ ప్రవేశ పరీక్షలో విద్యార్థిని ప్రతిభ



సిరివెన్నెలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగులుప్పలపాడు, జూలై 17 : జాతీయ స్థాయిలో జరిగిన శ్రేష్ఠ ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఉప్పుగుండూరు విద్యార్థిని ప్రతిభ చూపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 561 మార్కులు సాధించిన ఎండ్లూరి సిరివెన్నెల ఇటీవల ట్రిపుల్ ఐటీ ఎంట్రన్స్ ఫలితాలలో ప్రతిభ చూపి శ్రీకాకుళంలో సీటు సాధించారు. అంతేగాకుండా జాతీయస్థాయిలో నిర్వహించిన శ్రేష్ఠ ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ సిరివెన్నెల 1194 ర్యాంక్ సాధించి తమిళనాడు రాష్ట్రం తిరువూరులోని అబాకస్ ఇంటర్నేషనల్ కళాశాలలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం చలపతిరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక స్కూలులో సిరివెన్నెలను ఉపాధ్యాయులు అభినందించారు.

బాలినేనిపై గుప్తా ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన సుబ్బారావుగుప్తా

ఒంగోలు(క్రైం), జూలై17: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై ఆర్యవైశ్య నాయకుడుసుబ్బారావు గుప్తా బుధవారం ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకర విల్లాస్ విషయంలో తాను అవినీతి జరిగిందని పోరాటం చేస్తున్న విషయం తెలిసేందేని గుప్తా వివరించారు. అందుకు సంబంధించి మాజీ మంత్రి బాలినేని మీడియా సమావేశంలో తనను దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి బాలినేనిపై చర్యలు తీసుకోవాలని అయన కోరారు.

కొండపి రోడ్డుకు మరమ్మతులు

• పంచాయతీ నిధులతో పనులు



రోడ్డుపై డస్ట్‌ను చదును చేస్తున్న రోలర్

టంగుటూరు, జూలై 17 : అధ్వానంగా ఉన్న కొండపి రోడ్డుకు టీడీపీ కూటమి అధికారం చేపట్టిన నెల రోజులకే మోక్షం లభించింది. స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ట్రంకురోడ్డు నుంచి బైపాస్ పై ఓవర్ వరకు 700 మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు అత్యంత కీలకమైనది. మండలంలోని ప్రధాన కార్యాలయాలతోపాటు పొగాకు బోర్డు, క్యాండీపోర్టు, పలు పొగాకు కంపెనీలు, గ్రేడింగ్ పందిళ్లన్నీ ఈ మార్గంలోనే ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం ప్రజలు, కూలీలు, కొండపి, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల ప్రజల రాకపోకలు ఈరోడ్డు నుంచే సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రహదారి గురించి గత వైసీపీ పాలనలో అసలు పట్టించుకోలేదు. దీంతో గోతులమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఐదేళ్లుగా తట్టెడు మట్టి కూడా పోయలేదు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మతులపై ఆపార్టీ నేతలు దృష్టి సారించారు. పంచాయతీ పాలకవర్గం టీడీపీ చేతిలో ఉండటంతో మరమ్మతులు చేపట్టింది. మంగళవారం నుంచి ప్రారంభమైన పనులు గురువారం నాటికి ఒక కొలిక్కిరానున్నాయి. ముందుగా రోడ్డుపై ఉన్న గుంత, మిట్టలను చదును చేశారు. చీమకుర్తి నుంచి క్వారీల డస్ట్ తెప్పించి రోడ్డు పొడవునా పరిచి చదును చేస్తున్నారు. దీంతో ప్రయాణికుల ఇక్కట్లు తాత్కాలికంగా తీరనున్నాయి.

కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

సింగరాయకొండ, జూలై 17 : కుష్ఠువ్యాధి గ్రస్థులను గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందించాలని డిప్యూటీ పారామెడికల్ అధికారి దామా వెంకటేశ్వర్లు సూచించారు. సింగరాయకొండ పీహెచ్‌సీలో బుధవారం డాక్టర్ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు నిర్మూలనా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చేనెల 2తేదీ వరకూ కుష్ఠువ్యాధిగ్రస్థులను గుర్తించే సర్వే కొనసాగుతుందని చెప్పారు. చర్మంపై స్పర్శలేకపోవడం, రాగిరంగు మచ్చలు ఉండటం, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, వెంట్రుకలు రాలిపోవడం, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, కాళ్లనుంచి చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌ఆలీ, సీహెచ్‌వో సాంబశివరావు, డీపీఎంవో ఆదిలక్ష్మి, పద్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా క్రీడాప్రాంగణం

యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు • జీజేసీలో కుళాయిలు, ఇతర సామగ్రి ధ్వంసం • ఆందోళన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు



అర్ధాంతరంగా ఆగిన క్రీడా ప్రాంగణ భవనం



ప్రాంగణంలో పడేసిన గుట్కా, మద్యం, సిగరెట్ వ్యర్థాలు



జూనియర్ కళాశాలలో ధ్వంసమైన కుళాయిలు

కొండపి, జూలై 17 : కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(జీజేసీ)లో అసంపూర్తిగా ఉన్న క్రీడా ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గంజాయి, మద్యం తాగే వారు ఇక్కడ తిష్టవేస్తున్నారు. కళాశాలలోని ఫర్నిచర్‌ను సైతం ధ్వంసం చేస్తున్నారు. వీరి కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ క్రీడామైదానాన్ని మంజూరు చేసింది. ఆ వెంటనే పనులు కూడా ప్రారంభించింది. కొంత పూర్తి చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీని గురించి అసలు పట్టించుకోలేదు. పనులను అలాగే వదిలేసింది. దీంతో అసంపూర్తిగా ఉన్న ఎన్టీఆర్ క్రీడా ఇన్‌డోర్ స్టేడియం ఆకతాయిలకు స్థావరంగా మారింది. ఇక్కడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కళాశాల, కమ్యూనిటీ వైద్యశాల కలిసి ఉంటాయి. పాఠశాల, కళాశాలకు గేట్లు ఉన్నాయి. కమ్యూనిటీ వైద్యశాల ప్రహరీగోడ పగిలిపోవడంతో ఆ దారి నుంచి ఆకతాయిలు ప్రభుత్వ క్రీడాప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నారు. విచ్చలవిడిగా గంజాయి, మద్యం తాగడంతోపాటు ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు, అధ్యాపకులు వాపోతున్నారు. అంతటితో ఆగకుండా రాత్రి వేళల్లో కళాశాలలోని తాగునీటి కొళాయిలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేస్తున్నారని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. సీహెచ్‌సీ అధికారులు ప్రహరీ పునర్నిర్మించాలని, ఆకతాయిలు క్రీడా ప్రాంగణంలోకి ప్రవేశించకుండా పోలీసులు నిరోధించాలని కోరుతున్నారు.

ఘనంగా ఉషోదయ సూపర్‌మార్కెట్ ప్రారంభం

హాజరైన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, ఇతర అతిథులు

సాదర స్వాగతం పలికిన మేనేజింగ్ డైరెక్టర్ యుగంధర్



సూపర్‌మార్కెట్‌ను ప్రారంభించిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల తదితరులు



ఎంపీ మాగుంటకు జ్ఞాపికను అందజేస్తున్న ఎండీ యుగంధర్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 17: ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని ఓపీఎస్ స్కూలు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఉషోదయ సూపర్‌మార్కెట్‌ను బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూపర్‌మార్కెట్‌ను ప్రారంభించగా, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అతిథులుగా మురళీధర్‌రావు, కేఎస్‌జీ గ్రూపు ఎండీ శిద్దా హనుమంతరావు విచ్చేశారు. కగా అతిథులను ఉషోదయ సూపర్ మార్కెట్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.యుగంధర్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత వ్యాపార విలువలతో వినియోగదారుల ఆదరణను చూరగొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఒంగోలులో తమ సంస్థ 31వ సూపర్‌మార్కెట్‌ను ప్రారంభించిందన్నారు. 2005లో హైదరాబాద్‌లోని ఏఎస్ రావునగర్‌లో ఉషోదయ సూపర్ మార్కెట్ తొలి వ్యాపార సంస్థను ప్రారంభించినట్లు చెప్పారు. అనతికాలంలోనే వినియోగదారుల విశ్వాసాన్ని పొంది అంచెలంచెలుగా అభివృద్ధి చెందామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణాలో 19 ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 12 స్టోర్లు ఉన్నాయన్నారు. త్వరలో గుడివాడలో కూడా మరో బ్రాంచిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువులతో పాటు గృహోపకరణాల వరకు అన్ని తమ సూపర్ మార్కెట్‌లో లభిస్తాయన్నారు. మరిన్ని సూపర్ మార్కెట్లను ప్రారంభించే దిశగా అడుగులు వేస్తామని యుగంధర్ తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, డాక్టర్ ఎం.చంద్రశేఖర్, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజానీకం పాల్గొన్నారు.

హుషారుగా జబర్దస్త్ టీం రోడ్‌షో

నేడు ఒంగోలులో ఘనంగా ప్రారంభంకానున్న లక్కీ‌షాపింగ్ మాల్ • హాజరుకానున్న సినీతారలు శ్రీలీల, సంయుక్తమీనన్



నగరానికి విచ్చేసిన జబర్దస్త్ నటులు



వీధుల్లో శకటాలతో ప్రచారం



ప్రచార శకటాలతో ర్యాలీ

ఒంగోలు(కల్చరల్), జూలై 17: ఒంగోలు నగరంలో గురువారం లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి జబర్దస్త్ టీం సందడి చేసింది. మేళతాళాలు, డప్పు వాద్యాలతో భారీ ఊరేగింపుగా వారు నగరంలోని మినీ స్టేడియం దగ్గర నుంచి కర్నూల్‌రోడ్‌లో నూతనంగా నిర్మించిన లక్కీ షాపింగ్‌మాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈక్రమంలో ర్యాలీ జరిగిన రామ్‌నగర్, ట్రంకురోడ్డు, పాతమార్కెట్ సెంటర్, అద్దంకి బస్టాండ్‌లలో వారిని చూడటానికి అభిమానులు పెద్దఎత్తున గుమికూడారు. ఇక లక్కీ‌షాపింగ్ మాల్ గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రముఖ సినీతారలు శ్రీలీల, సంయుక్తమీనన్ చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని షాపింగ్ మాల్ ప్రతినిధులు తెలిపారు. అంతేగాకుండా జిల్లాకు చెందిన పలువురు రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు పాల్గొననున్నారని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కాపు విద్యార్థుల హాస్టల్ కోసం భూమిని కేటాయిస్తాం

• ఎమ్మెల్యే దామచర్ల హామీ



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు(విద్య), జూలై 17: ఒంగోలులో కాపు విద్యార్థులకు హాస్టల్ భవనం నిర్మించేందుకు ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. స్థానిక ఎన్టీఆర్ కళాపరిషత్‌లో బుధవారం జరిగిన అసోసియేషన్ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లా నారాయణరావు మాట్లాడుతూ కాపు విద్యార్థుల భవిష్యత్‌కు నగరంలో ప్రభుత్వం హాస్టల్ వసతి కేటాయించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటిన్, దాచర్ల సీతమ్మ క్యాంటిన్ల ఏర్పాటు చేసేందుకు కొల్లా నారాయణరావు రూ.లక్ష, జె.కృష్ణకుమార్ రూ.25వేల విరాళాన్ని ఎమ్మెల్యే జనార్దన్‌కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఫణీంద్రకుమార్, ఏవీ.ప్రతాప్, కృష్ణకుమార్, సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, తాము శ్రీనివాసరావు, పోలిశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన రోడ్డు పనులను ప్రారంభించాలి

టీడీపీ నాయకుల డిమాండ్

కొత్తపట్నంలో అధ్వాన రోడ్డుతో స్థానికుల అవస్థలు



అసంపూర్తి రోడ్డును పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు

కొత్తపట్నం(ఒంగోలునగరం) జూలై 17: కొత్తపట్నంలో నిలిచిపోయిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, మండలనాయకులు కొత్తపట్నంలో నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీరా ఎన్నికలు సమీపించే సమయంలో రోడ్డు పనులు చేపట్టి మధ్యలోనే ఆపేశారని ఆరోపించారు. తన సొంత నిధులు ఖర్చు చేసి రోడ్డు పనులను పూర్తి చేస్తానని చెప్పిన మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఈ వైపు కూడా చూడటం లేదన్నారు. నిధులు తగినన్ని అందుబాటులో లేకుండానే ఉన్న రోడ్డును ధ్వంసం చేసి డబుల్‌రోడ్డు పేరుతో అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. దీంతో స్థానికులతో పాటు బీచ్ వస్తున్న పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమలో నాయకులు బలగాని వెంకటేశ్వర్లు, పేరయ్య, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

మెడికల్ షాప్ సీజ్



తనిఖీలు చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెకర్ సంధ్య

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 17: ఒంగోలు నగరం ఏకలవ్యనగర్‌లోని ప్రసన్నాంజనేయ మెడికల్ అండ్ ఫ్యాన్సీ దుకాణంలో ఔషధ నియంత్రణ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంధ్య మందుల కొనుగోలు బిల్లులు, సేల్స్ బుక్‌లు పరిశీలించారు. అధిక మొత్తంలో ట్రెమడాల్ ఇంజెక్షన్ల అమ్మకాలు జరుపగా, వాటికి సంబంధించి డాక్టర్ ప్రిస్క్రిప్షన్, బిల్లులు లేకపోవడంపై షాప్ యజమాని బి.శ్రీనివాసులరెడ్డిపై ఆమె సీరియస్ అయ్యారు. అంతేగాకుండా కొన్ని మందులు ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మకం చేయడంపై మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తుండటంపై కేసు నమోదు చేసి షాపునకు తాళాలు వేశారు.

వృద్ధులకు సరుకుల పంపిణీ



సరుకులను అందజేస్తున్న ప్రభుదాస్

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 17 : కారంచేడు అమరవీరులను స్మరించుకుంటూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీతారామపురంలోని సమతా వృద్ధుల ఆశ్రమంలో నగర అధ్యక్షుడు గుంటూరి ప్రభుదాస్ నేతృత్వంలో అన్నదానం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుదాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దళితుల చట్టాలు, హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ పోరాడుతుందన్నారు. అనంతరం నాయకులు పాలడుగు రమేష్, కార్యకర్తలు కారంచేడు అమరవీరులకు నివాళులర్పించారు.

చదువులోనే ఉన్నత లక్ష్యాల సాధన



బుక్‌లెట్‌లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వలీబాబు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 17 : చదువులతోనే ఉన్నత లక్ష్యాలు సాధన, ఉజ్వల భవిష్యత్తు లభిస్తాయని జీజీహెచ్ న్యూరో సర్జన్ డాక్టర్ షేక్ వలీబాబు పేర్కొన్నారు. ముస్లిం స్వాతంత్ర్య పోరాట యోధుల చరిత్రను వివరిస్తూ రూపొందించిన బుక్‌లెట్ స్టిక్కర్లను బుధవారం ఆయన స్థానిక జీజీహెచ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వలీబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకుని తల్లిదండ్రుల ఆశయ సాధనకు అనుగుణంగా తమ లక్ష్యాలు చేసుకోవాలన్నారు. పేదరికానికి పరిష్కారం చదువు ఒక్కటే అన్నారు. కార్యక్రమంలో దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్, ఇన్‌సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ.సాలర్, ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, షేక్ ఖాశీం, బాబు పాల్గొన్నారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ బాలినేని

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 17: అవినీతి, అక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అని టీడీపీ నాయకుడు దమ్మాలపాటి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 1999లో కాపులకు కేటయించిన ఒంగోలు అసెంబ్లీ సీటును వైఎస్.రాజశేఖర్ రెడ్డి బంధువుగా టికెట్‌ను బాలినేని తెచ్చుకున్నారని విమర్శించారు. టీడీపీకి చెందిన వ్యక్తిని ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి, పరోక్షంగా సహకరించి గెలుపు సాధించావన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని గ్రానైట్ దందాలు, భూ ఆక్రమణలు చేశారని, గతంలో మీడియాతో మంత్రిగా అవినీతి చేశానని చెప్పుకున్న బాలినేని ఇప్పుడు నీతిమంతుడుగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు బాలినేని అసలు రూపం గుర్తించి ఘోరంగా ఓడించారని, అయినా ఇంకా అబద్దాలు చెబుతూ సానుభూతి పొందే ప్రయత్నం చేయడం సిగ్గు చేటని విమర్శించారు.


ప్రమాదంలో ప్రజాస్వామ్యం



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 17: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏకి మెజార్టీ తగ్గినా లౌకిక ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సామాజిక కార్యకర్త టి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆసరా చిడిపోతు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడారు. మతవాదం ఏదైనా దేశానికి ప్రమాదమని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాంతీయ పార్టీలు, ప్రజాస్వామిక, వామపక్ష పార్టీలు క్షేత్ర స్థాయి నుంచి ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాతాని భూపతిరావు, ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, ఆసరా సహాయ కార్యదర్శి ఎంసీ.వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ట్రేడ్ యూనియన్ నాయకులు కె.వెంకటేశ్వర్లు, సర్దార్, పీవీఆర్.చౌదరి, వి.సింగయ్య పాల్గొన్నారు.

నారాయణ స్కూలు కమిటీల ఎంపిక



ప్రమాణస్వీకారం చేసిన విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 17: ఒంగోలు నగరం అంజయ్యరోడ్డులోని నారాయణ స్కూలులో ఘనంగా క్యాబినెట్ విస్తరణ (విద్యార్థుల కమిటీ) ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ఎన్నుకున్న విద్యార్థుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా స్కూలు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. పరిపాలన ఎలా చేయాలనే విషయాన్ని పాఠశాల క్యాబినెట్ ద్వారా అవగాహన వస్తుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం పెద్దిరెడ్డి, సాధిక్, జీవన్, రాకేష్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 17 : త్వరలో ప్రకటించనున్న నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు బీసీల పాత్ర ఎంతో ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాలన్నింటిని పరిగణలోకి తీసుకొని నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసకోవాలని కోరారు. 56 కుల కార్పొరేషన్లకు నిధులు కేటాయింపుతో పాటు చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని ఆయన కోరారు.

'చేకూరపాడు గ్రామానికి రోడ్డు నిర్మిస్తాం'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగులుప్పలపాడు, జూలై 17: మండలంలోని ఒంగోలు-చీరాల జాతీయ రహదారి నుంచి చేకూరపాడుకు గ్రామం వరకు తారురోడ్డు నిర్మిస్తామని పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఉన్నతాధికారులు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం చేకూరపాడు రోడ్డు ఛిద్రం కథనం ప్రచురించడంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. జాతీయ రహదారి-216 నుంచి చేకూరపాడు గ్రామం వరకు 1.15 కిలోమీటర్లు ఉండగా గతంలో రూ.25 లక్షలు ఏఎంసీ నిధులతో 655 మీటర్లు వెట్ మిక్స్ రోడ్డు, రోడ్డు మార్జిన్ పనులు చేపట్టామన్నారు. తారు రోడ్డు లేయర్ పనులు నిలిచిపోయాని పేర్కొన్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు మరో రూ.10 లక్షలు ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో నంబరు 107 ద్వారా పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా మంజూరు చేశామన్నారు. టెండర్లు పిలిచి త్వరలోనే చేకూరపాడు గ్రామం వరకు తారు రోడ్డు నిర్మించనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు



ఎస్పీకి బొకే అందజేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, జూలై 17: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆర్.దామోదర్‌ను బుధవారం ఒంగోలులో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ స్వాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టిప్పర్ ఢీకొని తండ్రి మృతి

కుమార్తెకు గాయాలు ● మద్దులూరు రొయ్యల ఫ్యాక్టరీ వద్ద ఘటన

కట్టావారిపాలెంలో విషాదం

మరో వారంలో లండన్‌కు వెళ్లాల్సి ఉన్న బాధితురాలు



టిప్పర్ కిందపడి మృతి చెందిన వెంకట్రావు



శ్రావణిని పరామర్శిస్తున్న మంత్రి స్వామి

కొండపి/సంతనూతలపాడు, జూలై 17 : తొలి ఏకాదశి రోజున ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. మోటారు సైకిల్‌పై వెళ్తున్న తండ్రీకూతురును టిప్పర్ ఢీకొట్టింది. తండ్రి మృతి చెందగా కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సంతనూతలపాడు మండలం మద్దులూరు-అనకర్లపూడి గ్రామాల మధ్య ఉన్న ఓ ప్రైవేటు రొయ్యల ఫ్యాక్టరీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. సంతనూతలపాడు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని కట్టావారిపాలెంనకు చెందిన రావెళ్ల వెంకటరావు (55) కాళ్లనొప్పితో బాధపడుతున్నారు. వైద్యం కోసం తన కుమార్తె శ్రావణిని తీసుకొని ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్లారు. తిరిగి స్వగ్రామం వస్తుండగా మద్దులూరు-అనకర్లపూడి మధ్య వారి వాహనాన్ని ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో వెంకటరావు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రావణి కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను స్థానికులు 108లో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శ్రావణి భర్త లండన్‌లో ఉంటున్నారు. ఆమె మరోవారంలో అక్కడికి వెళ్లాల్సి ఉండగా ఈ ఘటన చోటుచేసుకుందని బంధువులు, గ్రామస్థులు తెలిపారు. వెంకటరావు మృతితో కట్టావారిపాలెంలో విషాదం చోటుచేసుకుంది. ప్రమాద స్థలాన్ని ఎస్సై దేవకుమార్, హెడ్‌కానిస్టేబుల్ భాస్కరరావు పరిశీలించారు.

మంత్రి స్వామి పరామర్శ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రావణిని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

● రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు



సదస్సులో మాట్లాడుతున్న అధ్యక్షుడు మాధవరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 17: రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసి సమాంతరంగా ఎండీయూ వ్యవస్థను తెచ్చి డీలర్ల పొట్టకొట్టారని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివిలీల మాధవరావు ఆరోపించారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం రేషన్ డీలర్ల సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిందన్నారు. చంద్రబాబు 2014-19 మధ్య కాలంలో రూ.20 ఉన్న కమీషన్ రూ.70లకు, మరలా రూ.100కు పెంచారని గుర్తు చేశారు. సంక్రాంతి కానుకలు, రంజాన్ తోఫా ఇవ్వడం వల్ల రాష్ట్రంలోని డీలర్లందరికీ ఏడాదికి రూ.18 కోట్ల చొప్పున ఐదేళ్లకు సుమారు రూ.90 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రేషన్ డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలని కోరారు. ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి డీలర్లకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.7500, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేలు గౌరవ వేతనంతో పాటు రూ.100 ఉన్న కమీషన్‌ను రూ.150కి పెంచాలని కోరారు. రేషన్ షాపుల ద్వారా మీ సేవలో లభించే అన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను రేషన్ల డీలర్ల ద్వారా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా రమణ, రాష్ట్ర కోశాధికారి గంగాధర్ గౌడ్, బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుమన్. తుమ్మల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహజానందస్వామి ఆరాధన



విద్యుత్‌ప్రభపై ప్రసంగిస్తున్న మంత్రి స్వామి

కొండపి, జూలై 17 : తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని పెట్లూరు గ్రామంలో ఉన్న సహజానంద భారతీ స్వామి 31వ ఆరాధన బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో ఉదయం హోమం నిర్వహించారు. ఆలయ నూతన కమిటీ సభ్యుడు మూలె కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు. భక్తులు టెంకాయలు కొట్టి స్వామి వారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. రాత్రి స్వామివారిని మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ప్రజలనుద్దేశించి వారు మాట్లాడారు.

అధ్వానస్థితిలో ఓబీసీ రహదారి



బురద, గోతులమయంగా మారిన రోడ్డు

చీమకుర్తి, జూలై17 : రామతీర్థం రిజర్వాయర్ నుంచి ఒంగోలు వరకు తాగు, సాగునీటిని సరఫరా చేసే ఒంగోలు బ్రాంచ్ కాలువ(ఓబీసీ) రహదారి అధ్వానస్థితికి చేరుకుంది. కాలువ రహదారిపై గ్రానైట్ ఫ్యాక్టరీలకు చెందిన భారీ వాహనాలు తిరుగాడుతుండటంతో అంతా గుంతలమయమైంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి రాకపోకలకు ఆటంకంగా మారింది. ఎన్ఎస్‌పీ సిబ్బంది కాలువపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆ వైపు పొలాలున్న రైతులకు తమ పనులకు వెళ్లాలన్నా ఈ కెనాల్ రోడ్‌పై వెళ్లాల్సి ఉంది. సంబంధిత యంత్రాంగం స్పందించి రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ద్వారా బహిరంగ ప్రకటనలు, లీగల్ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి అన్నిరకాల ప్రకటనలు తెలియజేయుడి.

జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు | విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు | ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అధనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి పత్రిక కొరకు సంప్ర॥ 9985411484

పీర్ల ఊరేగింపులో వివాదం

కనిగిరిలో ఉద్రిక్తత ● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో సామరస్యంగా కార్యక్రమం



బొడ్డుచావిడి వద్ద ఇరువర్గాలను నిలువరిస్తున్న పోలీసులు



పీర్ల ఊరేగింపు నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, జూలై 17 : మొహర్రం పండుగ సందర్భంగా కనిగిరిలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఇరు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒంగోలు నుంచి వచ్చిన ప్రత్యేక బలగాలు మోహరించాయి. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో చివరికి కార్యక్రమం సమారస్యంగా సాగింది. వివరాల్లోకి వెళితే... ఏటా మొహర్రం పండుగ సందర్భంగా కనిగిరిలోని ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న దర్గాలు, మసీదుల నుంచి పీర్లు ఊరేగింపుగా బొడ్డుచావిడి, రామాలయం వీధి నుంచి పామూరు బస్టాండు వద్దకు చేరుకుంటాయి. బొడ్డుచావిడి వచ్చే ముందుగానే పీర్ల ఊరేగింపులో ఎలాంటి డప్పు, వాయిద్యాలను ఉపయోగించరాదన్నది ఆచారం. అయితే బుధవారం పీర్ల ఊరేగింపు చేపట్టిన వారు బొడ్డుచావిడి గోపురం వద్ద డప్పు, వాయిద్యాలను పెద్దఎత్తున మోగించారు. దీనికి ఆయా వీధుల్లో ఉండే వారు అభ్యంతరం చెప్పడంతో వివాదం మొదలైంది. ఊరేగింపులో గతానికి భిన్నంగా డప్పులను కొట్టడం ఎంత వరకు సబబని పోలీసులను వారు నిలదీశారు. దీంతో సీఐ వెంకటేశ్వరరావు ఊరేగింపు నిర్వహించే వారితో మాట్లాడి డప్పులు లేకుండా పీర్లను బొడ్డుచావిడి నుంచి రామాలయం మీదుగా పంపించే విధంగా సర్దిచెప్పారు. ఆ ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పీర్ల ఊరేగింపులోని కొంతమంది అల్లరి మూకలు చేసే సంజ్ఞలతో రెండోవర్గం వారు కోపోద్రిక్తులై జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. దీంతో తిరిగి వివాదం ముదిరి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని డీఎస్పీ రామరాజుకు సీఐ సమాచారం అందించడంతో ఒంగోలు నుంచి ప్రత్యేక బలగాలను పిలిపించారు. అయినా ఇరువర్గాలు ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు బొడ్డుచావిడి వద్ద చుట్టూ పెద్ద మోకులతో బారికేడ్లు కట్టారు.

ఎమ్మెల్యే ఉగ్ర రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సంఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. పోలీసులతో సమావేశమై ఇరు వర్గాలకు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా పీర్లను ఊరేగించాలని పోలీసులకు సూచించారు. పోలీసులు మలిసారి ప్రయత్నించినా ఇరు వర్గాలవారు సహకరించలేదు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర స్వయంగా వెళ్లి బొడ్డుచావిడి వద్ద ఉండే వర్గం వారితో, పీర్ల ఊరేగింపు నిర్వహించే వర్గం వారితో చర్చించారు. డప్పు, వాయిద్యాలు లేకుండా పీర్ల ఊరేగింపు చేసుకునేలా సర్దిచెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగి డప్పు, వాయిద్యాలు లేకుండా పీర్లను ఊరేగించారు. పామూరు బస్టాండు వద్దకు చేరుకున్న పీర్లు సలాంలు చేసుకున్నాయి. వైభవంగా పీర్లు ఊరేగింపు ఉత్సవం ముగిసింది.

పొగాకు మార్కెట్‌లో అనిశ్చితి

దక్షిణాదిలో పక్షం రోజులుగా నిలిచిన వేలం ● రైతుల వద్దనే మూడొంతులకుపైగా పంట ● అధికోత్పత్తి కొనుగోళ్లపై లేని స్పష్టత

ఆందోళన చెందుతున్న సాగుదారులు ● ఎంపీ మాగుంట దృష్టికి తీసుకెళ్లిన రైతు ప్రతినిధులు ● జోరుగా అక్రమ కొనుగోళ్లు



ఎంపీ మాగుంటతో భేటీ అయిన పొగాకు రైతు ప్రతినిధులు

ఒంగోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో నెలకొన్న సంక్షోభం తొలగలేదు. అనిశ్చితి పరిస్థితి కొనసాగుతోంది. పక్షం రోజులుగా ఈ ప్రాంతంలోని వేలం కేంద్రాలలో విక్రయాలు నిలిచిపోయాయి. పండిన పంటలో ఇంకా మూడొంతులకుపైగా రైతుల ఇళ్ల వద్దనే ఉండటమే కాక రానున్న సీజన్ సాగు సమయం సమీపిస్తోంది. ధరలు బాగా పెరిగి, మంచి డిమాండ్ ఉండి రాబడి ఉంటుందన్న సంతోషంలో ఉన్న పొగాకు రైతులకు ప్రస్తుత పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. అధికపంట ఉత్పత్తి విషయంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ స్పష్టత ఇవ్వక మార్కెట్లో సంక్షోభ పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయాన్ని బుధవారం ఆయా వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సత్వరం కేంద్రం చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. దక్షిణాదిలో ఒంగోలు కేంద్రంగా ఉన్న రెండు రీజియన్ల పరిధిలో ఉన్న 11 వేలం కేంద్రాలలో 2023-24 పంట కాలానికి 57,767.99 హెక్టార్లలో సాగుకు, 86.93 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే 24,130 బ్యారన్ లైసెన్స్‌లు రెన్యువల్ చేయించుకున్న 29,885 మంది రైతులు సుమారు 72,345.90 హెక్టార్లలో పంట సాగు చేయగా దాదాపు 140 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా. ఈ ఏడాది ఫిబ్రవరి 29న తొలిదశ, మార్చి 6న రెండో దశగా 11 కేంద్రాల్లో వేలం ప్రారంభించగా తొలి రోజున కిలో రూ.230 గరిష్ఠ ధర లభించింది. క్రమంగా పెరుగుతూ కిలో రూ.366 కు చేరగా మీడియం, లోగ్రేడ్‌లలో నాణ్యమైన పంటగా భావించే బ్రౌన్ రకం ధరలు కూడా కిలో రూ.300 మేర పలికాయి. సగటున కిలో రూ.252 కుపైగా ఉండగా ఆయా వేలంకేంద్రాలలో అధికారికంగా అనుమతి ఇచ్చిన పంట కొనుగోళ్ల అధికశాతం కేంద్రాల్లో పక్షంరోజుల క్రితమే పూర్తయ్యాయి. పొగాకు బోర్డు లెక్కల ప్రకారం సుమారు 91 మిలియన్ల కొనుగోలు జరగ్గా ఇంకా దాదాపు 49 మిలియన్ కిలోలు రైతుల వద్దనే ఉంది. అందులోనూ 90శాతం మేలు గ్రేడ్‌లకు చెందినది ఉంది. ఈ సమయంలో అధికారిక పంట కొనుగోళ్ల పూర్తయ్యాయని బోర్డు అధికారులు వేలం నిలిపివేశారు.

ప్రతిఏటా ముందే స్పష్టత

ప్రతి ఏటా కేంద్రం అనుమతించిన మేరకు అధికారిక కొనుగోళ్ల పూర్తయ్యేలోపు అధిక పంట ఉత్పత్తిపై స్పష్టత ఇచ్చేవారు. రాష్ట్రంలో గతేడాది, కర్ణాటకలో వరుసగా రెండేళ్లు పెనాల్టీలు రద్దుచేయగా ఈ ఏడాది కూడా రద్దు చేసి కొనేలా అనుమతి కోరుతూ రైతుల అభ్యర్థన మేరకు పొగాకు బోర్డు అధికారులు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. అక్కడి నుంచి స్పష్టత రాకపోవడంతో బోర్డు అధికారులు వేలం నిలిపేశారు. ఇంకా పండిన పంటలో మూడవ వంతు పైగానే రైతుల వద్ద ఉండగా వారంతా ఆందోళన చెందుతున్నారు. తూకం, నాణ్యత తగ్గి నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. దానిని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు అక్రమ కొనుగోళ్ల జోరు పెంచారు. సగటున కిలోకు రూ. 340 నుంచి రూ.357 చెల్లించి ఒంగోలు టంగుటూరు, కొండపి, వెల్లంపల్లి వేలం కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో జోరుగా కొంటున్నారు. వేలం నిలిచిపోవడం, కేంద్రం నుంచి అనుమతులపై అధికారుల స్పష్టత ఇవ్వలేకపోవడంతో రైతులు కూడా అలా అక్రమంగా కొనే వ్యాపారులకు అమ్ముకుంటున్నారు తద్వారా ఇటు రైతులు, అటు బోర్డుకు కూడా నష్టపోతోంది.

ఎంపీని కలిసిన రైతు ప్రతినిధులు

ఇదిలా ఉండగా మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి తొలగి తిరిగి కొనుగోళ్ల జరిగేలా కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్న పొగాకు రైతు ప్రతినిధులు బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలిసి కేంద్రం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు. బోర్డు సభ్యులు ప్రసాదరావు, బ్రహ్మయ్య, వేలంకేంద్రాల ప్రతినిధులు వడ్డెళ్ల ప్రసాద్, ఆళ్ల సుబ్బారావు, పోతుల నరసింహారావు, గురువారెడ్డి తదితరులు కలిశారు. పెనాల్టీలు రద్దు చేసి పొగాకు కొనుగోళ్ల తిరిగి ప్రారంభమయ్యేలా చేయడంతో పాటు వచ్చే సీజన్‌కు బ్యారన్‌కు 50 క్వింటాళ్ల అనుమతి, పొగాకు కనీస ధరను మూడేళ్లకు బదులు ఏటా నిర్ణయించేలా చూడాలని కోరారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంపీ మాగుంట తక్షణం కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు





ఒంగోలులోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకుడు, వ్రతాలల్లో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), జూలై 17: తొలి ఏకాదశి పండుగను ప్రజలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఒంగోలు నగరంలోని పలు వైష్ణవ ఆలయాలలో ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు జరిగాయి. ఇక భక్తులు సైతం ఆయా ఆలయాలను ఉదయమే సందర్శించి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా జరిగిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలలో పెద్దసంఖ్యలో దంపతులు పాల్గొనగా, ఆలయ అర్చకబృందం పి.రమానాథాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రమా వసుంధర సహిత శ్రీ సత్యనారాయణ స్వామివారికి షోడసోపచార పూజ, వ్రత కల్పము మొదలైనవి జరిగాయి. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆలయంలో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొనగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి వారికి స్వాగతం పలికారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వారు శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానాన్ని సైతం సందర్శించారు. ఇక స్థానిక అమలనాథుని వారి వీధిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో తొలిఏకాదశి సందర్భంగా ఏర్పాటుచేసిన సత్యనారాయణ స్వామి వ్రతాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని సుందరనగర్ శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, లాయర్‌పేట చిట్టి ఆంజనేయస్వామి దేవస్థానం, రాజాపానగల్ రోడ్ శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం, కొణిజేడు బస్టాండ్ శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం, శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, ఐశ్వర్యనగర్ కృష్ణమందిరం, శ్రీసీతారామచంద్ర దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించగా భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: తొలి ఏకాదశి వేడుకలను బుధవారం మండలంలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, పశువులు, గొర్రెలు వృద్ధి చెందాలని రైతులు, గొర్రెలకాపరులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

హరిహర క్షేత్రంలో..

చీమకుర్తి : తొలిఏకాదశి పర్వదిన వేడుకలను భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు విశేషపూజలు జరిపారు. అదేవిదంగా మండలంలోని పలుదేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న శిద్దా రాఘవరావు

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు : తొలిఏకాదశి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. సంతనూతలపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా పండుగను నిర్వహించారు. ఆలయంలో రామనాయసంకీర్తనలు ఆలపించారు. అర్చకులు అజయ్‌కుమార్ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. చింతకాయల వెంకటేశ్వర్లు శిష్యబృందంచే సంకీర్తనలు పాడారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



ఎస్ఎన్‌పాడులో భక్తుల రామకీర్తనలు

సింగరాయకొండ మండలంలో..

సింగరాయకొండ : తొలిఏకాదశిని పురస్కరించుకొని బుధవారం పాత సింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి, యో గానంద వరాహ లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని ప్రత్యేక పూలతో అలంకరించారు. పంచాయతీ పరిధిలోని రైల్వే స్టేషన్‌రోడ్డులో ఉన్న రామాలయంలో సీతారామలక్ష్మణ విగ్రహాలకు, ఆంజనేయుడికి పంచామృతాభిషేకం చేశారు. చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు.



అపోహలు కలిగించే ప్రచారాలు సహించేది లేదు : ఎమ్మెల్యే బీఎన్

● మెరుగైన పాలన లక్ష్యంగా సాగుతానని స్పష్టీకరణ



ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు నియోజకవర్గంలో పాలనా పరమైన అంశాలపై తనపైనా, టీడీపీ ప్రభుత్వం మీద అపోహలు కలిగేలా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పదిహేనేళ్ళగా తాను సొంత నిధులు వెచ్చించి, ఆత్మగౌరవంతో రాజకీయం చేస్తున్నానని పేర్కొన్నారు. అలాంటి తనపైనా, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న టీడీపీ, అధిష్ఠానంపైనా ప్రజల్లో గందరగోళ పరిస్థితి కలిగించేలా ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. అధికారుల నియామకాలు, బదిలీలు, ఇతర పాలనాపరమైన అంశాలలో తాను స్వతంత్రంగానే వ్యవహరిస్తానన్న విషయం తన గురించి తెలిసిన వారందరికీ తెలుసునన్న బీఎన్, ఇటీవల చీమకుర్తి సీఐ నియామకం వ్యవహారంలో అందుకుభిన్నంగా జరిగినట్లు సంఘాల పేరుతో కొందరు దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సదరు అధికారి నియామకం తనకు తెలిసే జరిగిందని, ఆ అధికారే కాక ఇతర అధికారుల నియామకాల విషయంలోనూ, ప్రజలకు మెరుగైన పాలన అందించే లక్ష్యంతోనే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఎవరి వత్తిళ్లు తనపై పనిచేయవని, టీడీపీలో తన ఆత్మగౌరవానికి ఎలాంటి భంగం కలగదని అయన స్పష్టం చేశారు. అనవసరంగా ప్రజల్లో అపోహలు కలిగించేలా, టీడీపీ అధిష్ఠానంపైనా, తనపైనా అసత్య వ్యాఖ్యలు ఎవరూ చేయవద్దని ఆయన కోరారు.

యాంటి డ్రగ్స్ వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 17 : రాష్ట్రాన్ని వణికిస్తున్న డ్రగ్స్ భూతాన్ని అంతం చేయడానికి ప్రజలల్లో అవగాహన కల్పించేందుకు ఆస్టోనా ట్రస్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీ వాహనాన్ని ఒంగోలులో బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. డ్రగ్ ఫ్రీ పేరుతో ఏర్పాటు చేసిన వాహనాన్ని స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో దామచర్ల నడిపి ప్రారంభించారు.

కారంచేడు అమరవీరులకు నివాళి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 17 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కారంచేడు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని అంబేడ్కర్ భవనం వద్ద నుంచి నెల్లూరు బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్, జాలారావ్, తుమ్మలూరి కిషోర్, బాబు, ఆనాల సురేష్, బాలాజి, పాటిబండ్ల ఆనందరావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా జనసేన : బాబు



చెక్కును అందజేస్తున్న బాబు

మద్దిపాడు, జూలై 17: కార్యకర్తలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని సంతనూతలపాడు నియోజవర్గ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు(బాబు) పేర్కొన్నారు. మద్దిపాడులోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు, క్రియాశీలక సభ్యత్వ వలంటీర్లలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క మండలం నుంచి 10మంది వలంటీర్లను నియమించామని, వారి ద్వారా క్రియాశీలక సభ్యత్వం సేకరిస్తారని చెప్పారు. సభ్యులు రూ.500 చెల్లిస్తే పార్టీ ప్రమాద, ఆరోగ్య బీమా చేయనున్నట్లు తెలిపారు. కొలచనకోట గ్రామానికి చెందిన బాలిశెట్టి వెంకటనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వైద్యఖర్చుల నిమిత్తం రూ.50వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం, కావూరి శ్యాంసుదర్, ఆరేం వెంకటేశ్వర్లు, దమ్ము సురేష్, నారాయణం వంశీకిరణ్, మద్రిపూడి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు నగర పరిసర ప్రాంతముల వారికి
బాంబేటెక్స్ వారి శుభవార్త
SHOP NO. 134 & 135, శ్రీ బాపూజి మార్కెట్ కాంప్లెక్స్, ONGOLE.
Raymond Phant Rs.500/-
BSL Phant Rs.500/-
Cotton Shirt 1.60Cut Rs.300/-
Phant+Shirt Rs.800/-
పైన తెలిపిన ఆఫర్లను వినియోగించుకొని ఎప్పటివలె మా వ్యాపారాభివృద్ధికి తోడ్పడగలరు
BOMBAYTEX
GENTS CLOTH & CUT PIECES SHOW ROOM
SHOP NO. 134 & 135, S.B.M.C. ONGOLE.
PROP:- K.V. SUBBA RAO, CELL:- 9966003542

AJ C ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

బిల్డింగ్ ప్లాన్స్ & ఎలివేషన్స్
■ ప్రకాశం జిల్లాలో ఇల్లు కట్టుకొనుటకు ప్లాన్లు గీసి అప్రూవల్ చేయించబడును. ఎలివేషన్స్ చేయబడును. బాషా ఆర్కిటెక్స్, SMBC-1252, ఒంగోలు. సెల్: 7702244786, 9491224027
AJO-183946

గోడౌన్ అద్దెకు ఇవ్వబడును
■ వెల్లంపల్లి, మద్దిపాడు(మం), NH-16 ప్రక్కన 50X60 కొలతలు గల షెడ్, 50HB కరెంట్, బోరింగ్ వసతులు గల గోడౌన్ అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9505503178, 7780246363.
AJO-190188

వెంటనే కావలెను
■ బాషా ఆర్కిటెక్స్, SMBC, ఒంగోలు నందు పనిచేయుటకు B.Tech Civil చదివి బిల్డింగ్ ప్లాన్స్ & ఎలివేషన్స్ (3D Max) గీయుటకు Female కావలెను. సెల్: 7702244786
AJO-183945

PLOT FOR SALE
■ మారం వెంకారెడ్డి రియల్ ఎస్టేట్స్, ఒంగోలు NH-5 నుండి మంగమూరు రోడ్డు పవర్ ఆఫీస్ దాటాక తక్షణం ఇల్లు నిర్మించుటకు, ఇన్వెస్ట్మెంట్‌కి అనుకూలంగా ఒక్క గది కేవలం 36 వేలకే ప్లాట్స్ కలవు. సంప్ర॥9885184207 స్పాట్ రి॥
AJG-9497

ట్రైనింగ్ సెంటర్
■ రాధిక M.P.H.W ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సుందరయ్య భవన్ రోడ్, శ్రీనివాస హాస్పిటల్ ఎదురు, ఒంగోలు, కోర్సులు : M.P.H.W(F), ANM / DMLT Q: ఇంటర్ ఏ గ్రూప్ వారైన, ప్రభుత్వ స్కాలర్‌షిప్ కలదు. సంప్ర॥ 08592 282349, 8978869519, 7674998230
AJO-190174

మీ సర్టిఫికేట్స్ పోయినవా ?
■ మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికెట్స్ తెప్పించబడును. సర్టిఫికెట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616.
AJG-191543

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పొగాకు సాగుపై రైతుల ఆసక్తి

అనుకూలిస్తున్న వాతావరణం

పెద్ద దోర్నాల, జూలై 17:వాణిజ్య పంటలు మిరప, పత్తి సాగుకు లక్షల్లో పెట్టుబడులు పెట్టి ఇంటిల్లి పాది ఏడాది పాటు చెమటోడ్చినా రెక్కల కష్టం కూడా రాని నేటి పరిస్థితుల్లో వ్యవసాయం జూదంగా మారింది.దీంతో ప్రత్యామ్నాయ సాగుకు రైతన్నలు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో వర్షాభావ పరిస్థితులలో తక్కువ ఖర్చుతో నికరాదాయం లభించే నాటు పొగాకు సాగు పట్ల రైతాంగం ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది పొగాకుకు గిట్టుబాటు ధరలు లభించడంతో ఈఏడాది ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమవుతున్నారు. మండలంలో ప్రతి గ్రామంలో వంద నుంచి రెండు వందల ఎకరాల్లో పొగాకు నాటేందుకు సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలో ఓ కంపెనీతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు.

తక్కువ ఖర్చు-నికరాదాయం

పొగాకు సాగు మండలంలో కొత్తగా సాగైనప్పటికీ రైతులు సాగు విధానం పట్ల అవగాహన కొచ్చారు. చౌడు నేలలు మినహా అన్ని నేలలు సాగుకు అనుకూలం. ఎర్రనేలలు మరింత మేలు. ఎకరం సాగుకు సుమారు రూ.40వేలు ఖర్చు అవుతోంది. ఎకరం దుక్కికి రూ.2,000లు, గొర్రు, గుంటకకు రూ.1,600లు. ఎకరంలో నాటేందుకు 10,000ల నుంచి 12,000ల మొక్కలు అవసరమవుతాయి. వీటి కొనుగోలు ఖర్చు రూ.4,000లు, నాటిన కూలీల ఖర్చు రూ.2,000లు, అంతర సేద్యం కోసం రూ.3,200లు. కలుపుతీతలకు రూ.2,000లు. ఎరువుల కోసం రూ.4,500 లు.పురుగుమందుల ఖర్చు రూ. 750లు. ఆకు కోతల ఖర్చు రూ. 5,000లు.అదనపు ఖర్చు రూ.5,000లు.షెడ్ ఖర్చు రూ.25,000లు మొత్తంగా రూ.40,000లు అవుతాయి. ప్రస్తుతం క్వింటాలు ధర రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఉంది.ఎకరాకు 10 నుంచి 15 క్వింటాల దిగుబడి వస్తుంది. సాగు ఖర్చులు పోనూ రూ.35,000లు వరకు నికరాదాయం లభిస్తున్నది.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు..

సమగ్ర యాజమాన్యంతో పొగాకు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పొగాకు సాగుకు ఎర్రనేలలు అత్యంత అనుకూలం. జూలై-ఆగస్టు మాసాల్లో, నవంబరు-అక్టోబరులో సాగుకు అనుకూలం. నలభైరోజుల నారు ప్రధాన పొలంలో నాటుకోవాలి. సాలుకు సాలు మధ్య నాలుగు అడుగులు, మొక్క మొక్కకు అడుగు దూరంలో నాటుకోవాలి. 50నుంచి 60 రోజులకు కోతకు వస్తుంది. ఆరుసార్లు కోతలు తీస్తారు. కోసిన ఆకులు షెడ్లలో నీడన 20 నుంచి 30 రోజుల వరకు ఆర బెట్టాలి. తద్వారా నాణ్యమైన పొగాకు లభిస్తుంది.





సాగులో ఉన్న పొగాకు (ఇన్‌సెట్లో) ఆకులను తాడుతో కట్టి పందిర్లలో ఆరబెట్టిన దృశ్యం (ఫైల్)

మస్తాన్‌స్వామి దర్గా కొండపై మృతదేహం కలకలం

కంభం, జూలై 17 : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని మస్తాన్‌స్వామి దర్గా కొండపై బుధవారం కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం కలకలం సృష్టించింది. మృతుడు బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన గద్దెల సురేష్‌కొండయ్య (27)గా గుర్తించారు. సురేష్ కంభం రైల్వేస్టేషన్ లో గ్యాంగ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే నెల రోజులక్రితం ఇంటి నుంచి బయటకు వచ్చిన సురేష్ కనిపించక పోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెలరోజుల నుంచి సురేష్ ఆచూకీ కోసం భార్య, కుటుంబసభ్యులు వివిధ ప్రాంతాలలో వెతుకుతున్నారు. ఈనేపథ్యంలో 3 రోజులక్రితం మృతుడి ద్విచక్ర వాహనం రావిపాడు వెళ్లే కొండ దగ్గర ఉండడంతో గుర్తించిన ఓ వ్యక్తి బండి నెంబరు తాలూకు వారికి ఫోన్ చేయగా ఆవ్యక్తి నేను సురేష్ అనే వ్యక్తికి బండిని అమ్మినట్లు తెలిపాడు. దీనితో కుటుంబసభ్యులు పోలీసులకు బండి విషయం తెలపడంతో వారు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈనేపథ్యంలో మృతుని కుటుంబసభ్యులు కనిపించడం లేదని గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం మార్టూరు నుంచి మృతుడి బంధువులు 3 వాహనాల్లో కంభం వచ్చారు. అక్కడ కొండపైకి ఎక్కి పరిశీలించగా కొండపై కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించింది. దీనితో బంధువులు మృతదేహంపై ఉన్న దుస్తులను చూసి సురేష్‌గా గుర్తించారు. మృతదేహం పక్కన ఉన్న సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుని తండ్రి కోటయ్య మాట్లాడుతూ గత నెల 17వ తేదీన బక్రీద్ పండుగ రోజు భోజనం చేస్తున్న సమయంలో ఫోన్ రాగా మాట్లాడి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లాడని, అప్పటినుంచి కనిపించకుండా పోయినట్లు తెలిపారు. ఫోన్ చేసిన వారు ఎవరు, ఇక్కడికి ఎందుకు వచ్చాడు, కొండపైకి ఎందుకు వెళ్లాడు.. ఎలా మృతిచెందాడని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అప్పుడే గాలించి ఉంటే అప్పుడే మృతదేహం కనపడేదని వారు విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నారు.



కొండపై ఉన్న అస్తిపంజరం (ఇన్‌సెట్లో) సురేష్

వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా తప్పక సాధిస్తాం : ఎంపీ మాగుంట

మార్కాపురం, జూలై 17: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయించడం, మార్కాపురం జిల్లాను సాధించుకోవడమే తమ ముందున్న ప్రథమ కర్తవ్యమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలుస్తామన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం వెలుగొండ ప్రాజెక్టుతోనే సాధ్యమన్నారు. త్వరితగతిన పూర్తి చేయించేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రిని కోరతామన్నారు. అంతేకాకుండా మార్కాపురం జిల్లా విషయం కూడా ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చినందున మార్కాపురం జిల్లా తప్పక ఏర్పడుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, డీవీ కృష్ణారెడ్డి, వెన్నా పోలిరెడ్డి, తాళ్లపల్లి సత్యనారాయణ, కాకర్ల శ్రీనివాసులు, స్వర్ణ గీత, కాటూరి పెదబాబు, పండు, జవ్వాజి రామాంజులరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, ఉలవా గోపి, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రామనారాయణరెడ్డి, నాలి కొండయ్య, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాసులరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కందుల

వైభవంగా పాలంక వీరభద్రస్వామి తిరునాళ్ల

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), జూలై 17: నల్లమలలో భక్తుల కొంగు బంగారమై స్వయంభువుగా వెలసిన పాలంక వీరభద్ర స్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. బుధవారం వేకువజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని పూజలు నిర్వహించారు. ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాలతో పాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఎర్రగొండపాలెం నుంచి భక్తుల కోసం లారీలు, ట్రాక్టర్లు, జీపులను ఏర్పాటు చేశారు. మందు రోజు మంగళవారం భక్తులు చేరుకొని అక్కడ ఉన్న జలపాతంలో పుణ్యస్నానం చేసి కొండ చెరియ కింద జాగారం చేశారు. కొండ చెరియ క్రింద వెలసిన స్వయంభు వీరభద్రుడు, భద్రకాళి అమ్మవారు, విఘ్నేశ్వరుడు, పంచముఖ బ్రహ్మ, అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. భక్తుల కోసం దేవస్థానం ఆధ్వర్యంలో, దాతల సహకారంతో అన్నదానం చేశారు. కొండపైన భక్తులకు మంచి నీరు, అన్నదానం దాతలు నిర్వహించారు. పాలంకలో ఉన్న 1000 అడుగుల జలపాతం భక్తులను ఆకట్టుకుంది. భక్తులు రెండు రోజుల పాటు జాగారం చేయడం ఇక్కడ అనావాయితీగా వస్తోంది.



పాలంక వీరభద్ర, భద్రకాళి అమ్మవార్లు



నల్లమల పాలంకలో కొండ చెరియ కింద పూజలు చేస్తున్న భక్తులు

ఎమ్మెల్యే కందులను పరామర్శించిన ఎంపీ మాగుంట

మార్కాపురం, జూలై 17: ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిని పరామర్శించారు. కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని గత కొద్దిరోజులుగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట వెంట మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎంపీ మాగుంట



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

సీఐటీయూ శిక్షణా తరగతుల ప్రారంభం

పొదిలి, జూలై 17 : సీఐటీయూ జిల్లా నాయకత్వ శిక్షణా తరగతులు బుధవారం పొదిలిలో ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమంలో ముందుగా రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన వర్తమాన పరిస్థితుల్లో మన కర్తవ్యం అనే అంశంపై మాట్లాడారు. ప్రపంచంలో పెట్టుబడిదారుల దోపిడీ రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ, వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మిక, రైతాంగం ఐక్యపోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్, కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, వివిధ రంగాల నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు

త్రిపురాంతకం, జూలై 17: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవార్ల ఆలయాల్లో తొలిఏకాదశి పూజలను భక్తులు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా స్వామివారిని ఆలయ ప్రధానార్చకులు విశ్వనారాయణశాస్త్రి, అమ్మవారిని పాలంక ప్రసాదశర్మలు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలోని శివలింగాలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కంభంలో..

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లోని వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శివాలయాలలో తొలి ఏకాదశి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. 2024లో తొలి పండుగగా మొదలవడంతో అందరిపై భగవంతుల ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాహం చేశారు.

పెద్ద దోర్నాలలో పూజలు



దోర్నాలలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్ద దోర్నాల : మండలంలోని ప్రజలు తొలి ఏకాదశి వేడుకలను బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఏడాదిలో ముందుగా వచ్చే ఏకాదశి పండుగను పురస్కరించుకుని ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రధానంగా స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు లక్ష్మీనరసింహా స్వామి వార్లను సుందరంగా అలంకరించారు. తిమ్మాపురంలో శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో అర్చకులు రామయ్య స్వామి రామ లక్ష్మణ సీతమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆయా గ్రామాలలోని ఆలయాల్లో తెల్లవారు జామునే దైవదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. వానలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, సుఖ సంతోషాలతో ఉండేలా చల్లగా చూడాలని స్వామి వారిని వేడుకున్నారు.



పూజలందుకుంటున్న త్రిపురాంతకేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరీ దేవి

గిద్దలూరులో

గిద్దలూరు : మండల ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. తమ ఇళ్లలో తొలి ఏకాదశి పూజలను నిర్వహించి ప్రత్యేకంగా తయారు చేసుకున్న పేలాలను, పేలపిండిని విష్ణుమూర్తికి, లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పించారు. విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా మహిళలు బుధవారం ఉపవాసం ఉన్నారు. దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథ స్వామి

తిరుమలనాథుడికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలో పోతంపల్లిలో వెలసిన శ్రీ గొర్రాలికొండ తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భవానీ ప్రసాద్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

బేస్తవారపేటలో..

బేస్తవారపేట: మండలంలోని పలుదేవాలయాల్లో తొలి ఏకాదశి పండుగ ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.శ్రీసాయిబాబా ఆలయం, శ్రీపట్టాభి రామాదేవస్థానంతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ పంపిణీ

కొమరోలు, జూలై17: మండలంలోని ఇడమకల్లు గ్రామానికి చెందిన మరియమ్మ అనే దివ్యాగురాలికి దివ్యా హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్‌ను బుధవారం ఆ సంస్థ నిర్వాహకులు లోక్కు శరత్ బాబు పంపిణీచేశారు. ఈసందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ నిరుపేద వికలాంగులకు చేయూత నిస్తూ వారికాళ్ళపై వారు జీవనం కొనసాగించడమే ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో లోక్కు సుమన్, పుష్పరాజు, అనిల్ , నాగేంద్ర, శ్రీధర్‌లు పాల్గొన్నారు.



ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

అదుపుతప్పి గోడను ఢీ కొన్న లారీ

గిద్దలూరు టౌన్, జూలై 17 : నంద్యాల-గిద్దలూరు రహదారిలోని పాత గరండాల వద్ద ఉన్న సైడువాల్‌ను లారీ ఢీ కొట్టడంతో రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. అటు ఇటుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 2గంటలపాటు బుధవారం ట్రాఫిక్ స్తంభించింది. దీనితో గిద్దలూరు పోలీసులు ఆప్రాంతానికి చేరుకుని సైడువాల్‌ను ఢీకున్న లారీని తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ఘాట్‌రోడ్డులో సైడ్‌వాల్‌ను ఢీకొని నిలిచిపోయిన లారీ

టీడీపీ సోషల్ మీడియాలో ప్రతిభచాటిన కార్యకర్తకు సత్కారం

బేస్తవారపేట, జూలై17 : టీడీపీ సోషల్ మీడియాలో ప్రతిభకనబరచిన బేస్తవారపేట మండలంలోని బీసీ గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు బోయిళ్ళ రోషన్‌బాబును బుధవారం గిద్దలూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సత్కరించి బహుమతిని ప్రదానం చేశారు. రోషన్‌బాబుకు రాష్ట్ర పార్టీ నుంచి టీడీపీ చిహ్నం(చిన్నపాటి సైకిల్ గుర్తు) వచ్చింది. ఈ సందర్భంగా రోషన్‌బాబు మాట్లాడుతూ తాను టీడీపీ సోషల్ మీడియాకు భవిష్యత్‌లో సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోషన్‌బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే

ఎస్పీని కలిసిన సీఐ



ఎస్పీకి మొక్కను అందిస్తున్న సీఐ

గిద్దలూరు టౌన్, జూలై 17 : నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎ.ఆర్.దామోదర్‌ను బుధవారం గిద్దలూరు అర్బన్ సీఐ వై.వీరసోమయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనకు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

మోటార్ల విద్యుత్ తీగల చోరీ

గిద్దలూరు టౌన్, జూలై 17 : వ్యవసాయ బోర్లకు ఉండే విద్యుత్ తీగలను దొంగలు దోచుకెళ్ళారు. మండలంలోని కెఎస్‌పల్లె పంచాయతీ పరిధిలో గల అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన నలుగురు రైతుల బోర్లకు ఉండే సర్వీసు తీగలను అపహరించుకుని వెళ్ళారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, చిన్నరంగారెడ్డి, పెద్దరంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అనే రైతులకు అక్కలరెడ్డిపల్లెలో వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వాటి ద్వారా పొలాలకు నీరు అందిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఆయా రైతులకు చెందిన బోర్లకు ఉండే విద్యుత్ తీగల్లో రాగిని దొంగలు తీసుకెళ్లారు. ఈవిషయంపై ఆయా రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

గిద్దలూరు టౌన్, జూలై 17 : పట్టణానికి చెందిన ఫాతిమా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాశింవలి పేద విద్యార్థులకు రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం ఎడ్లపల్లి గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ, ఇస్మాయిల్ కొద్ది రోజులక్రితం తండ్రిని కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లి కూలీ పనులకు వెళితేనే ఇల్లు గడిచేది. ఈస్థితిలో ఇస్మాయిల్, హుస్సేన్‌బీ చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఫాతిమా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాశింవలి వారి చదువుల కోసం రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఫోన్ పే ద్వారా వారి అకౌంట్‌కు జమచేశారు. భవిష్యత్తులో కూడా వీరికి సంస్థ అండగా ఉంటుందని ఖాశింవలి తెలిపారు.

వేడుకగా పీర్ల ఊరేగింపు

పొదిలి, జూలై 17 : పట్టణంలో మొహర్రం వేడుకలను ముస్లింలు వైభవంగా జరుపుకున్నారు. బుధవారం సాయంత్రం పొదిలి పెద్దబస్టాండ్ సెంటర్లో పీర్ల సలాములు అందుకునే కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలోని తూర్పుపాలెం, పడమటిపాలెం పీర్లను అత్యంత సుందరంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. డప్పువాయిద్యాలతో పురవీధుల్లో యువకులు చిందులేస్తూ పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పీర్లకు వారుపోసి మొక్కులు తీర్చుకున్నారు. నవాబుమిట్ట, తూర్పుపాలెం, పడమటిపాలెం, మసీదుతోట మీదుగా పీర్లు ప్రధాన రహదారికి చేరాయి. భక్తులు పీర్లపై తమలపాకులు చల్లుతూ భక్తిని చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా అందరూ ఊరేగింపులో పాల్గొన్నారు. రాత్రికి పీర్లు స్నానాల బావికి చేరాయి. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



పొదిలి పెద్దబస్టాండ్ సెంటర్‌లో ఊరేగుతున్న పీర్లు



పీర్ల చావిడివద్ద మండుతున్న హోమ గుండం

తిమ్మాపురంలో ఘనంగా పీర్ల పెద్ద సరిగెత్తు వేడుకలు

పెద్ద దోర్నాల : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మొహర్రం కార్యక్రమంలో భాగంగా పెద్ద సరిగెత్తు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల క్రమంలో పెద్ద సరిగెత్తు ఉత్సవం ప్రధానమైంది. భక్తులందరూ ఉపవాస దీక్షతో సాయంత్రం పీర్లకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున ఏర్పాటు చేసిన హోమగుండం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అర్ధరాత్రి వరకు కొనసాగే నైవేద్యాలు సమర్పణ అనంతరం పీర్ల ఉత్సవం ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 10గంటల వరకు జరుగుతుందని, సాయంత్రం పీర్లను నీళ్లలో తడిపే కార్యక్రమంతో మొహర్రం వేడుకలు పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలతో పాటు ఈ ఉత్సవాలను తిలకించేందుకు పరిసర గ్రామాలనుంచి పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

21 నుంచి బాదినేనిపల్లిలో పీర్లపండుగ ఉత్సవాలు

కొమరోలు, జూలై17: మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలో ఖాశింస్వామి పీర్లపండుగ మహోత్సవాలను ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు చావిడి ధర్మకర్త ఓరుగంటి రామ కృష్ణయ్య తెలిపారు. 21న పెద్దసరిగేసు రోజు పీర్లను శుభ్రంచేసి ప్రజల దర్శనార్థం ఉంచుతారు. రాత్రి పీర్లకు అవసమైన ఆభరణాలను, పట్టు వస్త్రాలను ధరింపచేసి తెల్లవారుఝామున గ్రామోత్సవం నిర్వహిస్తారు. 22న పగలు సరిగేసు స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. 23న పెద్దసరిగేసు చావిడిలోని పెద్ద ఖాశింస్వామి, చిన్న ఖాశింస్వామి, వెండిపీర్లను అందంగా పూలు, పట్టువస్త్రాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తుల సందర్శనార్థం ఉంచుతారు. 24న పీర్లు స్నానానికి వెళ్లటంతో పండుగ మహోత్సవాలు ముగుస్తాయి.

బేస్తవారపేటలో..

బేస్తవారపేట : మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో నుంచి ఊరేగింపుగా బేస్తవారపేట చేరుకొని సోమవారపేట సమీపంలోని చీతురే ఉకత్వ వద్ద ఉన్న ప్రాంగణంలో పీర్లకు చదివింపులు జరుపుకొని వెను దిరిగారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గిద్దలూరు, జూలై 17 : ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి దాని సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి అన్నారు. రాచర్ల మండలం అనంపల్లి గ్రామంలో మొహరం పర్వదినానికి గుర్తుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రమేష్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి రంగస్వామి

ఆర్టీసీ బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికుడికి గాయాలు

త్రిపురాంతకం, జూలై 17: విధుల్లో ఉన్న పారిశుధ్య కార్మికుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని వై.పాలెం కూడలి వద్ద బుధవారం జరిగింది. త్రిపురాంతకం గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న గుండపు చిన్నపోలయ్య రోజు మాదిరిగానే ప్రధాన రహదారిని శుభ్రపరుస్తున్న సమయంలో అనంతపురం నుంచి విజయవాడ వెళుతున్న సూపర్ లగ్జరీ బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో పోలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోనే పారిశుద్య పనులు నిర్వహిస్తున్న బంధువులు, తోటి కార్మికులు గమనించి స్థానికుల సహాయంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని గుంటూరుకు తరలించారు. కాగా కార్మికుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలయ్య బంధువులు తెలిపారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

బేస్తవారపేట,జూలై17: కౌలు రైతుల కార్డులపై రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. మండలంలోని గలిజేరుగుళ్ళ, అక్కపల్లె, పీవీపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి జక్కం మెర్సీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు రైతులు భూమి యాజమాని నుంచి స్టాంప్‌పై చేసుకున్న అగ్రిమెంట్, ఆధార్ కార్డులు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తద్వారా పరిశీలించి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు అందజేస్తామని అన్నారు.

మూడో రోజుకు రిలే దీక్షలు

పొదిలి, జూలై 16 : పొదిలి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మూడవరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో అధికారులు మూడు సంవత్సరాలుగా డ్రైవర్లకు, కండక్టర్లకు డ్యూటీచార్టులు వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వాటిని పరిష్కరించాలని కోరినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రీజనల్ కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించే వరకు కొనసాగిస్తామన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు

● ఉదారత్వం చూపిన కండక్టర్

గిద్దలూరు, జూలై 17 : నిత్యం తాను డ్యూటీ చేసే బస్సులో పాఠశాలలకు వెళ్లి వచ్చే ఆరుగురు పేద విద్యార్థులకు ఆర్టీసీ కండక్టర్ ఉలాపు శంకర్‌నాయుడు ఉచితంగా బస్‌పాస్‌లను అందించి ఉదారత్వం చూపారు. 12వేల రూపాయల సొంత నిధులు వెచ్చించి వారికి బస్‌పాసులను కొనుగోలు చేసి అందించారు. తురిమెళ్ళ, కంభం, అనుమలవీడు, గిద్దలూరులకు వెళ్ళి చదువుకునే పవన్, సాకేత్, దీనకుమారి, యాకోబ్, రాణి, సుజాతలకు సొంత ఖర్చుతో బస్‌పాస్‌లను అందించారు. విద్యాసంవత్సరం మొత్తం ఈ 6 మంది విద్యార్థులు వారి గ్రామాల నుంచి పాఠశాలలకు ఉచితంగా బస్‌ప్రయాణం చేయవచ్చని కండక్టర్ శంకర్‌నాయుడు తెలిపారు. ఉదారత్వం చూపిన కండక్టర్ శంకర్‌నాయుడును పలువురు అభినందించారు.

ఘనంగా పెద్ద షరిగత్తు గ్రామోత్సవం



పీర్ల గ్రామోత్సవంలో భక్తులు

పామూరు, జూలై 17 : మత సామరస్యానికి చిహ్నంగా జరుపుకుంటున్న మొహర్రం పండుగలో భాగంగా బుధవారం పెదసరిగత్తు గ్రామోత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న సర్కార్ పీర్ల చావిడికి సంబంధించిన అగ్నిగుండాన్ని ముజావర్లు వెలిగించారు. అనంతరం స్థానిక ఆకుల వీధిలోని శ్రీహజరత్ మహబూబ్‌సుభాని స్వామి దర్గా వద్ద ఉప్పలపాటి, కటికం బ్రదర్స్‌లకు చెందిన పీర్లను అందంగా ముస్తాబుచేసి మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించగా హిందు - ముస్లిం భక్తులు పాల్గొన్నారు. అనంతరం పీర్లను చావిడి వద్దకు తీసుకొచ్చారు. తెల్లవారుజామున తూర్పువీధికి చెందిన పలువురు భక్తులు అగ్ని గుండంవద్ద పలు క్రతువులు నిర్వహించి గాడి వెంకటేశ్వర్లు ఇంటివద్ద చన్నీళ్ల స్నానం ఆచరించి పీర్లను పట్టుకొని నిప్పులతో కనకనలాడే అగ్నిగుండంలో దూకుతూ భక్తిప్రపత్తులను ప్రదర్శించారు. అనంతరం పీర్లను చావిడిల్లో నిలబెట్టారు. ముజావర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరం పండుగ

తాళ్లూరు, జూలై 17 : మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రజానగరం, సోమవరప్పాడు, రామభద్రాపురం, బొద్దికూరపాడు తదితర గ్రామాల్లో పీర్ల ఉత్సవాన్ని వైభవరంగా నిర్వహించారు.

కురిచేడులో...

కురిచేడు, జూలై 17 : మండలంలో మొహర్రం పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్ల చావిళ్లలో పీర్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



తాళ్లూరులో బావి వద్దకు తరలి వెళ్తున్న పీర్లు



పామూరులో పీర్ల గుండాన్ని కాలుస్తున్న దృశ్యం

దర్శిలో ఆక్రమణల తొలగింపు



కాలువల్లో తీసిన మురుగు

- స్వల్ప వర్షానికే రోడ్డు ఎక్కుతున్న మురుగు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పూర్తి స్థాయిలో రహదారిని వెడల్పు చేయాలని వేడుకోలు
- ఈ సారైనా పూర్తిస్థాయిలో తొలగిస్తారా ? అధికారుల తీరుపై సందేహాలు

దర్శి, జూలై 17 : దర్శి నగర పంచాయతీలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా దర్శి-అద్దంకి రోడ్డులో మార్జిన్లలో ఆక్రమణలను తొలగించారు. మురుగుకాల్వకు అడ్డుగా వేసిన దిమ్మెలను తీసేశారు. కాల్వలో పూడికలను తీస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నందున మురుగు బయటకు వెళ్లకుండా అలాగే నిల్వ ఉంటున్న విషయం తెలిసిందే. కొద్దిపాటి వర్షం పడినా మురుగు రోడ్లపై చేరటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు మార్జిన్ ఆక్రమణల తొలగింపు, కాల్వల అడ్డంకులను తొలగించే కార్యక్రమాలను చేపట్టారు. చేపట్టిన పనులను పూర్తిగా నిర్వహిస్తారా లేదా అనే సందేహం ప్రజల్లో ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే కొన్ని రోడ్లల్లో ఆక్రమణలను తొలగించారు. ఆ తర్వాత కొన్నిరోడ్ల గురించి పట్టించుకోలేదు. ఆక్రమణలను తొలగించిన రోడ్లల్లో కొంత కాలానికి మళ్లీ యథాతథంగా ఆక్రమణలు ముందుకొచ్చాయి. ఆ సమయంలో రోడ్డు మార్జిన్‌లలో చిరు వ్యాపారులను తాత్కాలికంగా తొలగించారు. వారి నుంచి ముడుపులు వసూళ్లు చేశారనే విమర్శలు వచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ రోడ్లమార్జిన్లు ఆక్రమణల పేరుతో బంకులు, తోపుడుబండ్లు తొలగిస్తున్నారు. ఆక్రమణలతో రోడ్లు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారిన విషయం తెలిసిందే. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈసారైనా నిబద్దతతో ఆక్రమణలు తొలగిస్తారా గతంలో వలే తెరచాటు వ్యవహారాలను సాగించి చేతులు దులిపేసుకుంటారా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణలు, మురుగు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెమ్మసాని నాగేశ్వరరావు (ఫైల్)

దొనకొండ, జూలై 17 : రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రామాపురం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు... రామాపురం గ్రామానికి చెందిన పెమ్మసాని నాగేశ్వరరావు(48) అతని భార్య వెంకటరమణ ద్విచక్ర వాహనంపై కొచ్చెర్లకోటలోని ఆర్‌ఎంపీ వైద్యశాలలో వైద్యం పొంది తిరిగి సొంతూరు వెళ్తున్నారు. అదే గ్రామానిక చెందిన ఎం శివరామకృష్ణ తన ద్విచక్ర వాహనంపై రామాపురం నుంచి వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మార్కాపురం ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా వైద్యం పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందినట్లు సమాచారం. మృతిచెందిన నాగేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

దోమల నివారణకు ఫాగింగ్

పామూరు, జూలై 17 ; పామూరు పట్టణంలో దోమల ఉధృతి నివారణకు ఫాగింగ్ చేపట్టినట్లు పంచాయతి కార్యదర్శి వి. బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీదుల్లో దోమల మందును బుధవారం పిచికారి చేసారు. దాంతో పట్టణం అంత పోగాతో నిండిపోయింది. వారం రోజుల పాటు పట్టణంలోని మురికి వాడల్లో మరియు నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో వీదుల్లో కూడా దోమల నివారణ కు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు

మత్తు పదార్థాలు కలిగి ఉంటే చర్యలు



సీఐ రామానాయక్

పామూరు, జూలై 17 ; మత్తు పదార్థాలను సేవించడం నేరమని అది ప్రాణాలకు హానికరమని యువత, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సీఐ ఎం రామానాయక్ సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని రోజంత కష్టపడి సంపాదించిన సోమ్మును మత్తు పదార్థాలకోసం వెచ్చిస్తే కుటుంబం ఆర్థికంగా చితికి పోతునందని వివరించారు. సమయానికి సరైన ఆహారం తీసుకోకపోవడంతో రోగాలబారిన పడి అనారోగ్యాం పడుతున్నారన్నారు. పామూరు సర్కిల్ పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా ప్రాణాంతకరమైన మత్తు పదార్దాలను విక్రయించిన కొనుగోలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. మత్తు పదార్దాల సమాచారం ఉంటే తెలియపరచాలని కోరారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వరప్రసాదు



మాధవరావు చేతుల మీదుగా పత్రం అందుకుంటున్న వర ప్రసాదరావు

ముండ్లమూరు, జూలై 17 : జిల్లా రేషన్ డీలర్ల సంఘం అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన డీలర్ దేవతి వరప్రసాదును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర డీలర్ల సంఘం అధ్యక్షుడు లీలా మాధవరావు చేతుల మీదుగా జిల్లా ఉపాధ్యక్షుడి పత్రాన్ని వరప్రసాదు అందుకున్నారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగసూరి సుబ్బయ్య, మిత్తింటి ఏసుశెట్టి, వీరపనేని నాగేశ్వరరావు, ముప్పాళ్ల శ్రీను, చుంచు వీరనారాయణ తదితరులు వర ప్రసాదరావును అభినందించారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగానూ...

జిల్లా ఆర్యవైశ్య సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా దేవతి వరప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఒంగోలులో జరిగిన జిల్లా ఆర్యవైశ్య నూతన నూతన కార్యవర్గం సందర్భంగా ప్రసాదరావును ఎన్నుకున్నారు.

దర్శి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

దర్శి, జూలై 17 : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. దర్శి పట్టణంలోని 19వ వార్డులో నిర్మించే సీసీ రోడ్లకు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమిది అభివృద్ధి మార్గమని, వైసీపీది విధ్వంసకర మార్గమని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు దోచుకోవటం, దాచుకోవటమే తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు యథేచ్ఛగా జరిగాయని చెప్పారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఫిర్యాదు చేశామన్నారు. దర్శి పట్టణ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, కౌన్సిలర్ వీసీ రెడ్డి, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

తిరుగులేని వీరుడు ఏకలవ్య : మహ భారతంలో ఏకలవ్య తిరుగులేని వీరుడని ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఏకలవ్య జయంతి వేడుకల్లో ఆమె కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, దళిత ప్రజాసంఘాల నాయకులు, ఎస్టీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఏకలవ్య జయంతి సందర్భంగా కేకు కట్ చేస్తున్న డాక్టర్ లక్ష్మీ

అన్నదానం ప్రారంభం : దర్శి పట్టణంలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అద్దంకి రోడ్డులోని రామాలయంలో ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బస్సును ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి

కురిచేడు, జూలై 17 : మండల ప్రజలు చాలాకాలంగా ఎదురు చూస్తున్న ఓ సమస్యకు నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం చూపారు. గతంలో వినుకొండ నుంచి కురిచేడుకు రావడానికి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సైతం ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా ఫలితం లేదు. ఈ క్రమంలో ప్రజలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి దృష్టికి బస్సు సమస్యను తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన లక్ష్మి పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు పునరుద్ధరణ విషయం చర్చించి అనుమతి పొందారు. మంగళవారం రాత్రి నుంచి బస్సు పునరుద్ధరణ జరిగి వినుకొండ నుంచి రాత్రి 9 గంటల సమయంలో బయలుదేరింది. కురిచేడులో రాత్రి 9.30 గంటల సమయంలో గొట్టిపాటి లక్ష్మి బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు.

విద్యార్థి తల్లిదండ్రులకు బహుమతి అందజేత

ముండ్లమూరు, జూలై 17 : మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన అల్లె చంద్రశేఖరరెడ్డి ఈ ఏడాది మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 577 మార్కులు సాధించినందుకు ప్రోత్సాహక బహుమతి అందుకున్నాడు. గ్రామానికి చెంది హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్న వాతల శ్రీనివాసరెడ్డి రూ.10వేలు నగదును బహుమతిగా ప్రకటించి ఆ నగదును విద్యార్థి చంద్రశేఖరరెడ్డి తల్లిదండ్రులైన అల్లె వీరవెంకటరెడ్డి, కృష్ణవేణి దంపతులకు అందజేశారు.

లోకేష్‌ను కలిసిన గొల్లపూడి

తాళ్లూరు, జూలై 17 : రాష్ట్ర ఐటీ, కమ్యూనికేషన్, విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కొర్రపాటివారిపాలేనికి చెందిన రాష్ట్ర తెలుగు యువతకార్యదర్శి గొల్లపూడి వేణుబాబు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

బహిరంగ ప్రకటన

...M/s. Shriram Finance Ltd., Atmakur బ్రాంచి మేనేజర్ ...

SCHEDULE

... 12.18 మీటర్లు కొలతలు గల 222.22 చదరపు గజములు లేక 185.99 చదరపు మీటర్లు ఖాళీ స్థలముయున్నా ...

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259628

భక్తిశ్రద్ధలతో స్వామి కల్యాణం

పామూరు, జూలై 17 : పామూరులోని అంకాళమ్మ వీధి లోగల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ తిరునాళ్ల వేడుకల్లో భాగంగా బుధవారం స్వామి శాంతి కల్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం వద్ద ఉదయం ఏకాదశి సందర్భంగా స్వామిలకు పంచామృతభిషేకం, అష్టోత్తర కుంభాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం చేపట్టి పాటకచేరి ఏర్పాటు చేశారు.



పామూరులో స్వామి శాంతి కల్యాణంలో భక్తులు

కురిచేడులో...

కురిచేడు, జూలై 17 : హిందువుల తొలి పండుగ తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు మండలంలో వైభవంగా జరిగాయి. ప్రజలు వైష్ణవ ఆలయాలకు వెళ్లి స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కురిచేడు, పొట్లపాడు కోదండ రామాలయాల్లో ఉదయం స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అందంగా అలంకరించిన స్వామి వార్లు భక్తులకు దర్శన మిచ్చారు.



పెద ఉల్లగల్లులోని వెంకటేశ్వర స్వామి

తాళ్లూరులో...

తాళ్లూరు, జూలై 17 : తొలిఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. తూర్పుగంగవరం, తాళ్లూరు, బొద్దికూరపాడు, శివరాంపురం, విఠలాపురం తదితర గ్రామాల్లో దేవాలయాలు భక్తులతో ఆలయాలు రద్దీగా మారాయి. పలు గ్రామాల్లో స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో మేళతాళాలతో గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

దొనకొండలో...

దొనకొండ, జూలై 17 : మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక నాల్గురోడ్ల కూడలిలో ఆనంద ఆశ్రమంలోని దేవాలయంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో శ్రీ గోవిందమాంబ, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, శ్రీఅన్నపూర్ణ సహిత కాశివిశ్వేశ్వరునికి అర్చకులు మణిబాబుశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

మహారుద్ర పీఠంలో ఏకాదశి పూజలు

పీసీపల్లి, జూలై 17 : తొలి ఏకాదశి పండుగను మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు.సమీపంలోని ఆలయాలకు వెళ్లి పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.పెదయిర్లపాడులోని మహారుద్ర పీఠంలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.అక్కడ ఉన్న 1116శివలింగాలను దర్శించుకున్న భక్తులు అభిషేకాలు నిర్వహించారు.అర్చకులు పలుకూరి సుబ్బారావు విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా తొలి ఏకాదశి పండుగ విశిష్టతను భక్తులకు వివరించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ముండ్లమూరు, జూలై 17 : మండలంలోని భక్తులు తొలి ఏకాదశి పండుగను ఘనంగా నిర్వహించారు. మొదటి పండుగ కావటంతో గ్రామాల్లోని దేవాలయాలు కిటకిటలాడాయి. పెద ఉల్లగల్లులోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరు, పసుపుగల్లు, పులిపాడు, పెద ఉల్లగల్లు, ఈదర, అగ్రహారం గ్రామాల్లో వేంచేసి ఉన్న శివాలయాలు సైతం భక్తులతో కిటకిటలాడాయి.

కనిగిరిలో 12 అడుగుల బాబా భారీ విగ్రహం ఏర్పాటు

కనిగిరి, జూలై 17 : కనిగిరి బాబా దేవస్థానానికి ప్రముఖ వేద పండితులు ఇందుకుమార్‌శర్మ తన తల్లితండ్రుల జ్ఞాపక చిహ్నంగా బాబా భారీ విగ్రహాన్ని బహూకరించారు. ఈ విగ్రహాన్ని బాబా మందిరంకు వెళ్లే ప్రధానదారి వద్ద రెండు రోడ్లు కలిసే దేవస్థాన స్థలంలో బుధవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఇందుకుమార్‌శర్మ సతీసమేతంగా వేద మంత్రోశ్ఛరణల నడుమ బాబా విగ్రహానిక ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు రూ.6.5 లక్షలతో 12 అడుగులతో మలిచిన బాబా విగ్రహం ప్రత్యేకంగా ఫైబర్‌తో తయారు చేయించినట్లు ఇందుకుమార్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.



బాబా విగ్రహం

పీర్ల ఊరేగింపులో ఇరువర్గాలకు వివాదం

ఉద్రిక్త వాతావరణం నడుమ ఉత్సవం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో సామరస్యంగా సాగిన కార్యక్రమం

కనిగిరి, జూలై 17 : మొహర్రం పండుగ సందర్భంగా కనిగిరిలో బుధవారం జరిగిన పీర్ల ఊరేగింపులో ఇరు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం పెద్దదై ఒంగోలు నుంచి ప్రత్యేక బలగాలు మోహరించాల్సిన ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. వివరాల్లోకి వెళితే... ఏటా మొహర్రం పండుగ సందర్భంగా కనిగిరిలోని ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న దర్గాలు, మసీదుల నుంచి పీర్ల ఊరేగింపుగా బొడ్డుచావిడి, రామాలయం వీధి నుంచి పామూరు బస్టాండు వద్దకు చేరుకుంటాయి. బొడ్డుచావిడి వచ్చే ముందుగానే పీర్ల ఊరేగింపులో ఎలాంటి డప్పు, వాయిద్యాలను ఉపయోగించరాదన్నది ఆచారం. పీర్ల ఊరేగింపు నిర్వహించే వర్గం వారు బొడ్డుచావిడి గోపురం వద్ద డప్పు, వాయిద్యాలతో పెద్దఎత్తున చేపట్టారు. దీనికి ఆయా వీధుల్లో ఉండేవారు అభ్యంతరం చెప్పటంతో వివాదం ఏర్పడింది. ఊరేగింపులో గతానికి భిన్నంగా డప్పులను కొట్టడం ఎంతవరకు సబబని పోలీసులను వారు నిలదీశారు. ఏకాదశి పండుగ అయినా కూడా తమ దేవాలయాలను మూసివేసి వారికి సహకరిస్తుంటే ఆ వర్గం వారు ఆ విధంగా ప్రవర్తించటం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సీఐ వెంకటేశ్వరరావు పీర్ల ఊరేగింపు నిర్వహించే వారితో మాట్లాడి డప్పులు లేకుండా పీర్లను బొడ్డుచావిడి నుంచి రామాలయం మీదుగా పంపించే విధంగా సర్దిచెప్పారు. ఆ ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పీర్ల ఊరేగింపులోని కొంతమంది అల్లరి మూకలు చేసే సంజ్ఞలతో రెండోవర్గం వారు కోపోద్రిక్తులై జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. దీంతో తిరిగి వివాదం ముదిరి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని డీఎస్పీ రామరాజుకు సీఐ సమాచారం అందించటంతో ఒంగోలు నుంచి ప్రత్యేక బలగాలు వచ్చాయి. అయినా ఇరువర్గాలు ఏ మాత్రం వెనక్కి తగ్గకపోవటంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. బొడ్డుచావిడి వద్ద చుట్టూ పెద్ద మోకులతో బారికేడ్లు కట్టారు.



ఇరువర్గాలను నిలువరిస్తున్న పోలీసులు



చర్చిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఉగ్ర రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సంఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. పోలీసులతో సమావేశమై ఇక్కడ ఇరువర్గాల మనోభావాలు ముఖ్యమేనని, ఎవరికి అభ్యంతరాలు లేకుండా పీర్లను ఊరేగించాలని పోలీసులకు సూచించారు. పోలీసులు మరోసారి ప్రయత్నించినా ఇరువర్గాల వారు సహకరించలేదు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర స్వయంగా వెళ్లి బొడ్డుచావిడి వద్ద ఉండే వర్గం వారితో, పీర్ల ఊరేగింపు నిర్వహించే వర్గం వారితో చర్చించారు. డప్పు, వాయిద్యాలు లేకుండా పీర్ల ఊరేగింపు చేసుకునేలా ఇరువర్గాల వారితో మాట్లాడి సర్దిచెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగి డప్పు, వాయిద్యాలు లేకుండా పీర్లను ఊరేగించారు. పామూరు బస్టాండు వద్దకు చేరుకున్న పీర్లు సలాంలు చేసుకున్నాయి. అంగరంగా వైభవంగా పీర్లు ఊరేగింపు ఉత్సవం ముగిసింది.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

బిల్డింగ్ ప్లాన్స్ & ఎలివేషన్స్

ప్రకాశం జిల్లాలో ఇల్లు కట్టుకొనుటకు ప్లాన్లు గీసి అప్రూవల్ చేయించబడును. ఎలివేషన్స్ చేయబడును. బాషా ఆర్కిటెక్స్, SMBC-1252, ఒంగోలు. సెల్: 7702244786, 9491224027 AJO-183946

గోడౌన్ అద్దెకు ఇవ్వబడును

వెల్లంపల్లి, మద్దిపాడు(మం), NH-16 ప్రక్కన 50X60 కొలతలు గల షెడ్, 50HB కరెంట్, బోరింగ్ వసతులు గల గోడౌన్ అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9505503178, 7780246363. AJO-190188

వెంటనే కావలెను

బాషా ఆర్కిటెక్స్, SMBC, ఒంగోలు నందు పనిచేయుటకు B.Tech Civil చదివి బిల్డింగ్ ప్లాన్స్ & ఎలివేషన్స్ (3D Max) గీయుటకు Female కావలెను. సెల్: 7702244786 AJO-183945

PLOT FOR SALE

మారం వెంకారెడ్డి రియల్ ఎస్టేట్స్, ఒంగోలు NH-5 నుండి మంగమూరు రోడ్డు పవర్ ఆఫీస్ దాటాక తక్షణం ఇల్లు నిర్మించుటకు, ఇన్వెస్ట్‌మెంట్‌కి అనుకూలంగా ఒక్క గది కేవలం 36 వేలకే ప్లాట్స్ కలవు. సంప్ర॥9885184207 స్పాట్ రి॥ AJG-9497

ట్రైనింగ్ సెంటర్

రాధిక M.P.H.W ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సుందరయ్య భవన్ రోడ్, శ్రీనివాస హాస్పిటల్ ఎదురు, ఒంగోలు, కోర్సులు : M.P.H.W(F), ANM / DMLT Q: ఇంటర్ ఏ గ్రూప్ వారైన, ప్రభుత్వ స్కాలర్‌షిప్ కలదు. సంప్ర॥ 08592 282349, 8978869519, 7674998230 AJO-190174

మీ సర్టిఫికేట్స్ పోయినవా ?

మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికేట్స్ తెప్పించబడును. సర్టిఫికేట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616. AJG-191543

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ద్వారా బహిరంగ ప్రకటనలు, లీగల్ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి అన్నిరకాల ప్రకటనలు తెలియజేయుడి.

జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు | విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు | ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అధనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి పత్రిక కొరకు సంప్ర॥ 9985411484



కోటప్పకొండపై.. తొలి ఏకాదశి సందడి


జలాభిషేకం


పసుపుతో..


కుంకుమతో..


గంధంతో..


విభూదితో..


ప్రత్యేక అలంకారం

కోటప్పకొండ (నరసరావుపేట), జూలై 17 : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర సన్నిధిలో బుధవారం భక్తుల కోలాహలం నెలకొంది. స్వామికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండకు వేలాదిగా తరలి వచ్చి కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు. ఆనందవల్లి అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. సోపాన మార్గంలో భక్తులు మెట్ల పూజలు చేశారు. వినాయక స్వామి విగ్రహం, ధ్యాన శివుని విగ్రహం, నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. ఎమ్మెల్యేలు డాక్టర్ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఏసీ ఎస్ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. వివిధ సేవా సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి.

శ్రీ త్రికోటేశ్వర స్వామికి నాగాభరణం

శ్రీ త్రికోటేశ్వర స్వామికి భక్తులు వెండికి బంగారం పోత పోసిన నాగాభరణం సమర్పించారు. రూ 6 లక్షల విలువైన నాగాభరణాన్ని పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన మహంకాళి నాగరాజు, లక్ష్మీ, మహంకాళి శ్రీకాంత్, లక్ష్మీ స్వామికి కానుకగా ఇచ్చారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించి గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. ఎమ్మెల్యే పుల్లారావు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

- ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు బకాయిలు చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్
- ఉమ్మడి జిల్లాలో బకాయిలు రూ.80 కోట్లుపైనే
- వైసీపీ జమానాలో ఖాతాల్లో జమ కాని ఫీజులు



సర్టిఫికెట్ కష్టాలు తీరినట్లే..

బీటెక్, ఫార్మసీ డిగ్రీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. కళాశాలలకు ఉన్న బకాయిల్ని చెల్లించడానికి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఇటు విద్యార్థుల్లో, అటు యాజమాన్యాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభకు పరిష్కారం లభించనుంది.

గుంటూరు(విద్య),జులై 17: ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కిపైగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీటెక్, ఫార్మసీ చివరి సంవత్సరం చదివే విద్యార్థులు దాదాపు 15 వేల మందికిపైగా ఉండవచ్చని అంచనా. గత ప్రభుత్వం కళాశాలల వారీగా ఫీజుల్ని నిర్ణయించింది. ఇందులో భాగంగా రూ.40 వేల నుంచి రూ.75 వేలకుపై ఫీజుల్ని కళాశాలల్లో ఉన్న వసతుల్ని బట్టి నిర్ణయించింది. అయితే ఈ ఫీజుల విషయంలో అనేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫీజులను సవరించాలని యాజమాన్యాలు అనేకసార్లు కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అనేక కళాశాలలు నిర్వహణ భారం మోయలేక ఆర్థికంగా కుదేలయ్యాయి.

కొత్త విధానంతో ఇక్కట్లు

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో తీసుకువచ్చిన కొత్త విధానం అటు విద్యార్థులకు, ఇటు యాజమాన్యాలకు తలనొప్పిగా పరిణమించింది. గతంలో ప్రభుత్వం చెల్లించే ఫీజులు విడతల వారీగా నేరుగా కళాశాలల ఖాతాలకు జమయ్యేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఫీజుల విషయంలో రివర్స్ విధానం తీసుకువచ్చింది. విడతల వారీగా సీఎం జగన్ బటన్ నొక్కి ఫీజుల్ని విద్యార్థుల తల్లుల ఖాతాలకు మళ్ళించారు. ఖాతాల్లో జమ అయిన ఫీజుల్ని బ్యాంకుల నుంచి డ్రా చేసి తల్లులు కళాశాలలకు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనేక సార్లు బటన్ నొక్కినా ఫీజులు సకాలంలో వారి ఖాతాల్లో జమకాలేదు. ఒకవేళ తల్లుల ఖాతాల్లో డబ్బులు పడినా, వాటిని వారు సొంత అవసరాలకు వాడుకున్న ఉదంతాలు ఉన్నాయి. ప్రతి కళాశాల పరిధిలో కనీసం 35 నుంచి 45శాతం మంది ఇలా ఫీజుల్ని చెల్లించలేదు. ఈ పరిస్థితుల్లో సకాలంలో ఫీజుల చెల్లింపులు జరగక పోవడంతో కళాశాలల నిర్వహణ యాజమాన్యాలకు కష్టంగా మారింది. ఒకవైపు సకాలంలో ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడం, వచ్చిన ఫీజుల్ని తల్లిదండ్రులు సకాలంలో చెల్లించక పోవడం వంటి కారణాలు జిల్లాలో నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో బీటెక్ చివరి సంవత్సరం వరకు విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.80 కోట్లు వరకు ఉన్నట్లు సమాచారం. దీంతో ఫీజుల బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ యాజమాన్యాలు విద్యార్థులకు తెగేసి చెప్పాయి. ఫలితంగా బీటెక్, ఫార్మసీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాని పరిస్థితి నెలకొంది. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు, ఎంటెక్ ఇతర కోర్సులకు దరఖాస్తు చేసిన అనేక మంది ఇక చేసేది లేక కళాశాలకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది నుంచి పాత పద్ధతిలోనే ఫీజులు చెల్లించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. నేరుగా కళాశాలల ఖాతాలకే ఫీజులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తుంది.

మొదటి విడత సీట్లు కేటాయింపు పూర్తి

ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న వారికి మొదటి విడత సీట్ల కేటాయింపు బుధవారం పూర్తి అయింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 17 నుంచి 22లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో కొన్ని పేరున్న కళాశాలల్లో మాత్రమే పూర్తిస్థాయి సీట్లు భర్తీ అయ్యాయి. త్వరలో నిర్వహించే రెండు, మూడు కౌన్సెలింగ్‌లలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ భూమి.. ప్రభుత్వానికే.. దానం!

నిరుపేదలకు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూమిని చట్ట ప్రకారం కొనడం, అమ్మడం నేరం.. అంటే చట్టప్రకారం ఆ భూమిపై సర్వహక్కులు ప్రభుత్వానివే.. అలాంటిది బాపట్ల మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలంలో ఓ రేంజ్ జగన్నాటకానికి గతంలో వైసీపీ ప్రభుత్వం తెరలేపింది. అసైన్డ్ భూమి అంటేనే అది సాంకేతికంగా ప్రభుత్వ భూమి కింద లెక్క..అలాంటిది దానిని ఓ వ్యక్తి ఉదార వైఖరితో బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం కోసం దానం ఇచ్చారట.. అది నచ్చి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేత సదరు వ్యక్తికి సన్మానం కూడా చేయించారు.. ఈ తంతు అంతటిని అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు చోద్యం చూశారు. ఇది బాపట్ల మెడికల్ కళాశాల స్థలం విషయంలో వైసీపీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న వింతవైఖరి. అన్నింటికన్నా మించి పరాకాష్ట ఏమిటంటే అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం ఆ భూమిలో పేదలెవరు లేని కారణంగా దానిని తిరిగి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. మరి ఇక్కడ వితరణకు అవకాశం ఎక్కడ ఉందనే దానికి అప్పటి ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ వెనకాల మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న అసైన్డ్ భూముల ధర పెంచే కుట్ర జరిగిందనే అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.

దానికి సీఎంతో సన్మానం



- అసైన్డ్ భూమికి కొత్త భాష్యం చెప్పిన వైసీపీ
- బాపట్ల మెడికల్ కళాశాల భూ వ్యవహారంపై అనుమానాలు
- మొత్తం వ్యవహారంలో క్విడ్ ప్రో కోపై సందేహాలు
- సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం కోసం పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 54 ఎకరాల భూమిని అప్పటి వైసీపీ ప్రభుత్వం గుర్తించి 2021 మేలో భూమిపూజ చేపట్టింది. ఈ 54 ఎకరాలతో పాటు దీని చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల వరకు అసైన్డ్ భూమిగానే ప్రభుత్వ రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. కానీ కళాశాల నిర్మాణం కోసం భూమిని దాత విరాళంగా ఇచ్చారని అప్పట్లో వైసీపీ నేతలు ప్రకటించారు. మరోవైపు ఈ భూమి అసైన్డ్ అని పేదలెవరూ లేని కారణం చేత తిరిగి ప్రభుత్వం తీసుకుని కళాశాల నిర్మాణం కోసం వినియోగిస్తున్నట్లు అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ఓ రకమైన ఆదేశాలిస్తే, వైసీపీ నేతలు మాత్రం ఆ భూమిని ఓ వ్యక్తి వితరణగా ఇచ్చారని ప్రచారం చేశారు..

సన్మానం చేయడం ఏమిటి..

వైసీపీ ప్రభుత్వంలో అసైన్డ్ భూముల చట్టవిరుద్ధ క్రయవిక్రయాలకు ఏ విధంగా మద్దతు పలికారు అనేదానికి బాపట్ల మెడికల్ కళాశాల భూమి అంశాన్ని నిదర్శనంగా చెప్పవచ్చు. అసైన్డ్ భూములను కొనడమే నేరమని చట్టం చెబుతుంటే ఆ భూములను కొనుగోలు చేసి సుదీర్ఘకాలం అనుభవించిన వ్యక్తి వితరణ ఇచ్చాడని చెప్పి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డే సన్మానం చేయడం, దానికి సాక్షీభూతాలుగా ప్రభుత్వ అధికారులు నిలవడం ఏమిటనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. కొత్తప్రభుత్వం కొలువుదీరగానే ఐదేళ్లలో జరిగిన భూ అక్రమాలపైనే ప్రధానంగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా అసైన్డ్ బాగోతాలపై సమగ్ర విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా కొత్త ప్రభుత్వం చేస్తోంది. ఈ నేపథ్యంలో బాపట్లలో జరిగిన మెడికల్ కళాశాల అసైన్డ్ భూమి వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే చేసిన హడావిడి మరోమారు చర్చకు వచ్చింది. అసైన్డ్ భూమిని వితరణగా ఇచ్చారని చెప్పి ఏకంగా ప్రభుత్వాధినేత చేతే సన్మానం చేయించే బరితెగింపునకు అప్పటి వైసీపీ నేతలు పాల్పడ్డారంటే చట్టాలపై వీరి లెక్కలేని తనానికి ఈ ఉదంతం ఓ ఉదాహరణగా చెప్పవచ్చు.

తొలుత పరిహారం పేరుతో కుట్ర...


మెడికల్ కళాశాలకు భూ సేకరణ అంశం అప్పట్లో తెర మీదకు వచ్చినప్పుడు తొలుత అసైన్డ్ భూముల్లో పేదలే ఉన్నట్లు చూపి పరిహారం సాకుతో కోట్లు దోచేయాలని వైసీపీ నేతలు పథకం వేశారు. కానీ ఆ భూమి మొత్తం అసైన్డ్ చేసిందేనని, అక్కడ పేదలెవరూ సాగుచేయడం లేదనే అంశం బయటకు పొక్కడంతో వితరణ నాటకానికి వైసీపీ నేతలు ముగింపు పలికారు. భూముల ధర పెంపుకోసం క్విడ్ ప్రోకో ప్రాతిపదికనే ఈ తతంగం అంతా జరిగినట్లు సమాచారం.

విచారణ చేయించాల్సిందే..

మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల భూమి కూడా పేదలకు అసైన్డ్ చేసినదే. ఇటీవల ప్రభుత్వం అసైన్డ్ చేసిన పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే క్రమంలో బాపట్ల పరిధిలో ఉన్న దాదాపు 2300 ఎకరాలకు సంబంధించి ఒక్కరంటే ఒక్కరు కూడా ఒరిజినల్ అసైనీ సదరు భూమిని అనుభవించడం లేదని తేల్చేసి ఎవరికీ యాజమాన్య హక్కులు కల్పించలేదు. మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూముల విషయంలో ఇదే నివేదికను గతంలో అధికారులు ఇచ్చారు. కానీ మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూములు పేదల నుంచి వైసీపీ నేతల చేతిలోకి మారినట్లు సమాచారం. వాటికి ధర పెంచి రియల్ సొమ్ము చేసుకునే క్రమంలోనే ఈ వితరణ నాటకానికి తెరలేపి క్విడ్ ప్రో కో కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న అసైన్డ్ భూములలో ఒరిజినల్ అసైనీ లేరని ఇప్పటికే గత ప్రభుత్వం ధ్రువీకరించింది. అలాంటప్పుడు ఆ భూములను కూడా తిరిగి స్వాధీన పరచుకునే విధంగా కొత్త ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. అప్పుడే గత ప్రభుత్వంలో వ్యూహం ప్రకారం అసైన్డ్ భూమి దానం అనే నాటకానికి తెరలేపిన వైసీపీ నేతల కుయుక్తులను ఛేదించినట్లవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇంత వరకు పునాదులు దాటలేదు..

2021 మే 31న మెడికల్ కళాశాలకు ఆర్భాటంగా భూమి పూజ చేసిన వైసీపీ నేతలు తర్వాత ఏడాదిన్నర వరకు పనులు ప్రారంభించిన దాఖలాలే లేవు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో మళ్లీ మెడికల్ కళాశాల పనులు అంటూ హడావిడి చేశారే తప్ప దాని నిర్మాణం పూర్తి విషయం లో చిత్తశుద్ధి చూపకపోవడం గమనార్హం.


కుడి కాలువ ద్వారా విడుదలవుతున్న నీరు

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

- తొమ్మిది రోజులు 5, 7 గేట్ల ద్వారా దిగువకు
- తాగునీటి కోసం రోజుకు 5500 క్యూసెక్కులు

మాచర్లటౌన్, జూలై 17: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కుడి కాల్వకు బుధవారం తాగునీటిని విడుదల చేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు ఆదేశాలతో కుడి కాల్వ 5, 7 గేట్ల ద్వారా 5500 క్యూసెక్కుల నీటిని ఓఅండ్ఎం ఈఈ శ్రీహరి స్విచ్ఛాన్ చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీహరి మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం 4.5 టీఎంసీల నీటిని రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 9 రోజులపాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కుడి కాల్వ పరిధిలోని చెరువులు, కుంటలను నింపుకుని తాగునీటి అవసరాల నిమిత్తం వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మురళీధర్, జేఈ బాబు మియా పాల్గొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న ఈఈ శ్రీహరి

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- గంజాయి నిరోధానికి త్వరలో హెల్ప్‌లైన్
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుషార్‌డూడీ



బాపట్ల, జూలై 17: బాపట్ల ఎస్పీగా తుషార్ డూడీ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వేదమంత్రోచ్చరణల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి జిల్లాలోని శాంతిభద్రతలు గురించి చర్చించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు చిన్నపిల్లలపై జరిగే నేరాల మీద ప్రత్యేక దృష్టిపెడుతామన్నారు. పెండింగ్ కేసుల విచారణలో సాంకేతికతను జోడించుకుని వేగంగా దర్యాప్తు చేస్తామన్నారు. సముద్రతీరప్రాంతంలో భద్రతా చర్యలపైమరింత దృష్టిపెడతామన్నారు. నిష్పక్షపాతంగా సేవలందిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా పోలీసు స్టేషన్‌కు వచ్చి వారి సమస్యలు చెప్పుకునే విధంగా చూస్తామని, గంజాయి,ఇతర మాదక ద్రవ్యాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలియపర్చడానికి హెల్ప్‌లైన్‌ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఏ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీలు సి.హెచ్.మురళీకృష్ణ, టి.మురళీకృష్ణ, పి.జగదీష్‌నాయక్, సీఐలు, ఎస్‌ఐలు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

మడ.. మాయం

- తీర రక్షణ చెట్లు తొలగింపు

చీరాల, జూలై 17: తీరంలో రక్షణగా ఉండే మడ చెట్లు(సరిగ) మాయం అవుతున్నాయి. దీంతో విపత్తుల సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయినా సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల జీవన భృతి కోసం తీరం వెంట ఉన్న అటవీ శాఖ భూములను వారికి కేటాయించారు. ఆయా భూముల్లో లబ్ధిదారులు మడచెట్లతో పాటు సరిగ తదితర మొక్కలను సాగు చేసుకుని, వాటిపై వచ్చే ఫలసాయాన్ని పొందాలి. ఇదీ నిబంధన. అయితే వాడరేవు నుంచి రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం వరకు తీరం వెంట రిసార్టులు వెలిశాయి. రిసార్టుల నిర్వాహకుల్లో కొందరు సీ వ్యూ పేరుతో తీరానికి రక్షణగా ఉండాల్సిన మడచెట్లను తొలగించారు. సముద్రపు అలలు ఒడ్డుకు చేరి తిరిగి సముద్రంలోకి వెళ్లాలి. మడ చెట్లు అడ్డుగా లేకపోవడంతో కొంతమేర సముద్రపు జలాలు చొచ్చుకువచ్చి కొన్నిచోట్ల గుంతలు ఏర్పడుతున్నాయి. ఇవే ప్రమాదాలకు కారణమవుతున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

రామాపురం, కఠారివారిపాలెం మధ్య తీరంలో ఓ రిసార్ట్ నిర్వాహకుడు ఏర్పాట్లు (ఫైల్)



EAPCET Admissions Announced!
Glorious Achievement!
Thanks All
Celebrating an Extraordinary Achievement!
100% ADMISSIONS
in both the Colleges.
We sincerely thank all parents for their immense faith and trust in us.
KITS EDUCATIONAL INSTITUTIONS
For Details: 99517 13366, 99089 78444
KITS AUTONOMOUS
KKR & KSR INSTITUTE OF TECHNOLOGY AND SCIENCES
Vinjanampadu, Vatticherukuru (Mandal)
Guntur - 522 017, AP
Ph: 0863-22 866 66 / 77
www.kitsguntur.ac.in /kitsguntur
KITS AKSHAR
INSTITUTE OF TECHNOLOGY
(Formerly Guntur Engineering College)
NH-16, Opp. Katuri Medical College
Yanamadala, Guntur - 522 019, AP
Ph: 0863-22 888 86 / 87
www.kitsakshar.ac.in /kitsakshar

కల్వర్టర్ కూలి ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు

అధ్వానంగా తిమ్మసముద్రం రహదారి

గొల్లపాలెం మీదుగా రాకపోకలు


సైఫన్ సమీపంలో కూలిన కల్వర్టర్ రక్షణగోడలు

ఇంకొల్లు, జూలై 17 : ఇంకొల్లు నుంచి తిమ్మసముద్రం వెళ్లే రహదారి కడవకుదురు ప్రధాన రహదారి నుంచి తిమ్మసముద్రం వరకు పూర్తిగా దెబ్బతిన్నది. రాకపోకలు సాగించేందుకు వీలునంతంగా పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. దీంతో ఆర్టీసీ అధికారులు ఈ రహదారిలో బస్సులు నడపలేక దారి మళ్లించి సర్వీసులు నడుపుతున్నారు. కడవకుదురు రోడ్డు నుంచి తిమ్మసముద్రం వెళ్లే లింకు రోడ్డులో మూలమలుపు సైఫన్ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు రక్షణ గోడలు కూలిపోయాయి. ఉన్న తూములు కూడా దెబ్బతినడంతో ఇక్కడ నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేందుకు ప్రమాదబరితంగా ఉంది. వైసీపీ పాలకులు ఈ రహదారిలో చిన్నపాటి మరమ్మతులు కూడా చేయకపోవడంతో సమస్య తీవ్రతరంగా మారి రాకపోకలు నిలిచిపోయో పరిస్థితి నెలకొంది. దీంతో గత రెండు రోజులుగా ఈ రహదారిలో ఇంకొల్లు నుంచి తిమ్మసముద్రం మీదుగా చీరాల వెళ్లే ఆర్టీసీ సర్వీసులు తిరగడం లేదు. ఈ సర్వీసులను గొల్లపాలెం మీదగా దారి మళ్లించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిలో కనీస మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

జీపును ఢీకొన్న కారు

ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు


చిన్నారికి చికిత్స చేస్తున్న వైద్యులు

పర్చూరు, జూలై 17 : అతివేగంగా వస్తున్న జీపు కారును ఢీకొట్టగా ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయలైన సంఘటన పర్చూరు - చీరాల రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో జీపు రోడ్డు మార్జిన్‌లోకి బోల్తా కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిలకలూరిపేట నుంచి చీరాల వెళుతున్న జీపును కారంచేడు నుంచి పర్చూరు వస్తున్న కారు లారీని తప్పించబోయి ఢీకొంది. దీంతో జీపు పల్టీలు కొడుతూ మార్జిన్‌లో బోల్తాపడింది. డ్రైవర్‌తోపాటు, ఇద్దరు చిన్నారులు సాజిద, నౌషిన్‌కు తీవ్రగాయలయ్యాయి. వారిని 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు తరలించారు.

క్యూకట్టిన కార్పొరేటర్లు

ముహూర్తం మొదటివారంలో దామచర్ల ఓకే అంటే వైసీపీలో మిగిలేది సింగిల్ డిజిటే

పరిస్థితిని చూసి మాగుంట వద్దకెళ్లిన మేయర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రతిష్ఠాత్మకమైన ఒంగోలు కార్పొరేషన్ టీడీపీపరం కావటం ఖాయమైపోయింది. వైసీపీ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు మాజీ మంత్రి బాలినేని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. బాలినేని ఇలా వచ్చి అలా వెళ్లగానే ఆ పార్టీ కార్పొరేటర్లు ఎమ్మెల్యే దామచర్లను కలిసేందుకు క్యూకట్టారు. దామచర్ల వద్ద అవకాశం దక్కని మేయరు సుజాత ఎంపీ మాగుంటను కలిసి పరోక్షంగా పార్టీ మారేందుకు తాను సిద్ధమేనన్న సంకేతాన్ని ఇచ్చేశారు. ఆచితూచి అడుగేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్ పూర్తిగా తలుపులు తెరిస్తే ఒంగోలులో వైసీపీకి మిగిలే కార్పొరేటర్లు సింగిల్ డిజిట్‌లోనే ఉండబోతున్నారంటే అతిశయోక్తి కాదు. అయితే ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఎమ్మెల్యే దామచర్ల వారంరోజులు అందుబాటులో ఉండనందున కార్పొరేటర్ల చేరికలతో పాలకమండలిపై టీడీపీ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని ఆగస్టు మొదటి వారంలో చేయాలని నిర్ణయించుకున్నారు.

వైసీపీ ఘోర ఓటమితో..

సార్వత్రిక ఎన్నికలకు ముందే ఒంగోలు కార్పొరేషన్‌లోని ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తర్వాత మరింతమంది టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపారు. తొలుత ఫిరాయింపులను ప్రోత్సహించాలా వద్దా అన్న సంశయంతో ముందుకు సాగిన ఎమ్మెల్యే జనార్దన్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు పాలకమండలి అవసరాన్ని గుర్తించి కార్పొరేటర్లను చేర్చుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. తర్వాత ఒక్కొక్కరుగా కార్పొరేటర్లు టీడీపీలో చేరే ప్రక్రియ ప్రారంభమైంది. తదనుగుణంగా గత శని, ఆదివారాలలో వైసీపీ కార్పొరేటర్లను చేర్చుకుని పట్టు సాధించాలని దామచర్ల నిర్ణయించుకున్నారు.

ఫలించని బాలినేని ప్రయత్నం

ఈ నేపథ్యంలో మాజీమంత్రి, వైసీపీ నేత బాలినేని జోక్యం చేసుకుని నేనొస్తున్నాను ఉండండంటూ కార్పొరేటర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఆగమేఘాలపై సోమవారం ఉదయం ఒంగోలు చేరారు. కార్యకర్తలు ఘనంగానే స్వాగతం పలికారు. నలుగురు మినహా మిగిలిన కార్పొరేటర్లంతా ఆయన వద్దకు వచ్చి మేమంతా మీతోనే ఉంటామంటూ చెప్పేశారు. విశ్వాసం పెంచుకున్న బాలినేని ప్రభుత్వంపైనా ప్రధానంగా ఎమ్మెల్యే దామచర్లపైనా రెచ్చిపోయి విమర్శలు చేశారు. దామచర్ల కూడా ప్రతివిమర్శకు దిగటంతో రాజకీయం వేడెక్కింది. సోమవారం రాత్రి బాలినేని ఒంగోలులో మకాం వేసి కార్పొరేటర్లతో సంప్రదింపులు జరిపారు. కొందరు బహిరంగంగానే వైసీపీలో తాముండలేమంటూ తేల్చిచెప్పేశారు. మరికొందరిని ఆయన సర్దిపుచ్చారు. మొత్తంగా వెళ్లేవారు వెళ్లినా ఉన్న కార్పొరేటర్లకు అండగా నిలబడి వారిని కాపాడుకుంటానని హామీ ఇచ్చి రెండునెలలు మాత్రం ఒంగోలు రాలేనని చెప్పేసి వెళ్లిపోయారు. ఆయన అటు వెళ్లగానే కార్పొరేటర్లు అంతర్మథనంలో పడిపోయారు.

మేయరుతో సహా క్యూకట్టిన కార్పొరేటర్లు

వ్యక్తిగత అవసరాలకన్నా రాజకీయంగా వైసీపీ వ్యవహారశైలిని జీర్ణించుకోలేని కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకే నిర్ణయించుకున్నారు. జగన్ మారలేదు, మరోవైపు పార్టీలో కూడా తనకు అన్యాయం జరిగిందని బాలినేని బహిరంగంగా ప్రకటించారు. దీంతో వైసీపీకి భవిష్యత్తే లేదన్న ఆలోచనకు కార్పొరేటర్లు వచ్చినట్లు తెలిసింది. అంతే బుధవారం దామచర్ల ఇంటికి క్యూకట్టారు. మొదటి నుంచి బాలినేనితో కలిసి నడిచిన డిప్యూటీ మేయరు వేమూరి బుజ్జి మరో ఇద్దరు కార్పొరేటర్ల భర్తలు వెళ్లి ఆయన్ను కలిశారు. మరికొందరు కార్పొరేటర్లు దామచర్ల సన్నిహితులు, స్థానికంగా ఉండే టీడీపీ నేతల ద్వారా ఆయనకు కబురుపంపారు. దామచర్లను కలిసిన కార్పొరేటర్లు మరికొందరు కూడా రావటానికి సిద్ధంగా ఉన్నారని మీరు అంగీకరిస్తే తీసుకొస్తామని ఒక జాబితాను ఇచ్చేశారు. కార్పొరేషన్‌లో ఆరుగురు టీడీపీ కార్పొరేటర్లు ఉండగా ఒకరు జనసేనకు ఉన్నారు. వారికితోడు మరో ఆరుగురు ఇప్పటికే టీడీపీలో చేరారు. దీంతో కార్పొరేషన్‌లో 13కు టీడీపీ బలం చేరగా బుధవారం ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో ఆరుగురు ఎమ్మెల్యే జనార్దన్‌తో పార్టీ మారేందుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. దాంతో 19కి చేరింది. స్వతంత్ర్య అభ్యర్థిగా గెలుపొందిన ఏకైక కార్పొరేటరు కూడా టీడీపీలో చేరేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాడు. ఇదే సమయంలో మేయరు పదవిని ఆశిస్తూ మరో ముగ్గురు కార్పొరేటర్లతో టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఒక కార్పొరేటరు భర్త సమాచారం పంపారు. మేయర్ గంగాడ సుజాత కూడా ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఆయన నుంచి అవకాశం రాకపోవటంతో బుధవారం ఎంపీ మాగుంటను కలిసి తనతోపాటు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్న కార్పొరేటర్ల సమాచారాన్ని తెలిపినట్లు సమాచారం. అయితే మాగుంట ఈ విషయమంతా జనార్దన్ చూస్తున్నారు ఆయననే కలవమని సూచించి ఎమ్మెల్యేకు సమాచారమిచ్చారు. ఇలా మొత్తంగా పరిశీలిస్తే వైసీపీకి కార్పొరేటర్లలో పదిమంది కూడా మిగులుతారా లేదా? అన్న సందేహాలు ప్రారంభమయ్యాయి. కొన్ని డివిజన్లలో స్థానిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని కొందరిని దూరంగా ఉంచాలని టీడీపీ భావిస్తున్నందున వైసీపీకి కొంతమంది కార్పొరేటర్లు మిగిలే అవకాశం ఉంది. కాగా ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఎమ్మెల్యే విదేశీ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ఆగస్టు మొదటివారంలో కార్పొరేషన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

జగన్ గ్యాంగ్ పరార్

గ్రానైట్ గనుల నుంచి జగన్ పరివారం అవుట్

గత ఐదేళ్లుగా అన్నింటినీ దోచేశారు..

ప్రతి విభాగంలోనూ అధికారం చెలాయింపు

కోట్లు కొల్లగొట్టిన అవినాష్ కుటుంబం

సీఎం శ్వేతపత్రంతో తట్టాబుట్టా సర్దుకున్న వైనం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ కుంభకోణాలు భారీగా జరిగాయి. చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమలోనైతే అంతా ఆ పార్టీ నేతల ఇష్టారాజ్యమే. ముఖ్యమంత్రిగా అప్పటి సీఎం జగన్ కనుసన్నల్లోనే మైనింగ్ దోపిడీ జరిగిందని, ఆదాయంలో తాడేపల్లి ప్యాలెస్‌కు వాటా ఉందని ఆరోపణలు వచ్చాయి. గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో జరిగిన దోపిడీ వ్యవహారం పరిశీలిస్తే అది నిజమని తేటతెల్లమవుతుంది. చీమకుర్తి మండలంలోని గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో ఆంధ్రప్రదేశ్ గనుల అభివృద్ధి కార్పొరేషన్ పరిధిలో 86 ఎకరాల భూమి ఉంది. అందులో 25 ఎకరాల భూమి వివాదంలో ఉంది. సుమారు 61 ఎకరాల భూమి ఏపీఎండీసీ పరిధిలోనే ఉంది. అందులో సుమారు 43 ఎకరాలను కార్పొరేషన్ జాయింట్ వెంచర్‌లో లీజుకు ఇచ్చింది. అక్కడ నాణ్యమైన గెలాక్సీ గ్రానైట్ నిక్షేపాలు లభిస్తుండటంతో జాయింట్ వెంచర్‌లో లీజు కోసం అప్పట్లో పోటీ కూడా పడ్డారు. ప్రభుత్వంలో ఏ పార్టీ ఉన్నా చక్రం తిప్పగల మిడ్‌వెస్టు సంస్థ దానిని దక్కించుకుంది. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏర్పడగానే ఆ సంస్థ అధినేత రాఘవరెడ్డి తానే జగన్ అనే స్థాయిలో ఎగిరెగిరి పడ్డారు. కానీ మూడు నాలుగు మాసాలు తిరక్కుండానే ఆయనకు సీఎం కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. జాయింట్ వెంచర్‌లో సగం క్వారీల్లో వ్యాపారం తాము పంపే మనుషులు చేసుకుంటారు.. ఆదాయం అంతా వారికే దక్కుతుంది. కాదు కూడదంటే మొదటికే మోసం వస్తుంది జాగ్రత్త అంటూ హెచ్చరించారు. ఆ ఫోన్ వచ్చిన మరుసటి రోజే ప్రతాప్‌రెడ్డి అనే గ్రానైట్ వ్యాపారి అక్కడ ప్రత్యక్షమయ్యారు. స్థానికంగా ప్రైవేట్ స్థలంలో క్వారీలు నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి స్వయానా కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి మామ. అప్పటి నుంచి నిన్నమొన్నటి వరకు ఆ సగం సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలోని గ్రానైట్‌లో వచ్చే ఆదాయమంతా వీరే సొంతం చేసుకున్నారు. ఎలాంటి పెట్టుబడి లేకుండా నెలవారీ సరాసరి రూ.3కోట్ల ప్రకారం ఐదేళ్లల్లో రూ.100కోట్ల ఆదాయం పొందారు. ఆ ఆదాయం అంతా అవినాష్‌రెడ్డి కుటుంబానికి చేరిందా, అందులో జగన్ వాటా ఉందా ఉంటే ఎంత అనేది పక్కన పెడితే రమారమీ వంద కోట్లు ఆదాయం పొందిన బృందం ఇటీవల చడీచప్పుడు లేకుండా క్వారీ వదిలేసి కడపకు పారిపోయింది.

గ్రానైట్ దోపిడీ దొంగలు పరారయ్యారు. ఇటు అధికారం, అటు రౌడీయిజం వెరసి గత ఐదేళ్లుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో కడప జిల్లా నుంచి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి సైన్యం కోట్లు కొల్లగొట్టింది. అధికారం అండతో స్థానికంగా వందల మంది వ్యాపారులు వారిపై ఆధారపడ్డ వేలాదిమంది కార్మికులు పొట్టగొట్టారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావటం ఆపై గనుల్లో జరిగిన అక్రమాలను వెలికితీస్తామంటూ సీఎం చంద్రబాబు ప్రకటించటంతో తట్టాబుట్టా సర్దుకొని గ్యాంగ్ అంతా పరారయ్యారు. అలా కడప జిల్లా నుంచి చీమకుర్తి ప్రాంతానికి దిగుమతి అయిన వారంతా పాలోమని వెళ్లిపోయారు. అయితే ప్రభుత్వం అన్నీ అంశాలపై దర్యాప్తు చేసి దోపిడీ సొమ్ము రాబడుతుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

వేస్టును వదల్లేదు

అయితే కడప నుంచి వచ్చిన వైసీపీ నేతలు క్వారీల్లో వేస్టు రాయి మొత్తం తమకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాదు కూడదంటే కేసులు పెట్టించి క్వారీలను మూసివేయిస్తామని నిర్వాహకులను బెదిరించారు. అప్పటికే ప్రభుత్వం క్వారీ యజమానులకు నోటీసులు ఇచ్చి అందులో టీడీపీలో ముఖ్యులైన వారి క్వారీలను మూసివేసేందుకు శ్రీకారం పలికింది. ఇటు వచ్చిన వారు కడప జిల్లా వారు కావటం అటు ప్రభుత్వం కూడా దూకుడుగా వ్యవహరిస్తుండటంతో క్వారీల యజమానులు ఈ వేస్టు రాయిని స్థానికులకు కాకుండా కడపవాసులకు ఇవ్వటం ప్రారంభించారు ఏపీఎండీసీలో అటు అవినాష్‌రెడ్డి కుటుంబీకులు స్వాధీనం చేసుకున్న క్వారీల్లో కాని విఘ్నేష్ సంస్థ కింద ఉన్న క్వారీల్లో కాని వేస్టు రాయి దక్కాలంటే వారి కనీస అర్హత కడప జిల్లావాసి కావటంగా మారింది. జిల్లాస్థాయి నేతల నుంచి ఈ తిరుగుబాటు రావటంతో అప్పట్లో మంత్రిగా ఉన్న బాలినేని చెప్పిన వారికి ఆ రాయిని ఇచ్చారు. అలాంటి వారు క్వారీ యజమానులను బెదిరించి ఆ రాయిని ఉచితంగా పొందారు. ఆ రాయిని వారు రాజకీయంగా ఎంపిక చేసుకున్న లేక వారు అడిగిన డబ్బులు ఇచ్చే పాలిషింగ్ యూనిట్లకే సరఫరా చేశారు. దీంతో ముడిసరుకు అందక వందల పాలిషింగ్ యూనిట్లు మూతపడ్డాయి. ప్రభుత్వం మారినా రౌడీయిజంతో అంతోఇంతో చలాయించాలని చూసిన వీరు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గనుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేసి దోపిడీదారుల అంతు చూస్తానని ప్రకటించటంతో తట్టాబుట్టా సర్దుకొని కడప వెళ్లిపోయారు. ఇలా గెలాక్సీ గ్రానైట్ రంగంలో చొరబడి కోట్ల రూపాయలు దండుకున్న కడప జిల్లాకు చెందిన జగన్ పరివారం గత రెండు రోజుల్లోనే క్వారీలను పూర్తిగా వదిలి వెళ్లిపోవటం విశేషం. మరి కడప నుంచి వచ్చిన జగన్ గ్యాంగ్ నిర్వహించిన ఈ రకమైన దోపిడీని కూటమి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అనేది చూడాల్సి ఉంది.


చీమకుర్తిలోని గ్రానైట్ క్వారీ

చోటా నేతల రంగప్రవేశం

జగన్ ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలలలోపే కడప జిల్లాకు చెందిన వైసీపీ చోటా నాయకులు చీమకుర్తి ప్రాంతానికి భారీగా దిగుమతి అయ్యారు. కొందరు పుష్కలంగా గెలాక్సీ నిక్షేపాలు ఉండి వివాదాల్లో ఉన్న స్థలాలను కొట్టేసే ప్రయత్నాలు చేశారు. అదేసమయంలో వ్యక్తులు, సంస్థల మధ్య వివాదాలు ఉన్న అంశాలను జోక్యం చేసుకొని సెటిల్‌మెంట్ పేరుతో భారీగా సొమ్ము చేసుకున్నారు. ఇదేసమయంలో క్వారీల్లో వేస్టు రాయిని బలవంతంగా సొంతం చేసుకొని దండుకోవటంతోపాటు దానిపై ఆధారపడి నడుస్తున్న పరిశ్రమలు మూతపడేందుకు దోహదపడ్డారు. గ్రానైట్ క్వారీల్లో రాయిని ఎగుమతి చేసిన తర్వాత మిగిలిన వేస్టు రాయిని స్థానికంగా ఉండే పాలిషింగ్ పరిశ్రమలకు అమ్ముకున్నారు. కొందరైతే రాజకీయ సిఫార్సులకు అనుకూలంగా ఆ రాయిని స్థానికంగా ఉండే రాజకీయ నాయకుల అప్పగిస్తారు. వారు పాలిషింగ్ యూనిట్లకు సాధారణ ధరకు సరఫరా చేసి ఆదాయం పొందుతున్నారు. కొందరు రాజకీయ చోటా నాయకులు పాలిషింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి క్వారీలో వచ్చే వేస్టు రాయి పొందటం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. ఆ రకంగా వచ్చే క్వారీల్లోని వేస్టు రాయిని వివిధ సైజుల్లో పాలిషింగ్ చేసి దేశీయ మార్కెట్‌లో విక్రయించి ఆదాయం పొందుతారు. అలాంటి పరిశ్రమలు వేలసంఖ్యలో జిల్లాలో ఏర్పడ్డాయి. ఆ పరిశ్రమలో సుమారు 25 వేలమంది పనిచేస్తూ అదే ఉపాధిగా కుటుంబాలను పోషించుకుంటున్నారు.

వైసీపీ కబంధ హస్తాల నుంచి విముక్తి

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై మంత్రి గొట్టిపాటి

ఆగస్టు నాటికి ఇనాం భూములకు హక్కు పత్రాలు


అధికారులు, రైతులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జూలై 17 : వైసీపీ అమలు చేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను టీడీపీ కూటమి ప్రభుత్వం మంత్రి మండలి సమావేశంలో రద్దు చేయడంతో ప్రజలు, రైతులకు వైసీపీ నేతల కబంధ హస్తాల నుంచి విముక్తి లభించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద గెస్ట్‌హౌస్‌లో మండలంలోని గ్రామాల నేతలు, కార్యకర్తలు, రైతులు, అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ వైసీపీ అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ఇతర ప్రాంతాలలో ఉండే వ్యక్తుల భూములు ఎవరి పరమవుతాయో తెలియని పరిస్థితి అన్నారు. అదే సమయంలో 3నెలలు ఆన్‌లైన్‌లో తమ పేరుతో భూములు లేకపోతే వేరే వ్యక్తుల పరమయ్యే పరిస్థితి ఉందన్నారు. అదే సమయంలో అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం లేదని, నేరుగా హైకోర్టుకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులు, ప్రజలు అందరికీ ప్రయోజనం కలిగే విధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో అమలు చేసిన ప్రజా వ్యతిరేక చట్టాలను సమీక్షించి రద్దు చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా చట్టాలు చేయడం జరుగుతుందన్నారు. సంతమాగులూరు మండలం గోపాపురం పరిధిలోని సుమారు వెయ్యి ఎకరాల ఇనాం భూములకు సంబంధించి ఆగస్టు నాటికి సాగు దారులకు పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే సమయంలో కొమ్మాలపాడు, చెన్నుపల్లి తదితర గ్రామాలలో ఉన్న ఇనాం భూముల విషయం కూడా వెంటనే సాగుదారులకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ లను వెంటనే మంజూరు చేయటం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన విధంగా అదనంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ లలో అదనపు లోడ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏల్చూరు వద్ద 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. త్వరలోనే సాగర్ నీరు విడుదల అవుతున్నందున తాగునీటి చెరువులను నింపుకోవాలన్నారు. వెల్లలచెరువు వద్ద రైల్వే అండర్ పాస్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను సరిచేసేలా రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండలంలో 2019కి ముందు పనులు చేసి బిల్లులు చెల్లించని అందరికి ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లించాలని అధికారులను రవికుమార్ ఆదేశించారు.

ఆ కుటుంబం ఆవేదన తీరేదెప్పుడో..?

నిజనిర్ధారణలో జాప్యం ఎందుకు

వాస్తవాలు ఉంటే న్యాయం చేయండి

లేదంటే నన్ను శిక్షించండి అంటున్న బాధితుడు


అన్యాయాన్ని వివరిస్తున్న బాధితుడు బాలఅంకమ్మరావు

చీరాల, జూలై 17 : వల్లెపు బాలంకమ్మరావు. అతనో లారీ యజమాని. మరికొన్ని లారీలను కొంతకాలం బాడుగకు తిప్పారు. ప్రస్తుతం అతను రోజువారీ జీవనానికి కుటుంబం అంతా కష్టపడాల్సిన పరిస్థితి. ఒక్క లారీ కూడా లేదు. అందుకు చీరాల లారీ ఓనర్స్ అసోసియేషన్ నేపథ్యంలో తనకు జరిగిన అన్యాయమే కారణమని అతను కొన్ని సంవత్సరాలుగా ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో కార్యాలయ నిర్మాణం జరిగిన ప్రదేశం అసైన్డ్ భూమి, అందులో ఎలా నిర్మాణం చేశారనేది మొదటి ప్రశ్న. బిల్డింగు ప్లాన్ అప్రూవల్ లేదు. పన్ను చెల్లించడం లేదు. కొన్ని సంవత్సరాలుగా అసోసియేషన్ ఆడిట్ జరగలేదనేది మిగిలిన ఆరోపణలు. ఈక్రమంలో అతను తన భార్యా పిల్లలతో తనకు న్యాయం చేయండని కొన్ని సంవత్సరాలుగా పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే సమస్య పరిష్కారం కాలేదు.తన వ్యక్తిగత సమస్యకు న్యాయం జరుగుతుందా, లేదా అనేది పక్కన పెడితే నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో ఆ నిర్మాణం ఎలా చేపట్టారు. సదరు బిల్డింగ్ నిర్మాణానికి మున్సిపాలిటీ ప్లాన్ అప్రూవల్ ఉందా...?, ఆ తరువాత ప్రతి సంవత్సరం పన్ను చెల్లిస్తున్నారా..? ఇవి సంబంధిత మున్సిపల్, రెవెన్యూ అధికారులు పరిశీలించాల్సిన అంశాలు. వాటిపై బాలంకమ్మరావు అనే వ్యక్తి తరచూ ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఒక దశలో లారీ ఓనర్స్ అసోసియేషన్ (ప్రస్తుతం ఉన్నవారు) వారికి మద్దతుగా కొందరు, బాలంకమ్మరావుకు మద్దతుగా కొందరు పట్టణంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. ఆ సమయంలో ఇదేంటీ బలప్రదర్శన, అధికారులు వాస్తవాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటే సరిపోతుంది కదా అని పురప్రజలు బహిరంగంగానే చర్చించుకున్నారు. ఆ సమస్య నేటికీ పరిష్కారం కాలేదు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

సదరు బిల్డింగ్ నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణం చేయడం సరికాదు. తరువాత ఇన్ని సంవత్సరాలు పన్ను చెల్లించకుండా ఉంటే అధికారులు ఏం చేస్తున్నారనేది అందరిని ఆలోచింపచేస్తున్న అంశం. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంటే ఎందుకు చర్యలు చేపట్టరని ప్రజల వాదన. సాధారణ వ్యక్తులు ఎవరన్నా ఒక సంవత్సరం పన్ను చెల్లించకుంటే నోటీసులు మీద నోటీసులు ఇస్తూ హడావుడి చేసే అధికారులు ఏం చేస్తున్నట్లని ప్రశ్నిస్తున్నారు.

తాజాగా భార్యాబిడ్డలతో ఆందోళన

తాజాగా బాధితుడు బాలంకమ్మరావు బుధవారం చీరాల, కారంచేడు రోడ్డులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎదురుగా ఉన్న హైలెవల్ బ్రిడ్జిపైన భార్యాబిడ్డతో తనకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. తన వాదనలో నిజం ఉంటే చర్యలు చేపట్టాలని, తన ఫిర్యాదులలో నిజం లేకుంటే తనపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఇప్పటి వరకు తాను ఏఏ అధికారులను, పాలకులను కలిసింది వివరించారు. తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఎక్కడ విచారణకు రమ్మన్నా తాను వస్తానని, పేర్కొన్నారు. ఈ విషయమై లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి మురళిని వివరణ అడిగేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. అంతిమంగా అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

పీర్ల ఊరేగింపులో ఇరువర్గాలకు వివాదం

ఉద్రిక్త వాతావరణం నడుమ ఉత్సవం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో సామరస్యంగా సాగిన కార్యక్రమం

కనిగిరి, జూలై 17 : మొహర్రం పండుగ సందర్భంగా కనిగిరిలో జరిగిన పీర్ల ఊరేగింపులో ఇరు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం పెద్దదై ఒంగోలు నుంచి ప్రత్యేక బలగాలు మోహరించాల్సిన ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. వివరాల్లోకి వెళితే... ఏటా మొహర్రం పండుగ సందర్భంగా కనిగిరిలోని ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న దర్గాలు, మసీదుల నుంచి పీర్ల ఊరేగింపుగా బొడ్డుచావిడి, రామాలయం వీధి నుంచి పామూరు బస్టాండు వద్దకు చేరుకుంటాయి. బొడ్డుచావిడి వచ్చే ముందుగానే పీర్ల ఊరేగింపులో ఎలాంటి డప్పు, వాయిద్యాలను ఉపయోగించరాదన్నది ఆచారం. పీర్ల ఊరేగింపు నిర్వహించే వర్గం వారు బొడ్డుచావిడి గోపురం వద్ద డప్పు, వాయిద్యాలతో పెద్దఎత్తున చేపట్టారు. దీనికి ఆయా వీధుల్లో ఉండే వారు అభ్యంతరం చెప్పటంతో వివాదం ఏర్పడింది. ఊరేగింపులో గతానికి భిన్నంగా డప్పులను కొట్టడం ఎంత వరకు సబబని పోలీసులను వారు నిలదీశారు. ఏకాదశి పండుగ అయినా కూడా తమ దేవాలయాలను మూసివేసి వారికి సహకరిస్తుంటే ఆ వర్గం వారు ఆ విధంగా ప్రవర్తించటం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సీఐ వెంకటేశ్వరరావు పీర్ల ఊరేగింపు నిర్వహించే వారితో మాట్లాడి డప్పులు లేకుండా పీర్లను బొడ్డుచావిడి నుంచి రామాలయం మీదుగా పంపించే విధంగా సర్దిచెప్పారు. ఆ ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పీర్ల ఊరేగింపులోని కొంతమంది అల్లరి మూకలు చేసే సంజ్ఞలతో రెండోవర్గం వారు కోపోద్రిక్తులై జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. దీంతో తిరిగి వివాదం ముదిరి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని డీఎస్పీ రామరాజుకు సీఐ సమాచారం అందించటంతో ఒంగోలు నుంచి ప్రత్యేక బలగాలు వచ్చాయి. అయినా ఇరువర్గాలు ఏ మాత్రం వెనక్కి తగ్గకపోవటంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. బొడ్డుచావిడి వద్ద చుట్టూ పెద్ద మోకులతో బారికేడ్లు కట్టారు.

ఎమ్మెల్యే ఉగ్ర రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సంఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. పోలీసులతో సమావేశమై ఇక్కడ ఇరు వర్గాల మనోభావాలు ముఖ్యమేనని, ఇరు వర్గాలకు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా పీర్లను ఊరేగించాలని పోలీసులకు సూచించారు. పోలీసులు మలిసారి ప్రయత్నించినా ఇరు వర్గాల వారు సహకరించలేదు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర స్వయంగా వెళ్లి బొడ్డుచావిడి వద్ద ఉండే వర్గం వారితో, పీర్ల ఊరేగింపు నిర్వహించే వర్గం వారితో చర్చించారు. డప్పు, వాయిద్యాలు లేకుండా పీర్ల ఊరేగింపు చేసుకునేలా ఇరు వర్గాల వారితో మాట్లాడి సర్దిచెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగి డప్పు, వాయిద్యాలు లేకుండా పీర్లను ఊరేగించారు. పామూరు బస్టాండు వద్దకు చేరుకున్న పీర్లు సలాంలు చేసుకున్నాయి. అంగరంగా వైభవంగా పీర్లు ఊరేగింపు ఉత్సవం ముగిసింది.

సైకిల్ ఎక్కేందుకు సిద్ధం..!

మాగుంట ఇంటికి మేయర్, దామచర్లను కలిసిన డిప్యూటీ మేయర్

త్వరలో వైసీపీ నుంచి టీడీపీలో చేరేందుకు చర్చలు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 17: ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన పలువురు వైసీపీ కార్పొరేటర్లు సైకిలెక్కేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతోపాటు, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు వచ్చినపుడు వచ్చామా, పోయామా అన్నట్లు వ్యవహరించారు. కొందరు ముఖం చాటేసిన విషయం విదితమే. ఇదిలా ఉంచితే బుధవారం ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌ను పలువురు కలిశారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జితోపాటు, 43వ డివిజన్ కార్పొరేటర్ భర్త కండే రమణయాదవ్, 2వ డివిజన్ కార్పొరేటర్ భర్త గాంధీలు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. మంగళవారం రాత్రి 30వ డివిజన్‌కు చెందిన వైసీపీ కార్పొరేటర్ భర్త నాని దామచర్లను కలిశారు. కాగా బుధవారం నగర మేయర్ గంగాడ సుజాత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇంటికెళ్లి కలవడం చర్చనీయాంశమైంది. అలాగే నేడు, రేపు మరో పదిమందికిపైగా వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలోనే గురువారం జరగాల్సిన కార్పొరేషన్ పాలకవర్గ సమావేశం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఇప్పటివరకు 43మంది సభ్యులుగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లు ఆరుగురు తెలుగుదేశం పార్టీలో చేరగా, మరో పదిహేను మంది సైకిలెక్కేందుకు సిద్ధంగా ఉండటం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలో జరిగే కార్పొరేషన్ పాలకవర్గ సమావేశం టీడీపీ సభ్యుల మెజారిటీతో జరిగేలా చేరికలపర్వం నడుస్తున్నట్లు తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

బిల్డింగ్ ప్లాన్స్ & ఎలివేషన్స్

n ప్రకాశం జిల్లాలో ఇల్లు కట్టుకొనుటకు ప్లాన్స్ గీసి అప్రూవల్ చేయించబడును. ఎలివేషన్స్ చేయబడును. బాషా ఆర్కిటెక్స్, SMBC-1252, ఒంగోలు. సెల్: 7702244786, 9491224027

AJO-183946

గోడౌన్ అద్దెకు ఇవ్వబడును

n వెల్లంపల్లి, మద్దిపాడు(మం), NH-16 ప్రక్కన 50X60 కొలతలు గల షెడ్, 50HB కరెంట్, బోరింగ్ వసతులు గల గోడౌన్ అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9505503178, 7780246363.

AJO-190188

వెంటనే కావలెను

n బాషా ఆర్కిటెక్స్, SMBC, ఒంగోలు నందు పనిచేయుటకు B.Tech Civil చదివి బిల్డింగ్ ప్లాన్స్ & ఎలివేషన్స్ (3D Max) గీయుటకు Female కావలెను. సెల్: 7702244786

AJO-183945

PLOT FOR SALE

n మారం వెంకారెడ్డి రియల్ ఎస్టేట్స్, ఒంగోలు NH-5 నుండి మంగమూరు రోడ్డు పవర్ ఆఫీస్ దాటాక తక్షణం ఇల్లు నిర్మించుటకు, ఇన్వెస్ట్మెంట్‌కి అనుకూలంగా ఒక్క గది కేవలం 36 వేలకే ప్లాట్స్ కలవు. సంప్ర॥9885184207 స్పాట్ రి॥

AJG-9497

ట్రైనింగ్ సెంటర్

n రాధిక M.P.H.W ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సుందరయ్య భవన్ రోడ్, శ్రీనివాస హాస్పిటల్ ఎదురు, ఒంగోలు, కోర్సులు : M.P.H.W(F), ANM / DMLT Q: ఇంటర్ ఏ గ్రూప్ వారైన, ప్రభుత్వ స్కాలర్‌షిప్ కలదు. సంప్ర॥ 08592 282349, 8978869519, 7674998230

AJO-190174

మీ సర్టిఫికేట్స్ పోయినవా ?

n మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికెట్స్ తెప్పించబడును. సర్టిఫికెట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616.

AJG-191543

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ద్వారా బహిరంగ ప్రకటనలు, లీగల్ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి అన్నిరకాల ప్రకటనలు తెలియజేయుడి.

జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు | విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు | ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అధనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి పత్రిక కొరకు సంప్ర॥ 9985411484

ఎన్నెస్పీ నీటి విడుదలపై హర్షం

ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూలై 17: గ్రామాలలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు సాగర్ జలాలు విడుదల చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న చొరవ హర్షనీయమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎన్నెస్పీ కుడికాలువ ద్వారా బుధవారం నీటిని విడుదల చేయడం కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవకు నిదర్శనం అన్నారు. ప్రజల అవసరాలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తుల పట్ల ప్రభుత్వ స్పందన ఎనలేనిదన్నారు. సాగర్ నీటి ద్వారా చెరువులను నింపేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏలూరి సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపాలన్నారు. ప్రణాళికాబద్ధంగా మేజర్లకు నీటిని పంపిణీ చేసేలా పర్యవేక్షించాలన్నారు. నీటి ఎద్దడి నివారణలో గత వైసీపీ పాలకులు ఘోరంగా విఫలమయ్యారని పేర్కొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పర్చూరు, జూలై 17 : హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని జనసేన నాయకులు ఆలా అనిల్ కుమార్ అన్నారు. పర్చూరులో గ్రామస్థులు, దాతల సహకారంతో రూపుదిద్దుకుంటున్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అక్కడ మొక్కలు నాటారు. స్పెషల్ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు మాట్లాడుతూ గ్రామస్థులు కలసి కట్టుగా గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, కోటేశ్వరరావు, నరసింహం, కోటా హరిప్రసాద్, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, ప్రసాద్, తులసి భువనేశ్వరరావు, తులసి భాస్కర్, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, పేర్ని హరి పాల్గొన్నారు.

సాగర్ కాలువైతే మాకేంటి..!





జీఎన్‌టీ రోడ్డు బొల్లాపల్లి వద్ద సాగర్ కాలువ కట్టపై పోసిన గ్రానైట్ వ్యర్థాలు .. సాగర్ కాలువ అంచుపై పోసిన వేస్ట్

» యథేచ్ఛగా గ్రానైట్ వ్యర్థాల పారబోత
» పట్టించుకోని ఎన్నెస్పీ అధికారులు
» ఆందోళనలో రైతులు

మార్టూరు, జూలై 17 : కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు తమ గ్రానైట్ పరిశ్రమలోని గ్రానైట్ వ్యర్థాలను పొలాలు, డొంకల్లో రోడ్డు ప్రక్కన ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. వ్యర్థాలను డంప్ చేసేందుకు అనువైన ప్రదేశం లేక ఇష్టానుసారంగా వారు పారేస్తున్నారు. వారిలో కొంతమంది ఏకంగా సాగర్ కాలువ కట్ట రోడ్డును, సాగర్ కాలువ అంచుల్లో వేస్తున్నారు. రాత్రి సమయాలలో ట్రాక్టర్లపై గ్రానైట్ వ్యర్థాలను తెచ్చి పడేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన మార్టూరు మండల పరిధిలో కోనంకి ఎన్ఎస్‌పీ జీఎన్‌టీ బొల్లాపల్లి రోడ్డు వద్ద సాగర్ కాలువ ప్రక్కన వ్యర్థాలను డంప్ చేశారు. బొల్లాపల్లి బ్రిడ్జికి తూర్పువైపున కాలువకు ఎడమవైపు, కాలువ అంచున పెద్దఎత్తున వ్యర్థాలను పారబోశారు. దీంతో కాలువ కట్ట నుంచి దిగువకు వెళ్లే సిబ్బంది, కాలువ పక్కనే ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థాల కారణంగా మట్టిరోడ్డు ఇరుకుగా తయారవుతుందని, కట్టపై రైతుల ట్రాక్టర్లు, బైకులు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున వ్యర్థాలను డంప్ చేస్తే కాలువలో నీరు వచ్చినపుడు మానిటరింగ్ చేసే ఎన్ఎస్‌పీ సిబ్బందికి, కట్టపై వెళ్లేవారికి ఇబ్బందులు తప్పవని అంటున్నారు.

పట్టించుకోని అధికారులు

కోనంకి గ్రామంలో ఎన్నెస్పీ కార్యాలయం ఉంది. ప్రస్తుతం జీఎన్‌టీ బొల్లాపల్లి వద్ద సాగర్ కాలువ పక్కనే గ్రానైట్ వ్యర్థాలను డంపింగ్ చేశారు. వీటి మధ్య 3 కి.మీ. దూరం అంటే కూతవేటే కానీ గుర్తుతెలియని వ్యక్తులు దర్జాగా గ్రానైట్ వ్యర్థాలను సాగర్ కాలువ కట్టపై పారబోశారు. ఈ విషయమై ఎన్నెస్పీ సిబ్బంది అడ్డుకోలేదు. కనీసం అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ప్రజలకు తాగునీరు అందించే, పొలాలకు నీరు అందించే సాగర్ కాలువ ప్రక్కన ఇలా గ్రానైట్ వ్యర్థాలను వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

మంత్రి గొట్టిపాటి

సంమాగులూరు, జూలై 17 : రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని పట్టావారిపాలెం అడ్డరోడ్డులోని అతిథి గృహంలో బుధవారం పలు గ్రామాల రైతులతో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతమాగులూరు మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి కార్యక్రమానికి అధికారులు డుమ్మా

మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతున్నట్లు మంగళవారం తహసీల్దార్, ఎంపీడీవోలకు మంత్రి కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చినా ఈ సమీక్షకు తహసీల్దార్, ఎంపీడీవో డుమ్మా కొట్టారు. దీంతో మంత్రి గొట్టిపాటి అసహనానికి గురయ్యారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

మహాలక్ష్మి ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్‌ను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 17: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం దాతల సహకారంతో పట్టణంలోని అమ్మవారి దేవాలయానికి మైక్‌సెట్, కుర్చీలను అందజేశారు. ఈ క్రమంలో చుండూరి రామారావు, వెంకట సుశీల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు చుండూరి మురళి సుధాకరరావు సౌజన్యంతో అద్దంకిలోని కొత్తపేటలోని శ్రీ మహాలక్ష్మి తల్లి అమ్మవారి ఆలయానికి మైక్‌సెట్, నాలుగు కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్‌రఫీ, రామకోటేశ్వరరావు, నర్రా శ్రీలక్ష్మి, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఆంజనేయులు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, రమేష్ పాల్గొన్నారు.



రైతు ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

నీటి సంఘాల నియామకాలపై కసరత్తు

రైతు ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 17 : నియోజవకర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లోని గ్రామాల రైతు ప్రతినిధుల ఉంచి నీటి సంఘాల కమిటీల నియామకాలపై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా బుధవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆయా గ్రామాల రైతు ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొన్ని చోట్ల నీటి సంఘాలకు సంబంధించి తమనే నియమించాలని కొందరు పట్టుబట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య వేర్వేరుగా అభిప్రాయాలు సేకరించారు. అంతిమంగా వివాదాలు, స్పర్ధలకు తావులేకుండా నీటి సంఘాల నియామకాలు చేసుకుందామని, అవి భవిష్యత్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు అదనపు బలంగా ఉండాలనే కోణంలో నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలిసింది. కార్యక్రమంలో పలు గ్రామాల రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేనలో సభ్యులుగా చేరండి

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పర్చూరు, జూలై 17 : జనసేన పార్టీలో సభ్యులుగా చేరి పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ కోరారు. బుధవారం రోటరీ భవనంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనసేన పార్టీ ఆవిర్భవించిందన్నారు. పార్టీలో సభ్యునిగా చేరిన ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల ప్రమాద జీవిత బీమాను అధినేత పవన్ కల్యాణ్ కల్పించడం జరిగిందన్నారు. కార్యకర్తలు, ప్రజలకు అండగా జనసేన పార్టీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరశెట్టి చిరంజీవి, విజయ్‌కుమార్, గనిపిశెట్టి అయ్యప్ప, నారిశెట్టి ప్రవీణ్, సందు శ్రీనివాసరావు, మందపాటి కిషోర్, శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కారంపూడి సందీప్‌తేజ, తులసి చంటి, కందా సురేంద్రబాబు, తోట మణి, సతీష్, బాలు, శీలం కుమార్, బోగాది మోహన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

» భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు » ప్రత్యేక పూజలు




దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారు.. చందులూరులో రామలింగేశ్వరస్వామికి పూజలు

అద్దంకి, జులై 17 : తొలి ఏకాదశిని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అద్దంకి పట్టణంలోని దత్త పాదుకాక్షేత్రం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, మాధవస్వామి దేవాలయం, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, లక్ష్మీనరశింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తపాదుకాక్షేత్రంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పంగులూరు, జూలై 17 : తొలి ఏకాదశి పూజలు బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. పర్వదినం సందర్భంగా ఆలయాలలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందలూరు, ముప్పవరం, పంగులూరు పరిసర గ్రామాలలోని రామలింగేశ్వరస్వామి, భీమలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బల్లికురవ : తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొణిదెన చెన్నకేశవస్వామి వారి దేవాలయంలో ముక్తేశ్వరం గ్రామంలోని ముక్తిలింగేశ్వరస్వామి దేవాలయంలో పండగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలలో పాల్గొన్నారు. కొందరు ప్రజలు కోటప్పకొండ పుణ్యక్షేత్రానికి తరలి వెళ్లారు.

రామకూరు కొండపై ఆధ్యాత్మిక శోభ

రామకూరు గ్రామ కొండపై కొలువుదీరిన శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలి రావడంతో కొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రామకూరు పరిసర ప్రాంత ప్రజలు కొండపై కొలువుదీరిన రామలింగేశ్వరునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు గిరి ప్రదక్షణ, మెట్లపూజ అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకములు, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు పొంగలి, పులిహోర, లడ్డు ప్రసాదాలతో పాటు మజ్జిగ అందచేశారు. బొప్పుడి వీరాంజనేయులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చీరాలటౌన్ : తొలి ఏకాదశిని సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరాల ముత్యాలమ్మ చెట్టు వద్ద భక్తులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. కూరగాయలతో ప్రత్యేక దండను వేసి, మొక్కులు తీర్చుకున్నారు.

రైల్వే అండర్‌పాస్‌తో వెల్లలచెరువు ప్రజలకు ఇబ్బందులు

- దాని నిర్మాణంతో మురుగు నీటి ప్రవాహనికి ఆటంకం
- మంత్రి గొట్టిపాటి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన గ్రామస్థులు



వెల్లలచెరువు వద్ద రైల్వే అండర్‌పాస్‌లో నిలిచిన మురుగు

వెల్లలచెరువు(అద్దంకి), జూలై 17 : అద్దంకి నియోజకవర్గంలో ఉన్న ఏకైక రైల్వే స్టేషన్ సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువులో ఉంది. రైల్వే అండర్‌పాస్‌తో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అండర్ పాస్ లేని సమయంలో రైల్వే గేట్‌తో గ్రామస్థులు అవస్థలు పడ్డారు. గత ఏడాది అండర్‌పాస్ నిర్మాణంతో ఆ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. ఇప్పుడు మరో సమస్య వచ్చింది. కొండ నాలుకకు మందు వేస్తే అసలు నాలుకకే మోసం వచ్చినట్లు మారింది. అండర్ పాస్ నిర్మాణంతో గ్రామం నుంచి వాగుకు చేరే మురుగు మొత్తం అండర్‌పాస్‌కు చేరుతుంది. అండర్‌పాస్ ఎక్కువ లోతులో ఉండడం, వాగు ఎత్తులో ఉండడంతో మురుగు నీరు అండర్‌పాస్‌లో నిలిచి పోతుంది. వేసవిలో సైతం అండర్‌పాస్‌లో మురుగు నీరు నిలిచే ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో సమస్య మరింత తీవ్రమైంది. మురుగు నీటి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఈ సమస్యను పరిష్కరించాలని బుధవారం మంత్రి రవికుమార్‌కు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

తీరంలో జాగ్రత్తగా స్నానాలు ఆచరించాలి



పర్యాటకులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

వాడరేవు(చీరాలటౌన్), జూలై 17 : సముద్ర తీరానికి స్నానాలు ఆచరించేందుకు వచ్చిన పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ అన్నారు. మొహర్రం సందర్భంగా బుధవారం సముద్రతీరానికి పర్యాటకులు పోటెత్తారు. ఈసందర్భంగా ఎస్సై వాడరేవు, రామాపురం సముద్రతీరంలో పర్యటించారు. పర్యాటకులకు జాగ్రత్తలు సూచించారు. గజ ఈతగాళ్లతో సుదీర్ఘంగా మాట్లాడారు. పర్యాటకులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి వైరు చోరీ

బల్లికురవ. జూలై 17 : కొత్తూరు గ్రామంలో నాలుగు రోజుల నుంచి పెద్ద ఎత్తున పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైరు, సోలార్ ప్లేట్లను దొంగలు చోరీ చేస్తు న్నారు. దీంతో రైతులు బెంబేలెత్తు తున్నారు. గ్రామానికి చెందిన పాపసాని చలమయ్య, చక్కెర శ్రీనివాసరెడ్డి, మానావత్ హరినాయక్, మెలికా ఆదినారాయణకు చెందిన వ్యవసాయ మోటార్ల రాగి వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు, సోలార్ ప్యానల్ బాక్సులను దొంగిలించారు. వ్యవసాయ పంట సీజన్‌లో చోరీలు జరగడం చూసిన రైతులు లబోదిబో మంటున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు. మరికొందరి వైర్లు చోరీలు జరిగాయని వారు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

చీరాలటౌన్, జూలై 17 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గుంటూరులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా కర్లపాలెం మండల పరిధిలోని పేర్లి గ్రామానికి చెందిన దబ్బకూటి నాగయ్య(40) చీరాల మండలం ఈపూరుపాలెంలోని ఓ శనగకాయల మిల్లులో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య దేవి, కుమారుడు సంతానం. ఇదిలా ఉండగా ఎప్పటిలాగే పనికి వచ్చి సాయంత్రం సమయంలో సహచరుడు మురళీకృష్ణ బండిపై టిఫిన్ చేసేందుకు ఈపూరుపాలెం సెంటర్‌కు వెళ్లి తిరిగి మిల్లు దగ్గరకు వెళ్లేందుకు బయలు దేరారు. ఈనేపథ్యంలో బాయ్స్ హైస్కూల్ సమీపానికి రాగానే గుంతలలో వాహనం అదుపు తప్పింది. దీంతో వెనుక కూర్చున్న నాగయ్య ఒక్కసారిగా కింద పడి గాయపడ్డారు. గుంటూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు ఈపూరుపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

దుకాణంలో చోరీపై కేసు

చీరాలటౌన్, జూలై 17 : చీరాల పట్టణం బెస్తపాలెంలో జరిగిన చోరీపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిసిని నాని బెస్తపాలెంలో కూల్‌డ్రింక్ షాపు నడుపుకుంటున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తిగత ఆదివారం అటుగా వెళుతూ దుకాణంలోని రూ.40వేలు అపహరించి పరారయ్యాడు. దీంతో యజమాని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇప్పటికే సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు సమాచారం.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

విజయనగర్‌కాలనీ(చీరాలటౌన్), జూలై 17 : కారంచేడు అమరవీరుల త్యాగాలు మరువలేనివని వక్తలు అన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీలోని రుధిర క్షేత్రం వద్ద అమరవీరుల 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ప్రతినిధులు ముందుగా అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. విజయాలు సాధించాలంటే త్యాగాలు తప్పవని వక్తలు అన్నారు. గద్దర్ గీతాలను ఆలపించి ఉత్సాహపరిచారు. సంబంధిత కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, సుందరరావు, బాబూరావు, కృపాకర్, బాబూరావు, మాణిక్యరావు, భగత్‌సింగ్, లక్ష్మీనరసయ్య, రవి, చిట్టిబాబు, గంగయ్య పాల్గొన్నారు.

దర్గా కొండపై మృతదేహం

కంభం, జూలై 17 : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని మస్తాన్‌స్వామి దర్గా కొండపై బుధవారం కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం కలకలం సృష్టించింది. మృతుడు బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన సురేష్ (30)గా గుర్తించారు. సురేష్ కంభం రైల్వేస్టేషన్‌లో గ్యాంగ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నెల రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వచ్చిన సురేష్ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ కోసం గాలిస్తుండగా బుధవారం దర్గా కొండపై కుళ్లిన స్థితిలో ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సురేష్‌కు నెల కిందట వివాహం అయింది.

ఘనంగా మొహర్రం

హాజరైన మంత్రి రవికుమార్



చినగంజాంలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

అద్దంకి, జూలై 17 : మొహర్రం పండుగను ముస్లింలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీరులను గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. పీరుల వద్ద పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో మొహర్రం వేడుకలకు బుధవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై పీరుల వద్ద పూజలు నిర్వహించారు. మంత్రి రవికుమార్‌ను ముస్లిం పెద్దలు సత్కరించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను గొట్టిపాటి దృష్టికి తీసుకువచ్చారు. పునరావాస కాలనీలో అన్ని వసతులు కల్పించాలని, ఇంకా ఇళ్ల స్థలాలు మంజూరు కాని కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని కోరారు. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కరిముల్లా, బడావలి, మీరావలి, అంజయ్య, బ్రహ్మానందం, జ్యోతి రామారావు పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని ముస్లింలు మొహర్రంను ఘనంగా నిర్వహించుకున్నారు. మత సామరస్యానికి ప్రతీగా పీర్ల పండుగను జరిపారు. చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్లను పలు రకాల పూలతో విశేషంగా అలంకరించి గ్రామాల్లోని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని పుర వీధులలో కనకతప్పెట్లు, మేళతాళాలతో యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు కార్యాక్రమాన్ని జరిపారు. పీర్ల చావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేసి నిప్పులో నడిచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అల్లాకు దూప, నైవేద్యాన్ని సమర్పించి బెల్లం పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. మసీదులను, పీర్ల చావిడిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మార్టూరు : మండలంలో ముస్లిం మైనారిటీలు బుధవారం మొహర్రంను భక్తితో నిర్వహించారు. మంగళవారం రాత్రి మతపెద్దలు పీర్లచావిడి నుంచి పంజెలును బయటకు తీసి వాటిని యువకులు చేతబూని జండాలుగా ఊరేగింపుచేశారు. తొలుత ముస్లిం వీధుల నుంచి తర్వాత కోరీగుంతలు, గన్నవరం రోడ్డు తదితర వీధులలో ఊరేగింపు చేశారు. దీనివల్ల గ్రామంలోకి దుష్టశక్తులు ప్రవేశించవని, ప్రజలు ఆరోగ్యంతో ఉంటారని మత పెద్దలు తెలిపారు. అనంతరం పంజెలను వాగు వద్దకు తీసుకువెళ్లి వాటిని పాతిహే చేశారు. అనంతరం వాటిని పీర్లచావిడికి చేర్చారు. సాయంత్రం కొంతమంది పీర్లచావిడి వద్దకు వెళ్లి మొక్కులను తీర్చుకున్నారు.

వృద్ధులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

పర్చూరు, జూలై 17 : మొహర్రం సందర్భంగా పర్చూరులోని అత్తహార్ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీద్ ప్రెసిడెంట్ అహ్మద్ బాషా మాట్లాడుతూ వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇమాం అఫ్జల్ హక్, మౌజన్ బాజీ, షేక్ ఫజల్, బాషా, మాబులా, ఫకృద్దీన్ ఆలీ, అహ్మద్, బాబు పాల్గొన్నారు.





విద్యుద్దీపవెలుగుల్లో బారాషహీద్ దర్గా ప్రాంగణం

'స్వర్ణాల' తీరాన

ఆధ్యాత్మిక పరవళ్లు

- అట్టహాసంగా రొట్టెల పండుగ ప్రారంభం
- తొలిరోజే తరలివచ్చిన భక్తజనం
- స్వర్ణాల చెరువులో రొట్టెల కోసం పోటీ
- దర్గా వద్ద చాంతాడంత క్యూలైన్లు
- నేటి అర్ధరాత్రి గంధమహోత్సవం



స్వర్ణాలతీరం భక్తజనంతో పరవళ్లు తొక్కింది. కోరికల రొట్టెను పట్టుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. యాత్రికులను తీసుకొచ్చిన వాహనాల రద్దీతో నెల్లూరు నగరం పులకించి పోయింది. రాష్ట్ర పండుగ అయిన రొట్టెల పండుగను ముస్లిం మత పెద్దలు సంప్రదాయ బద్ధంగా బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. తొలిరోజే లక్ష మందికిపైగా భక్తులు వచ్చి ఉంటారని అంచనా.

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 17 : కోరికల రొట్టెలను పట్టుకునేందుకు, తీరిన కోర్కెల రొట్టెల ఇచ్చేందుకు దూశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. 5రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో బుధవారం తొలిరోజే అంచనాలకు మించి భక్తులు తరలివచ్చారు. బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్‌లు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఆకట్టుకుంటున్నాయి. క్యూలైన్లు నిండిపోవడంతో దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. ఈ ఏడాది పండుగకు యువతీ యువకులు, నూతన జంటలు, చిన్నారులు పెద్ద ఎత్తున తరలిరావడం విశేషం. కల్యాణం, ఉద్యోగం, గృహం, ధన, ఆరోగ్యం, ఇతర రొట్టెలను ఇచ్చి పుచ్చుకుని ఆనందంగా తరలివెళుతున్నారు. మంచినీరు, వైద్యసేవలు, అన్నదానం, ఇతర సేవలు అందిస్తుండటంతో సింహపురీయుల ఆతిథ్యాన్ని చూసి యాత్రికులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సందల్‌మాల్

పండుగలో తొలిఘట్టమైన సందల్‌మాలీ బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగింది. మత పెద్దల ఆధ్వర్యంలో బారాషహీద్‌ల సమాధులను శుభ్రం చేసి గంధం ఎక్కించి కొత్త గలీఫ్‌లు కప్పి అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం అర్ధరాత్రి జరిగే బారాషహీద్ గంధ మహోత్సవానికి కడప పీఠాధిపతి హజరత్ సయ్యద్ అరీఫుల్లా తదితరులు తరలిరానున్నారు. నగరంలోని కోటమిట్ట అమీనియా మసీదు నుంచి ఊరేగింపుగా గంధాన్ని దర్గా ప్రాంగణానికి తీసుకువస్తారు.

- తొలిరోజున జిల్లా న్యాయమూర్తి యామిని, ఇతర న్యాయమూర్తులు తరలివచ్చి బారాషహీదులను దర్శించుకున్నారు. జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ దర్గాలో పర్యటించి భక్తులతో మాట్లాడారు.

కాగా అధికా రుల అంచనా ప్రకారం తొలిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష మందికిపైగా భక్తులు వచ్చి ఉంటారు. దర్గాలో భక్తుల కోసం నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ రమణయ్య, సిటీ ప్లానర్ దేవకుమారి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే మైనార్టీ నాయకులు షంషుద్దీన్, సయ్యద్ సమీహుసేనీ, షబ్బీర్‌ఖాన్, ఉత్సవ కమిటీ చైర్మన్ షేక్.ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- దర్గాలో భక్తులకు అందుతున్న సేవలపై ఎస్పీ కృష్ణకాంత్ ఆరా తీశారు. భక్తుల సంఖ్య, పరిస్థితులపై పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ అదనపు ఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణఆచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బారాషహీదుల దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తజనం



స్వర్ణాల చెరువులో భక్తుల కోలాహలం

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మనుబోలు, జూలై 17 : జిల్లావ్యాప్తంగా బుధవారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు నడిచి తమ భక్తిని చాటుకున్నారు. మొహర్రం సందర్భంగా మనుబోలు మండలం కాగితాలపూరు గ్రామంలో దర్గాల వద్ద రక్తం చిందించే (మాతం)కార్యక్రమం నిర్వహించారు. షియా ముస్లిములంతా గ్రామానికి చేరుకుని కత్తులు, బ్లేడులతో రక్తం చిందిస్తూ ప్రార్థనలు చేశారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. అంజుమన్ హుస్సేన్ కమిటీ చైర్మన్ మీర్జా వజీర్‌అలీ, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఫజల్‌అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎలాంటి అల్లర్లు, వివాదాలు జరగకుండా ఎస్ఐ. అజయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

కుష్ఠు వ్యాధిపై
నేటి నుంచి సర్వే

ఇంటింటా తిరగనున్న ఏఎన్ఎంలు, ఆశాలు

కొత్త కేసులు గుర్తించిన వారికి వైద్యసేవలు



నెల్లూరు (వైద్యం), జూలై 17 : కుష్ఠు వ్యాధిపై ప్రత్యేక సర్వే చేసేందుకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైద్య ఆరోగ్య శాఖ గురువారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో సర్వే చేపట్టనుంది. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరిగి వ్యాధిగ్రస్థులను గుర్తించనున్నారు. ఒంటిపై రెండుకు మించి మచ్చలు ఉన్నట్లయితే దాన్ని కుష్ఠు వ్యాధిగా అనుమానించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తిస్థాయి పరీక్షలు చేయించనున్నారు. ఈ సర్వే వివరాలను ఎప్పటి కప్పుడు సేకరించేందుకు అధికారులను నియమించారు. ఇప్పటివరకు జిల్లాలో 1034 మంది కుష్ఠువ్యాధిగ్రస్థులు ఉన్నారు. కుష్ఠువ్యాధి అం టువ్యాధి కాదని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పింఛను పెంపుతో ఊరట

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టాకు కుష్ఠు వ్యాధిగ్రస్థులకు ఇచ్చే పింఛను నగదు రూ. 3వేల నుంచి 6వేలకు పెంచారు. జిల్లాలో మొత్తం 490 మంది కుష్ఠువ్యాధిగ్రస్థులలో దివ్యాంగులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించి ఈ పింఛను అందిస్తున్నారు. అలాగే వాకర్లు, ఊతకర్రలు కూడా సరఫరా చేస్తున్నారు. మరోవైపు కుష్ఠువ్యాధిగ్రస్థులలో శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కూడా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ప్రభుత్వ ప్రోత్సాహం కింద రూ. 8వేలు అందిస్తోంది.

కుష్ఠువ్యాధి నియంత్రణకు చర్యలు

గురువారం నుంచి జరిగే కుష్ఠువ్యాధి సర్వేలో వ్యాధిగ్రస్థులను క్షుణ్ణంగా పరిశీలిస్తాము. గుర్తించిన వారికి పూర్తిస్థాయి వైద్యసేవలు అందిస్తాము. జిల్లావ్యాప్తంగా కుష్ఠువ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటు న్నాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వ్యాధి పూర్తిగా తగ్గే వరకు మందులను ఉచితంగా పంపిణీ చేస్తాము. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తాం.

- డాక్టర్ ఖాదర్‌వలి, కుష్ఠువ్యాధి నివారణ జిల్లా అధికారి

జనసేనలో చేరడానికి మేయర్ దంపతుల యత్నాలు?

వైసీపీకి చెందిన ఓ నేత నేతృత్వంలో ప్రయత్నం

మలుపు తిరుగుతున్న ఫోర్జరీ సంతకాల వ్యవహారం

వైసీపీ నేతల
పరకాయ ప్రవేశం!?

వైసీపీ నేతలు పరకాయ ప్రవేశ మంత్రం జపిస్తున్నారు. మంత్రం ఫలించి అన్నీ అనుకూలిస్తే ప్రభుత్వంలో భాగస్వామ్యులైన జనసేన, బీజేపీలలో చేరి మళ్లీ చక్రం తిప్పడానికి, తమ పదవులకు, ఆస్తులకు భంగం కలగకుండా, క్రిమినల్ కేసుల భయం లేకుండా ఎంచక్కా ఐదేళ్లు గడిపేందుకు ప్రయత్నాలు చేసుకొంటున్నారు. ఇలాంటి ప్రచారమే నెల్లూరు నగరంలో విస్తృతంగా నడుస్తోంది. నగర మేయర్ పొట్లూరి స్రవంతి దంపతులు జనసేన పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేసుకొంటున్నట్లు ప్రజల్లో విస్తృత చర్చ నడుస్తోంది. నగరంలో వైసీపీకి చెందిన ఓ నేత, మాజీ మంత్రి మేయర్ దంపతులను జనసేనలో చేర్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థలో కమిషనర్ ఫోర్జరీ సంతకాల బాగోతం పాఠకులకు తెలిసిందే. అక్యుపేషన్ సర్టిఫికెట్ (ఏసీ), మార్టిగేజ్ రిలీజ్ ఫైళ్లలో కమిషనర్ సంతకాలనే ఫోర్జరీ చేసి కోట్ల రూపాయలు దండుకున్నారని, కార్పొరేషన్ ఆదా యానికి కోట్లాది రూపాయలు గండి కొట్టారనే విషయం వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో అప్పటి కమిషనర్ వికాస్‌మర్మత్ స్వయంగా ఈ నెల 5వ తేదీన ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ ఉద్యోగులతోపాటు మేయర్ భర్త జయవర్ధన్ పేరును ఆ ఫిర్యాదు లో ప్రస్తావించారు. ఆ ఫిర్యాదును ఎస్పీ నగర డీఎస్పీకి బదలాయిం చారు. ఇవన్నీ జరిగి 12 రోజులు గడిచినా నేటికీ కేసులో పురోగతి లేదు. అంతేకాదు. ఎఫ్ఐఆర్ కూడా కట్టలేదు. ఇది ప్రజల్లో పలు అనుమా నాలను రేకెత్తిస్తోంది. ఫోర్జరీ సంతకాల కుంభకో ణాన్ని వెలుగులోకి తెచ్చిన న్యాయవాది కాకు మురళీరెడ్డి సైతం బుధవారం విలేకరుల సమావేశంలో కమిషనర్ ఫిర్యాదుపై ఎందుకు ఎఫ్ఐఆర్ చేయకపోవ డంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

అధికార రక్షణ కోసం

అధికార రక్షణ కోసం మేయర్ దంపతులు జనసేనలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు నగరంలో ఓ వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి వీరికి అండగా నిలిచి, జనసేన గూటికి చేర్చే బాధ్యతను భుజాన వేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మేయర్ భర్త, కార్పొరేషన్ ఉద్యోగులు చెన్నైలో వైసీపీ నేత వద్ద రక్షణ పొందుతున్నారనే ప్రచారం కూడా సాగుతోంది.

అదెలా సాధ్యం : జనసైనికులు

జనసేన గూటికి చేరాలనే వైసీపీ నాయకుల కదలికలను జనసైనికులు, టీడీపీ నాయకులు జాగ్రత్తగా గమనిస్తున్నారు. కొత్త వారిని పార్టీలోకి తీసుకునే విషయంలో పవన్ కల్యాణ్ చాలా క్లారిటీగా ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు అంటున్నారు. సచ్ఛీలురిని మాత్రమే పార్టీలోకి చేర్చుకోవాలని, అది కూడా వారు ప్రస్తుతం ఉన్న పదవికి రాజీనామా చేసి రావాలని పవన్ చెబుతున్నారని ఆ కోణంలో అయితే మేయర్ దంపతులకు జనసేనలోకి ప్రవేశం దొరకదని జనసేన వర్గాలు అంటున్నాయి. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అని రుజువు చేసే చాలా సంఘటనలు చూసిన ప్రజలు మాత్రం రాజకీయాల్లో ఏదైనా సాధ్యమనే నమ్ముతున్నారు.



గోవింద హరి గోవింద!

తెలుగువారి తొలి పండుగ తొలి ఏకాదశిని జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం ఉదయం నుంచే వైష్ణవ ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఇక ఉత్సవర్లకు ప్రత్యేక అలంకరణలు, ఊరేగింపులు నిర్వహించారు. నెల్లూరులోని రంగనాథస్వామి స్వర్ణగరుడుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.



సంగం: సారెతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు



ఉదయగిరి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

ఆత్మకూరు, జూలై 17 : తొలి ఏకాదశిని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, అలఘునాథస్వామి ఆలయం తోపాటు వివిధ ఆలయాల్లో భక్తులు బారులుదీరి పూజలు నిర్వహించారు.

సంగం : స్థానిక రామచంద్రాపురంలోని కోదండరామాలయంలో ఏకాదశి సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు.వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● కామాక్షిదేవికి సారె సమర్పణ

సంగంలోని సంగమేశ్వరాలయంలో వెలసిన కామాక్షిదేవికి ఏకాదశిని సందర్భంగా సారె సమర్పణ చేశారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు శా కాంబరీ అలంకారం చేశారు. మహిళలు ఇంటి వద్ద నుంచి సారె తీసుకుని స్థానిక పోలేరమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తప్పెట్లతో ర్యాలీగా బయలుదేరి సారెతో గ్రామోత్సవంగా సంగమేశ్వరాలయానికి చేరుకుని మొక్కు తీర్చుకున్నారు.

ఉదయగిరి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజ లు నిర్వహించారు. మండలంలోని గన్నేపల్లి, గండిపాళెం, కృష్ణంపల్లి, కుర్రపల్లి, అప్పసముద్రం, జీ.చెరువుపల్లి, చెర్లోపల్లి, అయ్యవారిపల్లి, శకునాలపల్లి, కొత్త పల్లి, పుల్లాయపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందచేశారు.

వింజమూరు : పట్టణంలోని తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని దేవాలయాల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, జూలై 17: మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన సూరిపోగు గురవయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులకు జీఎంకే ట్రస్టు చైర్మన్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన సాయిలు ఆర్థికసాయం అందజేశారు. వారు ఒక్కొక్కరు రూ.5 వేల చొప్పున తమ ప్రతినిధులచే కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బీ వెంకటేశ్వర్లు, షేక్ ఇమ్రాన్, భాస్కర్, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 17: దుత్తలూరు మెయిన్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి సర్వే

వరికుంటపాడు, జూలై 17: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించనున్నట్లు సీహెచ్‌వో రాజశేఖరరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి వ్యాధి సోకిన వ్యక్తులతో పాటు అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి ప్రభుత్వ వైద్యశాలల్లోనే ఉచితంగా చికిత్స, మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



గ్రామస్థులకు అవగహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏఎస్‌పేట, జూలై17: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు చెంచులరెడ్డి తెలిపారు.బుధవారం ఆయన గుడిపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిరిగిరి మహేష్‌రెడ్డి, నీలం వీరబ్రహ్మం, సురేష్ యాదవ్, సయ్యద్ మస్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



ఉదయగిరి గుంతబజార్ పీర్లచావిడి వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



అనంతసాగరంలో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లు

ఉదయగిరి, జూలై 17: మండలంలో బుధవారం ముస్లింలు మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పుల్లాయపల్లి, బిజ్జంపల్లి, గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, ఉదయగిరి గుంతబజార్, నాగుల బావివీధి పీర్లచావిడిలు, అబ్దుల్‌ఖాదర్‌ఖాన్‌షావలి దర్గా, ఆస్థానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు మొహర్రం విశిష్టతను వివరించారు.

వరికుంటపాడు: మండలంలోని తోటలచెరువుపల్లిలో బుధవారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. తొలుత పెద్ద వెంకటయ్యనాయన ఉరఫ్ ఖాశీం చిష్టి ఇంటి నుంచి గంధం, ప్రసాదాలను మేళతాళాలతో దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు పంచి పెట్టారు. అలాగే రాత్రికి అన్నదానంతో పాటు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పీర్ల చావిడితో పాటు దర్గాను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

సంగం: మండలంలోని వంగల్లు పీర్ల చావిడిలో మంగళవారం అర్థరాత్రి ముస్లింలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను అలంకరించి ట్రాక్టర్‌లో ఊరేగించారు. పీర్ల చావిడి వద్ద భక్తులు గుండం తొక్కారు.

అనంతసాగరం : మండలంలోని పలుగ్రామాల్లో మొహర్రంను ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిలో పీర్లను ప్రతేకంగా అలంకరించి మంగళవారం తెల్లవారు జామున ఊరేగించారు. బుధవారం షహదత్ కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.

కలువాయిలో కురుగొండ్ల జన్మదిన వేడుకలు



కలువాయిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కలువాయి, జూలై 17 : వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను బుధవారం కలువాయిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. వృద్ధుల ఆశ్రమంలో బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా శ్రీనివాసులరెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్ రెడ్డి, జగదల్ నాయుడు, చింతలాత్మకూరు సర్పంచి ప్రభావతి, హరినాయుడు, బీజేపీ నాయకులు దండు పెంచలయ్య, సుందరయ్య యాదవ్, నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, జూలై 17: మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో బుధవారం సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్పందించి ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ రంగానికి ఉదయం 7, 8 గంటలకు మాత్రమే విద్యుత్ సర ఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కుర్రపల్లి గ్రామం వద్ద ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామాలకు శుద్ధిజలాలు సరఫరా చేయాలన్నారు. గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు నడిపి ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ నాయబ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




ప్రమాదకరంగా మలుపు

సాగరం చెరువుపై

ప్రమాద ఘంటికలు

అనంతసాగరం, జూలై 17: అనంతసాగరం చెరువు కట్టపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. కట్టపై రెండు మలుపులు ఉండగా, ఇప్పటికే అక్కడ లెక్కలేనన్ని ప్రమాదాలు జరిగాయి. ఒక వైపు చెరువు, మరోవైపు లోయతో పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. అయినా ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. వేగ నియంత్రణ చర్యలు లేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



పచ్చదనం కరువయిన సోమశిల

అనంతసాగరం, జూలై 17: ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన సోమశిల జలాశయం నేడు పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరత కారణంగా కళ తప్పింది ప్రాజెక్టుపై ఎర్త్‌డ్యాం‌కు ఇరువైపులా పూలమొక్కలు, మధ్యలో పచ్చిక పెంచడంతో డ్యాం సందర్శనకు వచ్చే పర్యాటకులు జలాశయం ప్రాంతం లో కాసేపు విశ్రాంతి తీసుకొని ఆహ్లాదం పొందేవారు. నేడు ఆపరిస్థితి లేదు. పరిసరాలన్నీ బోసిపోయాయి. పూలకుండీలు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. మొక్కలకు నీరు పట్టక ఎండు ముఖం పట్టాయి. ఈక్రమంలో ప్రాజెక్టు అందాలు పర్యాటకులను నిరాశ పరుస్తున్నాయి.



ఎర్త్‌డ్యాంపై ఎండుముఖం పడుతున్న మొక్క



ఖాళీగా ఉన్న పూలకుండీలు

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే

కావలిటౌన్, జూలై17: పట్టణంలో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా చెట్టు దర్గా పీర్ల చావిడి, విష్ణాలయం వీధిలోని పీర్ల చావిడి, ముసునూరు పీర్ల చావిడిల వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్ల శుద్ధి నిర్వహించి, వేడుకలకు ముగింపు పలికారు. ఇస్లాంపేట సున్నీ మసీద్‌లో మత గురువు మొహర్రం ప్రాముఖ్యతను చాటి చెప్పారు. ఎమ్మెల్యే డీ కృష్ణారెడ్డి విష్ణాలయంవీధిలోని చావిడి వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు.

అల్లూరు : పట్టణంలో బుధవారం సాయంత్రం పీర్లను నీటి కొలనుకు తరలించారు. మంగళవారం అర్ధరాత్రి నార్తుమోపూరు నుంచి పీరు అల్లూరుకు వచ్చింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కు తీర్చుకున్నారు. మౌలాలీ దర్గాలో పీరుకు ఫాతెహాను నిర్వహించారు.



కావలి : పీర్ల వద్ద ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు



అల్లూరు : మౌలాలీ పీరుకు ఫాతెహాను నిర్వహిస్తున్న ముస్లింలు

ఊరూరా భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి



కావలి గీతా మందిరంలో సామూహిక లక్ష తులసీపూజ నిర్వహిస్తున్న భక్తులు

కావలిటౌన్, జూలై17: తొలిఏకాదశిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. కలుగోళశాంభవి ఆలయం, విష్ణాలయం, బృందావనం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పాతూరు శివాలయం, సత్యనారాయణస్వామి ఆలయం, వెంగళరావునగర్ ఆలయ సముదాయం, ముసునూరు హనుమత్ క్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున చేరుకుని పూజలు నిర్వహించారు. తొలిపండుగ తొలి ఏకాదశి కావటంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గీతా మందిరంలో సామూహిక లక్ష తులసి పూజ నిర్వహించారు.

కావలి రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. రామాలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో అలంకరించారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో తొలి ఏకాదశి సందర్భంగా పలువ ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాలక మండలి మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి -సుగుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో భజనలు, ప్రవచన కార్యక్రమాలు జరిగాయి. స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులకు దేవస్థానం వారు అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, అర్చకులు లక్ష్మీనరసింహచార్యులు, కళ్యాణ చక్రవర్తి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బోగోలు, చెంచులక్ష్మీపురం, విశ్వనాథరావుపేట, కొత్తూరు గ్రామాల్లోని రామాలయాల్లో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

కలిగిరి, జూలై 17: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్టీ నాలుగో విడత సభ్యత్వ నమోదును గురువారం నుంచి ఈనెల 28వరకు నిర్వహిస్తామన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల జీవితబీమా, రూ.50 వేలప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మద్దతుదారులు బండారు సుబ్బారావు, ఆరిమల్ల మల్లికార్జున, కోసూరి సురేష్, సునీల్, రాజ్‌కుమార్, నిశ్శకర సంతోష్, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తిని శిక్షించాలి

అల్లూరు, జూలై 17 : అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నాపేరూరులో అరుగుపై కూర్చుని ఉన్న దళితుడిని అవమానించి, గాయపరచిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పకడ్బందీ చట్టాలు అమలవుతున్న ఈరోజుల్లో ఇంకా దళితులపై దౌర్జన్యాలు, దారుణాలు కొనసాగడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

'ప్రకాశం'లో నూరుశాతం అడ్మిషన్లు

కందుకూరు, జూలై 17: అటానమస్ హోదా పొందిన ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఈ ఏడాది నూరుశాతం అడ్మిషన్లు జరిగాయని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, మెకానికల్ మినహా మిగిలిన అన్ని బ్రాంచిల్లో నూరుశాతం సీట్లు భర్తీ అయ్యాయన్నారు. మేనేజ్‌మెంట్ సీట్లు పదిరోజులక్రితమే భర్తీ అయ్యాయని ఆయన తెలిపారు.

రేపు ఇంటూరికి సన్మానం

కందుకూరు, జూలై 17: టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో ఆత్మీయ సన్మానసభ ఏర్పాటు చేస్తున్నట్లు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆరోజు సాయంత్రం పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి అధికసంఖ్యలో ఎస్సీలు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు బీజేపీ సమావేశం

కందుకూరు, జూలై 17: నియోజకవర్గ బీజేపీ విస్తృత స్థాయి సమావేశం గురువారం సాయంత్రం 4 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధరరెడ్డి సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీబాధ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

'టీఆర్ఆర్'కు అటానమస్ హోదా

కందుకూరు, జూలై 17: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఈ విద్యాసంవత్సరం నుంచి అటానమస్ హోదా ఇస్తూ ఉత్వర్వులు జారీచేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటానమస్ హోదా పదేళ్లపాటు కొనసాగుతుందని, ఆతర్వాత పునఃసమీక్ష ఉంటుందన్నారు.

ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ నియామకం

కావలి,జూలై17: స్థానిక ఏరియా వైద్యశాల నూతన కమిటీని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం ప్రకటించారు. కమిటీకి ఎమ్మెల్యే చైర్మన్‌గా కొనసాగనుండగా, తొలివిడతగా ముగ్గురు సభ్యులను ప్రకటించారు. టీడీపీకి చెందిన చవల రామకృష్ణ, ఆత్మకూరి నాగలక్ష్మి, జనసేనకు చెందిన పొబ్బా సాయివిఠల్‌ను సభ్యులుగా ప్రకటించారు. ప్రైవేట్ వైద్యశాలకు చెందిన ఒక డాక్టర్‌ను నియమించాల్సి ఉంది. మిగిలిన సభ్యులంతా వివిధ శాఖలకు చెందిన అధికారులు కొనసాగుతారు.

మహిళలకు సముచిత స్థానం : ఎమ్మెల్యే కావ్య

కావలి, జూలై17: పార్టీ పదవుల్లోనూ, ఇతర పదవుల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన మహిళలతో ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలవటం కోసం కృషిచేసిన ప్రతి ఒక్క మహిళకు ధన్యవాదాలు తెలిపారు. మీకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా కాపాడతానని చెప్పారు. మీ సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి. అర్షియా బేగం, మలిశెట్టి విజయలక్ష్మి, పలువురు మాజీ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● గంగపుత్రులకు అండగా ఉంటా...

బిట్రగుంట : ఎంతగానో ఆదరించి తన విజయానికి కృషి చేసిన గంగపుత్రులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం కొత్తబంగారుపాలెం మత్స్యకారులతో బుధవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ మత్స్యకారులతో తనకున్న సన్నిహిత సంబంధాలను వివరించారు. మత్స్యకారుల సమస్యలపై ఆప్కాప్ మాజీ చైర్మన్ కొండూరు పాల్‌శెట్టి ఎమ్మెల్యేకి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, రామకృష్ణ, కే.వెంకటేశ్వర్లురెడ్డి, సుధీర్‌బాబు, బాబూరావు, భాస్కర్, శీనయ్య హర్ష పాల్గొన్నారు.

ఊరేగింపుగా విగ్రహాల తరలింపు



విగ్రహాలతో వస్తున్న వాహనానికి స్వాగతం పలుకుతున్న బీద గిరిధర్ తదితరులు

అల్లూరు, జూలై 17 : మండలంలోని తూర్పుగోగులపల్లి చంద్రశేఖరపురం రామాలయంలో ప్రతిష్ఠ కోసం సీతారామ లక్ష్మణ, ఆంజనేయుల విగ్రహాలు బుధవారం గ్రామానికి చేరుకున్నాయి. శ్రీరామ మందిరం ట్రస్ట్ తరఫున చేపట్టిన ఆలయ నిర్మాణానికి అవసరమైన విగ్రహాలను స్థానికులు ముంతా సోదరులు సహకారంతో ఏర్పాటు చేశారు. తమిళనాడులోని కంచి నుంచి వీటిని ప్రత్యేక వాహనంలో తరలించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ విగ్రహాలతో వచ్చిన వాహనానికి దిష్టి తీసి గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తోట శీనయ్య, కీర్తి బాబూరావు, ట్రస్ట్ అధినేత డాక్టర్ కీర్తి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులు ఉంటే అన్నీ శుభాలే..!



కలిగిరమ్మను దర్శించుకున్న చెంచలబాబు

కలిగిరి, జూలై17: గ్రామదేవత కలిగిరమ్మను దర్శించుకుంటే అన్నీ శుభాలే జరుగుతాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం అమ్మవారికి జరిగిన ప్రత్యేక అభిషేకాలు, పూజాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ రవీంద్రబాబు, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, ఊసా మాల్యాద్రి,నిశ్శంకర సురేష్, కొండపల్లి వెంకట్రావు, కర్నాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి పొంగళ్లు, ఎ యంత్రం ఆలయం చుట్టూ ప్రభలు తిరగడం, రాత్రికి సుడిమాను ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలోని కట్టడాలు కూల్చేయాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కందుకూరు, జూలై 17: పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌కు సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, నిర్మించిన కట్టడాలను కూల్చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యుడు ఎస్కే హుస్సేన్‌లు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని కొందరు దర్జాగా భవనాలు నిర్మించుకుంటుంటే రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తున్నదన్నారు. కొందరు అధికారులే వారికి సహకరిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పట్టణ శివార్లలో ఎక్కడైనా నిరుపేదలు తలదాచుకునేందుకు ప్రభుత్వస్థలంలో గుడిసెలు వేసుకుంటే హడావిడిగా ప్రొక్లెయిన్‌లు తీసుకెళ్లి వాటిని కూల్చివేయిస్తున్న రెవెన్యూ యంత్రాంగం కోట్ల విలువైన స్థలాలను ఆక్రమించిన భూకబ్జాదారుల జోలికి ఎందుకు వెళ్లటం లేదని వారు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వస్థలంలో నిర్మించి ఉన్న భవనాలను వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సోనా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై గుంతలు : రాకపోకలకు ఇబ్బందులు



కావలి, జూలై17: పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ ఫుట్‌పాత్ దెబ్బతిని గుంతలు పడ్డాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ నడిబొడ్డున రైల్వే ట్రాక్ ఉండటంతో అటూఇటూ రాకపోకలు సాగించేందుకు ఒకే రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉంది. కావలికి పడమర వైపున ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగించేవారికి కూడా ఈ వంతెనే దిక్కు. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతోపాటు ఫుట్‌పాత్‌పై ప్రజల రాకపోకలతో ఆర్వోబీ రద్దీగా ఉంటుంది. అలాంటి వంతెనపై ఉన్న ఫుట్‌పాత్ దెబ్బతిని గుంతలు పడి పోవటంతో పాదచారులు దానిపై రాకపోకలు సాగించాలంటే తరచూ ప్రమాదాలకు గురౌతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చాలి.